www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
ఆదివారం
18-08-2024
సంపుటి : 01 | సంచిక : 106 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ CMD

## కర్ణాటకకు తరలిపోయిన ఫాక్స్‌కాన్!

- సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయిన మరుసటి రోజే ప్రకటన
- రాష్ట్ర ప్రభుత్వానికి ఇరకాటం
- ప్రతిపక్షాలకు విమర్శనాస్త్రం..
- విమర్శల దాడికి పదును పెడుతున్న బీఆరెస్ వర్గాలు




**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాల సహాయసహకారాలు అందజేస్తామని మాట ఇచ్చినప్పటికీ, ఫాక్స్‌కాన్ సంస్థ తన విద్యుత్ వాహన విడిభాగాల తయారీ ప్లాంటును కర్ణాటకలో మిగతా2లో...

## పెట్టుబడులపై ప్రతిపక్షాల దుష్ప్రచారం తగదు

- 19 సంస్థలతో చర్చలు.. రూ.31,500 కోట్ల ఒప్పందాలు
- రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రావాలనేది ఈ ప్రభుత్వ లక్ష్యం
- యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం
- మూసీ సుందరీకరణపై ప్రపంచబ్యాంకు అధ్యక్షుడితో చర్చించాం
- మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



**విశ్వంభర, హైదరాబాద్:**

తెలంగాణ అభివృద్ధి కోసం 19 సంస్థలతో రూ.31,500 కోట్ల విలువైన ఒప్పందాలు చేసుకున్నట్లు ఐ.టి. శాఖమంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. శనివారం సచివాలయంలో ఇష్టాగోష్టిలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. మూసీ సుందరీకరణపై ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడితో చర్చించామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. పెట్టుబడులతో 30,750 ఉద్యోగాలు వచ్చేలా ఒప్పందాలు చేసుకున్నట్లు వివరించారు. దక్షిణ కొరియాలో దాదాపు 12 సంస్థలతో మిగతా2లో...

### వెంకయ్యనాయుడిని కలిశాకే

## నా జీవితం బాగుపడింది

**మన దేశంలో సహజ వనరులు పుష్కలం**

**పేద విద్యార్థులు, గృహిణులకు ఉపాధి కల్పించి స్వంత కాళ్లపై నిలబడేలా స్వర్ణ భారతి ట్రస్ట్ సేవలు**

**ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్**



**విశ్వంభర, నెల్లూరు:** ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని అక్షర విద్యాలయం స్వర్ణభారత్ ట్రస్ట్ సేవలు పరిశీలించారు. వారు అందిస్తున్న మిగతా10లో...



## ఫ్యూచర్ సిటీకి రోడ్డు, మెట్రో కనెక్టివిటీ

- ఔటర్ టు ఆర్ఆర్ఆర్ వరకు కనెక్టివిటీ ఉండేలా రోడ్డు మ్యాప్ తయారు చేయాలి
- కొత్త హైకోర్టు నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్టు మీదుగా మెట్రో మార్గం
- ప్రణాళికలు రూపొందించాలని ఆదేశాలు
- క్రీడా విశ్వవిద్యాలయం ఏర్పాటుకు నిర్ణయం..
- అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష

**విశ్వంభర, హైదరాబాద్:** ఫ్యూచర్ సిటీకి రోడ్డు, మెట్రో కనెక్టివిటీపై సిఎం రేవంత్ అధికారులతో చర్చించారు. ఈ రూట్ మ్యాప్ గురించి అధికారులు సిఎంకు వివరించారు. 'ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రణాళికలపై' జూబ్లీహిల్స్ నివాసంలో అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఈ సమావేశం నిర్వహించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకు కనెక్టివిటీ రూట్ మ్యాపును అధికారులు సీఎంకు వివరించారు. అవుటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకు కనెక్టివిటీ ఉండేలా రోడ్ మ్యాప్ తయారు చేయాలని సీఎం సూచించారు. మిగతా2లో...

## ప్రధానితో చంద్రబాబు భేటీ

**అమరావతి, పోలవరంపై చర్చ**

**నిధుల విడుదలపై వాకబు**

**వెనకబడిన 8 జిల్లాలకు ఆర్థికసాయం చేయాలని కోరిన బాబు**



2

### మూడో విడత రుణమాఫీ డబ్బులు అందని వారికి

## శుభవార్త

**సర్కారు సరికొత్త నిర్ణయం!**

**ఫిర్యాదుల నమోదు,పరిష్కారానికి మార్గదర్శకాలు**



2

### పకడ్బందీగా...ప్రశాంతంగా

## గణేశ్ ఉత్సవాలు

- హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచేలా నిర్వహిస్తాం
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి
- కమాండ్ కంట్రోల్ కేంద్రంలో అధికారులతో సమీక్ష



2

### రైతులందరికీ రూ. 2లక్షల లోపు

## రుణమాఫీ చేశాం

- 22,37,848 ఖాతాలకు రూ.17933.19 కోట్ల నిధులు
- మాది చేతల ప్రభుత్వం.. దిగజారుడు రాజకీయాలు రావు
- రైతులను అయోమయానికి గురిచేసేలా ప్రతిపక్ష నాయకులు ప్రవర్తించడం దురదృష్టకరం
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు



9

### హైదరాబాద్‌లో యంగ్

## ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ!

- అందులోనే 12 క్రీడల అకాడమీలు
- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం



2

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి

## ర్యాగింగ్ చేసే వారిని వదిలేపెట్టబోం

- డ్రగ్స్ సప్లై చేసినా, వాడిన వారిపై కఠిన చర్యలు
- తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి
- పిల్లల ప్రవర్తనలో తేడాలు గమనిస్తే వెంటనే వారితో మాట్లాడాలి
- తెలంగాణ డీజీపీ జితేందర్



**విశ్వంభర, హైదరాబాద్:**

ర్యాగింగ్ చేసే వారిని వదిలేపెట్టబోమని డీజీపీ జితేందర్ హెచ్చరించారు. ర్యాగింగ్ పెద్ద సమస్యగా మారిందని, ర్యాగింగ్ కు పాల్పడినా, డ్రగ్స్ సప్లై చేసినా, వాడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. డ్రగ్స్ పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లల ప్రవర్తనలో మిగతా2లో...

## తొండిలో తోపు... తిట్టడంలో టాపు

**సీఎం రేవంత్‌రెడ్డిపై నిప్పులు చెరిగిన మాజీ మంత్రి హరీశ్‌రావు**

రైతు రుణమాఫీ పేరుతో అన్నదాతలను మోసం చేశారు..

క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని డిమాండ్



**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** రైతు రుణమాఫీ పేరుతో అన్నదాతలను మోసం చేశారని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. మిగతా3లో...



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 100 | రిటైల్ ₹ 122 |
| స్కిన్ ₹ 177 | స్కిన్ లెస్ ₹ 201 |

### ప్రముఖ గాయని పి.సుశీలకు అస్వస్థత



**చెన్నై:** ప్రముఖ సినీ నేపథ్య గాయని, పద్మభూషణ్ గ్రహీత పి.సుశీల అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆమెను చెన్నైలోని కావేరి ఆసుపత్రికి మిగతా2లో...

### రాయచోటిలో ముగ్గురి

## సజీవదహనం

**మృతుల్లో తల్లీ..ఇద్దరు పిల్లలు**

**ఘటనపై అనేక అనుమానాలు**

10

విశ్వంభర
V3 NEWS

# పెట్టుబడులపై ప్రతిపక్షాల దుష్ప్రచారం తగదు

**(మొదటి పేజీ తరువాయి)**

చర్చలు జరిపామన్న ఆయన, మూసీ పునరుజ్జీవనం కోసం కొన్ని అధ్యయనాలు చేశామని తెలిపారు.పెట్టుబడులపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేయడం తగదని మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. కొన్ని కంపెనీలు ఇతర రాష్ట్రాలకు తరలివెళ్తున్నాయని ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయి. కంపెనీలు వారి విధానాల ప్రకారం ప్లాంట్లను విస్తరిస్తాయి. కార్నింగ్ సంస్థ కంపెనీ విస్తరణపై కొత్తగా ఒప్పందం చేసుకుంది. కాగ్నిజెంట్, అమెజాన్ వంటి ప్రముఖ సంస్థలు తమ కార్యకలాపాలు విస్తరిస్తున్నాయని తెలిపారు.రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తరలి వచ్చి ఉపాధిని సృష్టించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. "రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రావాలనేది ఈ ప్రభుత్వ లక్ష్యం. అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులు తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. పెట్టుబడులకు రాష్ట్రంలో మంచి వాతావరణం ఉందని వివరించేందుకు విదేశాలకు వెళ్లాం. రాబోయే 20 ఏళ్లపాటు కాంగ్రెస్ లక్ష్యం, గమ్యం ఏమిటో పలు సంస్థలకు వివరించాం. దక్షిణకొరియాలో అనేక కంపెనీలతో చర్చలు జరిపాం. రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం" అని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. జీనోమ్ వ్యాలీలో ఫాల్కనెక్స్ కంపెనీ విస్తరణకు ముందుకు వచ్చిందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో మెగా ఆర్ అండ్ డీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని హ్యుందాయ్ కంపెనీ ముందుకు వచ్చిందన్న ఆయన హైదరాబాద్‌లో ఫ్యాషన్ సిటీని ఏర్పాటు చేస్తామని యంగ్‌వన్ కంపెనీ ముందుకువచ్చిందని వివరించారు. ఎల్ఈడీ స్క్రీన్ల ఆర్ అండ్ సెంటర్ ఏర్పాటు చేస్తామని సీటెక్ సంస్థ చెప్పిందని వెల్లడించారు.

## ప్రధానితో చంద్రబాబు భేటీ..

**అమరావతి, పోలవరంపై చర్చ**

**దిల్లీ:** ఏపీ సీఎం చంద్రబాబు దిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ప్రధానితో చర్చించినట్టు సమాచారం. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అయ్యే పూర్తి ఖర్చును భరిస్తామని కేంద్రం హామీ ఇచ్చిన నేపథ్యంలో.. ఆయా నిధుల మంజూరుపై ప్రధానితో మాట్లాడినట్లు తెలుస్తోంది. రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం చేయనున్నట్లు ఇటీవల జరిగిన బడ్జెట్ సమావేశాల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఈ నిధుల విడుదలపైనా చంద్రబాబు వాకబు చేసినట్లు సమాచారం. అంతేకాకుండా వెనకబడిన జిల్లాల జాబితాలో ఉన్న 8 జిల్లాలకు ఆర్థికసాయం కింద నిధులు విడుదల చేయాలని ప్రధాని మోదీని చంద్రబాబు కోరినట్లు తెలుస్తోంది.

## ర్యాగింగ్ చేసే వారిని వదిలేపెట్టబోం

**(మొదటి పేజీ తరువాయి)**

తేడాలు గమనిస్తే వెంటనే వారితో మాట్లాడాలని సూచించారు. డ్రగ్స్ నివారణ, యాంటీ ర్యాంగింగ్ పై శనివారం మాసబ్ ట్యాంక్ జేఎన్ ఏ ఎఫ్ఎయూ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో డీజీపీ జితేందర్, హైదరాబాద్ సీపీ కొత్త కోట ప్రభాకర్, సందీప్ శాండిల్యా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడారు. ర్యాగింగ్ కారణంకా కొంత మంది విద్యార్థులు కాలేజీలకు దూరం అవుతున్నారని అన్నారు. ర్యాగింగ్ అనేది బ్యాన్ చేయబడిందని అటువంటి వాటికి పాల్పడవద్దని సూచించారు. ర్యాగింగ్ వల్ల చాలా మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ర్యాగింగ్ ను అరికట్టేందుకు పోలీసు శాఖ వైపు నుంచి అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ర్యాగింగ్ ట్రాప్ లో ఎవరూ పడవద్దని హెచ్చరించారు. ఈ హాల్ లో కూర్చున్న వారంతా పోలీసులకు అంబాసీడర్లని ర్యాగింగ్ భూతాన్ని అరికట్టేందుకు సహకరించాలన్నారు. యువత డ్రగ్స్ కు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని డ్రగ్స్ కారణంగా వారి జీవితాలనే కాకుండా వారి కుటుంబాలను కూడా ఇబ్బందుల పాలు చేస్తున్నారని చెప్పారు.

## ప్రముఖ గాయని పి.సుశీలకు అస్వస్థత

**(మొదటి పేజీ తరువాయి)**

తరలించి చికిత్స అందిస్తున్నారు. 86 ఏళ్ల సుశీల గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. శనివారం ఆమెకు కడుపులో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యులు వెంటనే చికిత్స ప్రారంభించారు. ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు ఆసుపత్రి వర్గాల సమాచారం. సుశీల ఆరోగ్యం గురించి ఆందోళన చెందవద్దని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఆమె తొందరగా కోలుకోవాలని సన్నిహితులు, అభిమానులు పేర్కొంటున్నారు.

## జోక్యం చేసుకోండి..
### ప్రధాని మోదీకి ఐఎంఏ లేఖ

**దిల్లీ:** కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశాన్ని కుదిపేస్తోంది. దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనకు నిరసనగా భారత వైద్య సంఘం (ఐఎంఏ) పిలుపు మేరకు వైద్యులు సమ్మె చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రధాని నరేంద్ర మోదీకి ఐఎంఏ ఓ లేఖ రాసింది. భారతీయ వైద్యుల్లో 60 శాతం మంది మహిళలే ఉన్నారని, ప్రస్తుత వ్యవహారంలో జోక్యం చేసుకోవడం.. కేవలం మహిళా వైద్యులకే కాకుండా.. పనిచేస్తున్న మహిళలందరికీ ఆత్మవిశ్వాసాన్ని చేకూర్చుతుందని పేర్కొంది. జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన వైద్యరంగాన్ని, యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనతో.. రెండు అంశాలు వెలుగుచూశాయి. ఒకటి.. మహిళలకు సురక్షితమైన విశ్రాంతి సౌకర్యాలు లేకపోవడం, రెండు.. సరైన భద్రతా ప్రొటోకాల్స్ లేని కారణంగా వల్ల దాడులు జరగడం. వృత్తిస్వభావం రీత్యా వైద్యులు.. ముఖ్యంగా మహిళా సిబ్బంది హింసకు గురయ్యే అవకాశాలు ఎక్కువ. ఈ నేపథ్యంలో ఆసుపత్రులు, వైద్య కళాశాలల్లో సరైన భద్రత కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది" అని ఐఎంఏ తన లేఖలో పేర్కొంది. ఈ క్రమంలోనే పలు డిమాండ్లను ప్రస్తావించింది.

- వైద్యసేవలు, ఆస్పత్రులకు సంబంధించిన చట్టాలను పటిష్ఠం చేయాలి.
- ఆస్పత్రుల్లోనూ విమానాశ్రయాల మాదిరి భద్రతా ప్రొటోకాల్స్ అమలు చేయాలి. వాటిని సేఫ్ జోన్ లుగా ప్రకటించాలి.
- వైద్యుల పని ప్రదేశంలో పరిస్థితులను మార్చాలి. తగినన్ని విశ్రాంతి గదులు అందుబాటులో ఉంచాలి.
- నేరాల విషయంలో పకడ్బందీ దర్యాప్తు జరపాలి. నిర్ణీత కాలవ్యవధిలో న్యాయం అందించాలి.
- బాధిత కుటుంబానికి గౌరవప్రదమైన పరిహారం అందించాలి.



# కర్ణాటకకు తరలిపోయిన ఫాక్స్‌కాన్!

**(మొదటి పేజీ తరువాయి)**

నెలకొల్పడానికి మొగ్గు చూపింది. . ప్రాజెక్ట్ చీతా పేరుతో నెలకొల్పబోయే ఈ ప్లాంట్ చైనా ప్లాంట్ తర్వాత అతి పెద్దది. ప్రపంచంలో అతిపెద్ద ఐఫోన్ తయారీదారు ఫాక్స్‌కాన్ కొత్తగా తయారుచేయబోయే ఎలక్ట్రిక్ వాహన యంత్ర విడిభాగాల తయారీ, అసెంబ్లీ (మెకానికల్ కంపోనెంట్స్ ఇన్ ఎలక్ట్రిక్ వెహికల్ ) యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి కర్ణాటక రాష్టాన్ని ఎంపిక చేసుకుంది. తైవాన్ కంపెనీ హోన్ హయ్ టెక్నాలజీ గ్రూప్‌కు చెందిన ఫాక్స్‌కాన్, దొడ్డబళ్లాపూర్ లో రూ.25వేల కోట్లతో ఈ ప్లాంట్ నెలకొల్పనుంది. ఫాక్స్‌కాన్ ఛైర్మన్ యూంగ్ లియూ తో చర్చల అనంతరం, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య మాట్లాడుతూ, ప్రభుత్వం ఫాక్స్‌కాన్‌కు పూర్తి సహాయసహకారాలు అందజేస్తుందని, నీరు, విద్యుత్, రహదారుల దగ్గర నుంచి న్యాయసేవలు కూడా అందిస్తామని ఆయన స్పష్టం చేసారు. బెంగళూరు రూరల్ జిల్లాలోని దేవనహల్లి తాలూకా, దొడ్డబళ్లాపూర్ ఐటీఐఆర్ ప్రారిశ్రామిక ప్రాంతంలో ఫాక్స్‌కాన్‌కు 300 ఎకరాల భూమిని కేటాయించారు. ఈ ప్రాజెక్ట్ వల్ల 50 వేల ఉద్యోగాలు వస్తాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

అనంతరం, ఫాక్స్‌కాన్ ఛైర్మన్ యూంగ్ లియూ మాట్లాడుతూ, త్వరలో ఈ ప్లాంట్, చైనాలోని ప్లాంట్ తర్వాత అతిపెద్దదిగా మారబోతోందని , దాదాపు 40వేల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు కల్పిస్తుందని




తెలి పారు . అవి కూడా ప్రత్యేకించి మధ్యస్తంగా చదువుకున్నవారికేనని చెప్పిన లియూ, ఇది ఇక్కడితో ఆగదని, తాము మరిన్నిరంగాల్లోకి విస్తరించడానికి ప్రణాళికలు రచిస్తున్నామని, పరస్పర విశ్వాసముంటే ఏదైనా సాధించవచ్చని ఆయన ధీమా వ్యక్తం చేసారు. ఫాక్స్‌కాన్‌కు ఇదివరకే దొడ్డబళ్లాపూర్‌లో ప్రాజెక్ట్ ఎలిఫెంట్ పేరుతో 300 ఎకరాల విస్తీర్ణంలో ఒక ప్లాంట్ ఉంది. దాని తర్వాత ఇది రెండోది. అక్కడ ప్లాంట్ నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖమంత్రి శ్రీధ ర్‌బాబుతో కలిసి, దిల్లీలో ఫాక్స్ కాన్ ఛైర్మన్‌తో సమావేశమైన మర్నాడే ఈ నిర్ణయం వెలువడటం గమనార్హం. సీఎం రేవంత్ రాష్ట్రంలో ప్లాంట్ నెలకొల్పాలనే నిర్ణయం తీసుకుంటే అన్నివిధాల సహాయసహకారాలందిస్తామని వారికి హామీ ఇచ్చారు. సమాధానంగా యూంగ్ లియూ కూడా తెలంగాణను సందర్శిస్తానని సీఎం కు మాటిచ్చారు. అదేరోజు బెంగళూరు వెళ్లిపోయిన ఫాక్స్‌కాన్ బృందం సాయంత్రం ముఖ్యమంత్రితో సమావేశం కావడం, అది పూర్తయిన వెంటనే సిద్దరామయ్య ఫాక్స్‌కాన్ రెండో ప్లాంట్ గురించిన సమాచారాన్ని విడుదల చేయడం ఆశ్చర్యానికి గురిచేసింది.

**ప్రతిపక్షాలకు విమర్శనాస్త్రం...**

ఫాక్స్‌కాన్ తరలిపోతుందన్న బీఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సందేహాలు వ్యక్తం చేస్తున్న క్రమంలోనే ఆ సంస్థ బెంగుళూర్‌కు తరలిపోవడం సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సహజంగానే ఇరకాటంగా మారింది. నిన్న అమర్ రాజా నేడు ప్యాక్స్‌కాన్ అంటూ బీఆరెస్ వర్గాలు విమర్శల దాడికి పదును పెడుతున్నాయి. గతంలో అప్పటి సీఎం కేసీఆర్ తో ఫాక్స్‌కాన్ మార్చి 2, 2023న,ఒక ఒప్పందాన్ని ఖరారు చేసుకుని, మూడు వారాల్లోపే, మార్చి 15న కొంగరకలాన్ లో ప్లాంట్‌కు భూమిపూజ చేసింది. అక్కడ యాపిల్ ఎయిర్‌పాడ్స్ తయారుచేస్తారని తెలిపింది. ఇందుకోసం 500 మిలియన్ డాలర్లు($500 Million) వెచ్చించిన ఫాక్స్‌కాన్, దీని ద్వారా 25వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని, ఇది ఇంకా పెరుగుతాయని చెప్పింది. ప్రస్తుతం నిర్మాణ కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి.

# మూడో విడత రుణమాఫీ డబ్బులు అందని వారికి శుభవార్త

**విశ్వంభర, హైదరాబాద్ :** ప్రభుత్వం మూడో విడత రుణమాఫీ చేసినా నిధులు అందని వారి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మూడో విడత రుణమాఫీని.. ఈ నెల 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లా వైరాలో ప్రారంభించిన విషయం తెలిసిందే. దీంతో శుక్రవారం నుంచి చాలా మంది రైతుల ఖాతాల్లో ఇందుకు సంబంధించి నిధులు జమవుతున్నాయి. అయితే, మరికొంతమందికి రుణమాఫీకి అన్ని అర్హతలూ ఉండి కూడా అకౌంట్లలో డబ్బులు పడడం లేదు. దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో.. అర్హతలున్న రైతులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంది. రుణమాఫీకి అన్ని అర్హతలున్నా.. రైతుల అకౌంట్లలో డబ్బులు జమ కాకపోవడానికి కొన్ని కారణాలుంటాయి. అవేంటంటే.. రేషన్ కార్డులు లేకపోవడంతో ఫ్యామిలీ నిర్ధారణ కాకపోవడం, ఆధార్ కార్డులో తప్పులు, బ్యాంక్ - ఆధార్ వివరాల్లో తేడాలు, పట్టాదారు పాస్ పుస్తకం లేకపోవడం, అసలు-వడ్డీ లెక్కల్లో తేడాల కారణంగా చాలా మందికి రుణమాఫీ కాలేదు. అయితే, వీరికి న్యాయం చేయడానికి ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించనుంది. ఈ మేరకు వ్యవసాయ శాఖ జులై 15న జారీచేసిన జీవో నంబరు 567కు అనుబంధంగా రాష్ట్ర శుక్రవారం ఒక సర్క్యులర్ జారీచేసింది. ఇందులో ఫిర్యాదుల నమోదు, పరిష్కారానికి సంబంధించి కొన్ని మార్గదర్శకాలు, సూచనలు చేసింది. స్పెషల్ డ్రైవ్ బాధ్యతలను మండల వ్యవసాయ అధికారులకు (ఎంఏవో) అందజేస్తూ వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి ఆదేశాలు జారీచేశారు. వ్యవసాయ శాఖ అధికారులు రుణమాఫీ కానీ వారి ఇంటికి వెళ్లి తప్పులను సరి చేసి క్రాప్ లోన్ వీవర్ (సీఎల్‌డబ్ల్యూ) పోర్టల్ లో అప్‌లోడ్ చేస్తారు.



డైలీ సాయంత్రం 5 గంటలకు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి, మండలాల వారీగా ఫిర్యాదుల సంఖ్య, రోజువారీ నివేదిక అందిస్తారు. ఆధార్ కార్డులో ఏమైనా తప్పులుంటే.. రైతుల వద్దకు వెళ్లి ఆధార్ తీసుకుని, పోర్టల్‌లో సరైన కాపీని అప్‌లోడ్ చేస్తారు.

ఓటరు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, రైతు రేషన్ కార్డు వంటి ఇతర గుర్తింపు పత్రాలను రైతుల నుంచి సేకరించి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఒకవేళ రేషన్ కార్డు లేక కుటుంబ నిర్ధారణ కాకపోతే.. మండల వ్యవసాయ అధికారి రైతుల ఇంటికి వెళ్లాలి. రైతు తెలిపిన కుటుంబ వివరాలను నిర్ధారించి పోర్టల్ అప్‌లోడ్ చేయాలి. ఒకవేళ రైతుకు పట్టాదారు పాస్‌బుక్ లేదని పోర్టల్‌లో చూపిస్తే.. రైతు దగ్గర నుంచి పట్టాదారు పాస్‌బుక్ తీసుకొని పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. అలాగే ఆధార్ కార్డులోని పేరు, లోన్ ఖాతాలోని పేరులో తేడాలుంటే.. అధికారులు రైతుని గుర్తించి, లోన్ తీసుకున్న వ్యక్తి ఆధార్ నంబర్‌ను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. తీసుకున్న రుణం, వడ్డీ మొత్తంలో తేడాలొస్తే.. రైతు నుంచి దరఖాస్తు తీసుకోవాలి. రుణం ఎంత తీసుకున్నారు? ఎప్పుడు తీసుకున్నారు? వడ్డీ ఎంత అయింది? అసలు- వడ్డీ కలిపి మొత్తం ఎంత అనే వివరాలను పేర్కొంటూ పోర్టల్‌లో అధికారులు అప్‌లోడ్ చేయాలి. తప్పులను సరిదిద్దమని సంబంధిత బ్యాంకులకు వివరాలను పంపించాలి.

**రూ.2 లక్షల పైన రుణం ఉన్నవారికి నాలుగో విడతలోనే!**

రుణమాఫీలో భాగంగా రూ.2 లక్షలకుపైగా ఉన్నవారికి నాలుగవ విడతలో రుణమాఫీ చేస్తారని సమాచారం. రూ.2 లక్షలకుపైగా రుణం ఉన్నవారు.. ఆ ఎక్కువ మొత్తాన్ని మొదట రైతులు చెల్లించాలి. ఆ తర్వాత గవర్నమెంట్ రూ.2 లక్షలను మాఫీ చేస్తుంది. అయితే, రైతులు రూ.2 లక్షలకు పైగా ఉన్న మొత్తాన్ని ఎప్పటిలోగా చెల్లించాలి ? అనే విషయంలో మాత్రం ఇంకా స్పష్టత ఇవ్వలేదు. దీనిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# హైదరాబాద్‌లో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ..!

**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్‌లో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న ఫ్యూచర్ సిటీ(ఫోర్త్ సిటీ)లో నిర్మించే స్పోర్ట్స్ హబ్‌లో దీన్ని ఏర్పాటు చేస్తారు. ఈ స్పోర్ట్స్ యూనివర్సిటీలో సుమారు 12 వివిధ క్రీడల అకాడమీలను ఇందులో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. వీటిలో అంతర్జాతీయ స్థాయి అధునాతన మౌలిక వసతులు కల్పిస్తారు. ఈ స్పోర్ట్స్ హబ్ లో స్పోర్ట్స్ సైన్స్ సెంటర్, స్పోర్ట్స్ మెడిసిన్ సెంటర్ కూడా ఉండేలా ఏర్పాట్లు చేస్తారు. కొత్తగా స్థాపించిన స్కిల్ యూనివర్సిటీ తరహాలోనే తెలంగాణ స్పోర్ట్స్ యూనివర్సిటీకి "యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ" అనే పేరు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనువైన స్థలం కోసం హకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్, గచ్చిబౌలిలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను పరిశీలిస్తున్నారు. సదరు క్యాంపస్ ను ఒలింపిక్స్ స్థాయి అంతర్జాతీయ ప్రమాణాలుండేలా అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల దక్షిణ కొరియాలో పర్యటించినప్పుడు సియోల్ లోని కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీనిని సందర్శించారు. ఇది ప్రపంచంలోనే పేరొందిన స్పోర్ట్స్ యూనివర్సిటీగా ప్రత్యేకత చాటుకుంది. ఇటీవల ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో దక్షిణ కొరియా మొత్తం 32 పతకాలు గెలుచుకోగా, అందులో 16 పతకాలు కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీలో శిక్షణ పొందిన అథ్లెట్లు సాధించినవే కావడం గమనార్హం. ఈ యూనివర్సిటీలో శిక్షణ పొంది, పారిస్ ఒలింపిక్స్‌లో ఆర్చరీ విభాగంలో మూడు బంగారు పతకాలు సాధించిన అథ్లెట్ లిమ్ సీ-హైయోన్‌ను సీఎం రేవంత్ రెడ్డి కలిసి అభినందించారు. భవిష్యత్ ఒలింపిక్ ఛాంపియన్లకు శిక్షణ ఇచ్చేలా తెలంగాణ యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్శిటీకి సాంకేతిక భాగస్వాములుగా కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ సేవలు వాడుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

## ఫ్యూచర్ సిటీకి రోడ్డు, మెట్రో కనెక్టివిటీ

**(మొదటి పేజీ తరువాయి)**

ఫ్యూచర్ సిటీలో రేడియల్ రోడ్స్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కొత్త హైకోర్టు నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మీదుగా ఫ్యూచర్ సిటీకి మెట్రో మార్గం ప్రణాళికలు చేయాలన్నారు. రోడ్, మెట్రో మార్గాలకు భూసేకరణ ఇతర అంశాలపై అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. త్వరగా పూర్తి స్థాయి ప్రణాళికలు, రూట్ మ్యాప్ సిద్ధం చేసి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలన్నారు.ఈ సమావేశంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డిలు పాల్గొన్నారు.

**క్రీడా విశ్వవిద్యాలయం ఏర్పాటుకు నిర్ణయం..**

తెలంగాణలో క్రీడా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. హకీంపేట లేదా గచ్చిబౌలిలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీకి ప్రతిపాదించారు. స్పోర్ట్స్ మెడిసిన్, స్పోర్ట్స్ సైన్స్ సహా సుమారు డజనుపైగా కోర్సులు ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇటీవల సియోల్లో కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీని సీఎం రేవంత్ రెడ్డి సందర్శించారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీలో భాగస్వామ్యానికి కేఎన్ఎస్ఈయూ ప్రాథమికంగా అంగీకరించిందని ఈ సందర్భంగా సీఎం తెలిపారు.

## తెలంగాణ మహిళా కమిషన్ ఎదుట విచారణకు హాజరవుతా: కేటీఆర్



**హైదరాబాద్:** ఈనెల 24న తెలంగాణ మహిళా కమిషన్ ఎదుట విచారణకు హాజరవుతానని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఎనిమిది నెలల్లో రాష్ట్రంలో మహిళలపై జరిగిన అన్ని ఘటనల వివరాలు కమిషన్కు తెలియజేస్తానని చెప్పారు. బహిరంగ క్షమాపణ చెప్పిన తర్వాత కూడా నోటీసులు ఇచ్చారన్నారు. తాను చట్టాన్ని గౌరవించే వ్యక్తినని, మహిళా ఎమ్మెల్యేలను సీఎం, కాంగ్రెస్ నేతలు అన్న మాటలను కూడా మహిళా కమిషన్ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు కేటీఆర్ చెప్పారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను సుమోటోగా తీసుకున్న తెలంగాణ మహిళా కమిషన్ శుక్రవారం ఆయనకు నోటీసులు జారీ చేసింది. ఈ నెల 24న ఉదయం 11 గంటలకు వ్యక్తిగతంగా కమిషన్ ముందు హాజరుకావాలని ఆయనకు సూచించింది. ఈ మేరకు కమిషన్ 'ఎక్స్' ద్వారా వెల్లడించింది.

# పకడ్బందీగా...ప్రశాంతంగా గణేశ్ ఉత్సవాలు





**విశ్వంభర, హైదరాబాద్:** గణేష్ నిమజ్జన ఉత్సవాలు ముంబయి తర్వాత అత్యంత వైభవంగా హైదరాబాద్‌లోనే జరుగుతాయని, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను మరింత పెంపొందించే విధంగా గణేశ్ ఉత్సవాలను పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహిస్తామని బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నగరంలో గణేష్ విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు, ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. హుస్సేన్‌సాగర్ చుట్టూ నిమజ్జనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన శనివారం గణేష్ నిమజ్జన ఉత్సవాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యుత్, రోడ్లు - భవనాలు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, పోలీస్, రవాణా, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు, గణేష్ ఉత్సవ సమితి సభ్యులతో త్వరలోనే మరో సమావేశం నిర్వహిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గణేష్ నిమజ్జన ఉత్సవాలు ముంబయి తర్వాత అత్యంత వైభవంగా హైదరాబాద్‌లోనే జరుగుతాయని మంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను మరింత పెంపొందించే విధంగా ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

అధికారులకు ఆదేశాలు: గణేశ్ నిమజ్జన ఉత్సవాలకు అవసరమైన వాహనాలను సమకూర్చడం, మండపాల వద్ద లైటింగ్ ఏర్పాట్లు, విగ్రహాల తరలింపు సజావుగా సాగేందుకు రోడ్ల నిర్వహణ, పారిశుద్ధ్య ఏర్పాట్లు, శాంతిభద్రతలు తదితర అంశాలపై కూలంకశంగా చర్చించామన్నారు. గణేష్ ఉత్సవాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించామన్నారు. గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా పూర్తవ్వాలంటే ప్రజల భాగస్వామ్యం చాలా ముఖ్యమైనదన్నారు. ఉత్సవాలకు సంబంధించి సలహాలు, సూచనలు ఉంటే ఇవ్వాలని సూచించారు. గణేష్ ఉత్సవాల్లో ప్రభుత్వం ప్రజల భాగస్వామ్యాన్ని ఆశిస్తుందన్నారు. మండపాల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారని, అది ఆధిపత్యం మాత్రం కాదని, కేవలం సమాచారం - సమన్వయం కోసం మాత్రమే విగ్రహ ఏర్పాటు కోసం అనుమతి కోరుతున్నామని స్పష్టం చేశారు. మండప నిర్వాహకులు కోర్టు సూచనలు, పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

# తొండిలో తోపు.. తిట్టడంలో టాపు

- తొండిలో తోపు.. తిట్టడంలో టాపు
- సీఎం రేవంత్‌రెడ్డిపై నిప్పులు చెరిగిన మాజీ మంత్రి హరీశ్‌రావు
- రైతు రుణమాఫీ పేరుతో అన్నదాతలను మోసం చేశారు..
- క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని డిమాండ్




(మొదటి పేజీ తరువాయి)

పూర్తి స్థాయిలో అర్హత కలిగిన రైతులకు రుణ మాఫీ జరగలేదని హరీశ్ విమర్శించారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ ...రుణమాఫీకి సంబంధించి మొత్తం మూడు విడతల్లో రూ.31 వేల కోట్లు మాఫీ చేశామని ప్రభుత్వం చెబుతోందని.. కానీ రైతు రుణ మాఫీకి రూ.17 వేల కోట్లు మాత్రమే కేటాయించారని ఆరోపించారు. రూ. 14 వేల కోట్ల నిధులకు కోత పెట్టారని మండిపడ్డారు. రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని దుయ్యబట్టారు. అందుకు రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

రైతు రుణమాఫీపై కాంగ్రెస్ మొదట్నుంచి అసత్యాలే చెబుతోందని హరీశ్ విమర్శించారు. తొలుత డిసెంబర్ 9 నాడే మాఫీ చేస్తామని చెప్పారని.. ఆ తర్వాత మాట మార్చి ఆగస్ట్ 15 లోపు అని చెప్పారని.. తీరా ఇప్పుడు చూస్తే పూర్తిగా రుణమాఫీ చేయకుండా అబద్దాలు ప్రచారం చేస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తన అబద్ధపు ప్రచారాలతో రైతులను నిట్టనిలువులా ముంచారని ఫైరయ్యారు. ఏ ఊరుకైనా వెళ్లి రుణమాఫీ జరిగిందా? అనే అంశంపై చర్చ పెడదామని.. అందుకు సీఎం రేవంత్ సిద్ధమా ? అని సవాల్ అన్నారు. చర్చకు తాము రెడీగా ఉన్నామని.. రుణమాఫీ సంపూర్ణంగా అయ్యిందంటే తాను దేనికైనా సిద్ధమని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ఎక్కడకు చర్చకు రమ్మంటే అక్కడికి చర్చకు వచ్చేందుకు తాము సిద్ధమన్నారు.

మొత్తం 47 లక్షల మంది రైతులకు రుణమాఫీ కావాల్సింది ఉంటే.. కేవలం 22 లక్షల మంది రైతులకే రుణమాఫీ వర్తింపజేశారన్నారు. మరో 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయకుండా ఎగనామం పెట్టారని హరీశ్ తీవ్ర ఆరోపణలు చేశారు. పంచపాండవుల కథలా కాంగ్రెస్ రుణమాఫీ ఉందని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి రేవంత్‌రెడ్డి పరిపాలనలో ఫ్లాపు, తొండి చేయటంలో తోపు అని.. బూతులు తిట్టడంలో టాపు అని ఎద్దేవా చేశారు. ఈ రెండు విషయాల్లో ఆయన్ను కొట్టేవారే లేరని అన్నారు. తొండి చేసుకుంటూ.. మొండిగా మాట్లాడుతూ తెలంగాణ రైతులకను రేవంత్ మోసం చేశారని హరీశ్ రావు మండిపడ్డారు.

**హరీశ్‌రావు మాట్లాడిన మాటల్లో మరికొన్ని...**

* రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరు దొంగతనం చేసిన దొంగనే దొంగ దొంగ అని బిగ్గరగా అరిచినట్లు ఉంది.
* మొన్న ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం నాడు రుణమాఫీ అయిపోయిందని ప్రకటించిండు. సరే చేసిండేమో అనుకొని లెక్కలు చూస్తే కేవలం 17వేల కోట్లతో 22లక్షల మందికి చేసిండని లెక్క తేలింది.

అసెంబ్లీ ఎన్నికలప్పుడు 40వేల కోట్లు చెప్పి, తీరా చేసింది ఎంతంటే 17వేల కోట్లు. అంటే 23వేల కోట్లు కోత పెట్టిండు.

* క్యాబినెట్ మీటింగ్ నాడు, పార్లమెంట్ ఎన్నికల నాడు చెప్పిన 31వేల కోట్లతో పోలిస్తే 14వేల కోట్లు కోత పెట్టిండు.
* బడ్జెట్ కేటాయింపుల్లో చెప్పిన 26వేల కోట్లతో పోలిస్తే 9వేల కోట్లు కోత పెట్టిండు.
* మొదటి దఫా మేము లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేస్తేనే 36లక్షల మంది రైతులకు 17వేల కోట్ల ప్రయోజనం చేకూరింది.
* మీరు రెండు లక్షల రుణమాఫీ చేస్తే రైతుల సంఖ్య పెరగాలె, డబ్బులు డబుల్ కావాలె.

అటువంటిది రైతుల సంఖ్య దాదాపు 14 లక్షలు ఎట్ల తగ్గింది?

* నేను నీలాగా మాట తప్పెటోడిని కాదు. కొడంగల్ లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పి పార్టీలు మారి ముఖ్యమంత్రి అయిన చరిత్ర కాదు నాది.
* తెలంగాణ ఉద్యమం నుంచి వచ్చినోడిని, ప్రజల కోసం, తెలంగాణ రాష్ట్రం కోసం పదవులు లెక్కపెట్టకుండా రాజీనామాలు చేసినోడిని.

నువ్వు చంద్రబాబు చంకల జొర్రి రైఫిల్ పట్టుకున్న నాడు నేను ప్రజల కొరకు రాజీనమా చేసినవాడిని.

* నేను చాలా స్పష్టమైన సవాల్ విసిరిన. ఆగస్టు 15లోపు రైతులందరికి 2 లక్షల రుణమాఫీ చేసి, ఆరు గ్యారెంటీల్లోని 13హామీలను సంపూర్ణంగా నెరవేరిస్తే నేను రాజీనామాకు సిద్ధమని ప్రకటించిన. ప్రజలకు నువ్వు ఇచ్చిన హామి నెరవేరితే చాలు.. పదవి ఉంటే ఎంత పోతే ఎంత అనుకున్నా.
* అధికారం దక్కించుకునేందుకు మోసం. దక్కిన అధికారాన్ని నిలుపుకునేందుకు మరో మోసం. నీ 8 నెలల ప్రయాణమంతా మోసాల చరిత్రనే .
* ఆగస్టు 6న తెలంగాణ భవన్ లో రుణమాఫీ కాల్ సెంటర్ ఏర్పాటు చేసినం. ఫోన్ కాల్స్, వాట్సప్ ద్వారా గడిచిన 10, 11 రోజుల్లో లక్ష 16 వేల ఫిర్యాదులు వచ్చినయ్. రుణమాఫీ కాలేదు న్యాయం చేయండని రైతులు ఆవేదన చెందుతున్నరు.
* ఊళ్లల్లకు పోతే రైతన్నలు కన్నీళ్లు పెట్టుకుంటున్నరు. రుణమాఫీ కోసం అగ్రికల్చర్ ఆఫీస్, బ్యాంకుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నరు. అధికారుల కాళ్ల వేళ్ల మీద పడి వేడుకుంటున్నరు. ఓపిక నశించి బ్యాంకుల ముందు నిరసన తెలుపుతున్నరు.
* ఇదంతా అబద్ధమా రేవంత్ రెడ్డి. రోజూ పత్రికల్లో, టీవీల్లో వస్తున్నవే కదా. రైతుల ఆవేదన ఈ ప్రభుత్వానికి ఎందుకు కనిపించడం లేదు.
* దమ్ముంటే రుణమాఫీ మీద శ్వేత పత్రం విడుదల చేయండి.
* రైతులకు తీరని ద్రోహం చేసినవ్, దేవుళ్లకు తీవ్రమైన అపచారం చేసినవ్.
* దేవుళ్ళ మీద ఒట్టు పెట్టి మాట తప్పిన పాపం ఊరికే పోదు అది రాష్ట్రానికి చుట్టుకుంటుంది.
* దాడులు కొత్తకాదు. దాడులకు బయపడం రైతుల తరపున పోరాటం చేస్తం.
* పదేళ్లు అధికారంలో ఉన్నాము ఇలా ఎప్పుడూ దాడులకు పాల్పడలేదు.
* దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇలాంటివి జరిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయి




న్యూ ఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా పీస్ అండ్ సాలిడారిటీ ఆర్గనైజేషన్ (ఏఐపీఎస్ఓ) జాతీయ కౌన్సిల్ మీటింగ్‌లో తెలంగాణ రాష్ట్ర రిపోర్ట్‌ను ప్రవేశ పెడుతున్న ఏఐపీఎస్ఓ తెలంగాణ స్టేట్ జనరల్ సెక్రెటరీ కాచం సత్యనారాయణ.

- విశ్వంభర, న్యూ ఢిల్లీ

# నా ప్రాణం కాపాడండి

## చికిత్స నిమిత్తం దాతల సాయం కోసం ఎదురుచూపు

**విశ్వంభర,భూదాన్ పోచంపల్లి :** మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ బసవ లింగేశ్వర కాలనీకి చెందిన నిరుపేద చేనేత కార్మికుడు కర్నాటి నరసింహస్వామి (38) గత కొంతకాలంగా ప్యాంక్రియాటిస్ క్లోమగ్రంధి క్యాన్సర్ తో బాధపడుతున్నాడు. మెరుగైన చికిత్స చేయించుకునే ఆర్థిక స్థోమత లేక దాతల సహకారం కోసం ఎదురు చూస్తున్నాడు. నరసింహస్వామికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మగ్గం నేసి వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంతకాలంగా కడుపునొప్పి తో బాధపడుతుండడంతో ఇటీవల హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించుకున్నాడు. పరీక్షించిన వైద్యులు క్యాన్సర్ ఉందని అది కూడా చివరకు దశకు



చికిత్స పొందుతున్న నరసింహ స్వామి

చేరిందని వెంటనే శస్త్ర చికిత్స చేయించుకోవాలని సూచించారు. రేషన్ కార్డు లేకపోవడంతో ఆరోగ్యశ్రీ వర్తించదని ఆసుపత్రిలో చెప్పారు. కడుపునొప్పి తీవ్రత ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులు ఇటీవల చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. తెలిసిన చోట అప్పులు చేసి ఇప్పటివరకు వైద్యం కోసం నాలుగు లక్షల వరకు ఖర్చు చేశారు. అయితే పూర్తిస్థాయిలో చికిత్స చేయడానికి మరో 5 లక్షల ఖర్చు అవుతుందని డాక్టర్లు పేర్కొన్నారు. దీంతో నరసింహస్వామి దాతల ఆర్థిక సహకారం కోసం ఎదురుచూస్తున్నాడు. సాయం అందించాల్సిన చిరునామా..కర్నాటి నరసింహస్వామి ఫోన్ పే ,గూగుల్ పే : 7036530606.

# ప్రతిపక్షం ఎలా ఉండాలో నేర్చుకోండి

- ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం మానుకోవాలి
- రైతు రుణమాఫీ పై బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఫైర్

**విశ్వంభర, హైదరాబాద్:** ప్రతిపక్షం అంటే ఎలా ఉండాలో ఇరుగుపొరుగు రాష్ట్రాల్లోని ప్రతిపక్షాలను చూసి బీఆర్ఎస్ నేతలు నేర్చుకోవాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సూచించారు. పదేళ్లు మీరు చక్కగా పాలించి ఉంటే నేడు ప్రజలు మిమ్మల్ని ప్రతిపక్షంలో ఎందుకు నిలబెట్టారని ప్రశ్నించారు. రుణమాఫీ పై తప్పుడు ప్రచారం చేసి ప్రజలను రెచ్చగొట్టే విధానాలను మానుకోవాలని హితవు పలికారు. శనివారం హైదరాబాదులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎప్పుడు తెల్లవాడుతుందా? ఎప్పుడు సీఎం రేవంత్ రెడ్డికి తప్పుడు ప్రచారం చేద్దామా అని కేటీఆర్ గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండ రెడ్డి మాట్లాడుతూ పని లేని నేతలు బీఆర్ఎస్ నేతలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై తప్పుడు ప్రచారం చేసేందుకు దిగజారారని విమర్శించారు. కేటీఆర్ రాజకీయ పరిజ్ఞానం లేకుండా మాట్లాడటం మానుకోవాలన్నారు. హరీశ్‌రావు సీనియర్ మంత్రిగా పనిచేసే కూడా చిల్లరగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రుణమాఫీ చేస్తే ఓర్వలేక పోతున్నారన్నారు. కాంగ్రెస్ వార్ రూమ్ ఛైర్మన్ పవన్ మల్లాది మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డిరే రూ. 31 వేల కోట్లతో రైతుల రుణమాఫీ చేశారని తెలిపారు.



అధికారంలో ఉన్నప్పుడు ఉద్యోగాలను భర్తీ చేయని బీఆర్ఎస్ నాయకులు అడ్డగోలుగా మాట్లాడడం తగదని హెచ్చరించారు. రైతు రుణమాఫీ పై ప్రజలు రెచ్చగొట్టడం మానుకోవాలని బీఆర్ఎస్ నేతలను కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు.

# మెట్రోలో రద్దీకి అనుగుణంగా కోచ్‌లను పెంచాలి

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** మెట్రో రైల్లో రద్దీకి అనుగుణంగా కోచ్ లను పెంచాలని డిమాండ్ చేస్తూ శనివారం సీపీఎం ఆధ్వర్యంలో మెట్రో భవన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎం .శ్రీనివాస్ మాట్లాడుతూ ... రోజు 5 లక్షలకు పైగా ప్రయాణికులు మెట్రోలో ప్రయాణం చేస్తున్నారని, నిలబడేందుకు కూడా చోటు లేకుండా మెట్రోలోప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేసారు. రద్దీ పెరిగితే 3 కోచ్ ల నుండి 6 కోచ్ లకు పెంచుతామని ఎల్ఆండ్‌టీ అధికారులు గతంలో చెప్పారని గుర్తు చేశారు. ఇచ్చిన మాటకు అనుగుణంగా కోచ్ లు పెంచాలని డిమాండ్ చేశారు. టాయిలెట్స్‌తో పాటు కొత్తగా పార్కింగ్ కు కూడా డబ్బులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని పార్కింగ్ ఫీజులు రద్దు చేయాలని కోరారు. మెట్రో స్టేషన్ వద్ద ఉచిత పార్కింగ్ ఉన్నట్టుండి ఎత్తివేయడం వివాదానికి దారి తీస్తుందన్నారు. పార్కింగ్ చేసుకోవడానికి 'పార్క్ హైదరాబాద్' అనే యాప్ నుంచి చెల్లింపు చేయాలని కండిషన్ పెట్టారని, ఆ యాప్ గూగుల్ నుంచి డౌన్ లోడ్ కావడం లేదని వాహనదారులు చెబుతున్నారని, ఆఫీసులకు వెళ్లే తొందరలో ఉన్న వారిని ఈ పార్కింగ్ సమస్య తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని తెలిపారు. నగదు చెల్లించి పార్కింగ్ చేసేందుకు అనుమతించకపోవడంతో చాలా మంది వాహనదారులు వారిపై తిరగబడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.ఈ సందర్భంగా మెట్రో ఎండీ ఎన్ వీఎస్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు.









# తెలంగాణ ఆత్మ గౌరవ ప్రతీక.. సర్దార్ సర్వాయి పాపన్న

## ఆగస్టు 18... నేడు ఆయన జయంతి



ఛత్రపతి శివాజీ సమకాలికుడు, మొగలాయి పాలకులను ఎదిరించిన ధీరుడు, సమర్థ నాయకుడు, పాలకుడు, తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక, బహుజన హృదయ విజేత సర్దార్ సర్వాయి పాపన్న. శివాజీ, ముస్లింల పాలన అంతానికి మహారాష్ట్రలో ఎలాగైతే పోరాడాడో, పాపన్న కూడా తెలంగాణలో ముస్లింల పాలన అంతానికి పోరాడాడు. శివాజీకి పాపన్న ఏ మాత్రం తక్కువ కాదు. దక్షిణ భారత దేశంలో మొగల్ సామ్రాజ్య విస్తరణను అడ్డుకున్న తొలి యోధుడు పాపన్నే. యావత్ భారత దేశాన్ని, దాదాపు ఆనాటి భారత రాజులు అందరినీ ఓడించిన ఔరంగ జేబు మాత్రం పాపన్న ముందు తల దించుకున్నాడు. మళ్లీ అదే మొగల్ చక్రవర్తి తర్వాత వచ్చిన బహదూర్ షా తో సన్మానం చేయించుకున్న పోరాట యోధుడు సర్దార్ పాపన్న. అత్యంత క్రూరులు, భయంకరమైన మొగల్ సుల్తాన్లనే కాదు, గోల్కొండ సేనాధిపతులను, గవర్నర్ లనే ఎదిరించి నిలబడి, వారి దౌర్జన్యాలను, అక్రమాలను ప్రశ్నించాడు. బహుజనుల ఐక్యతతో
రాజ్యాధి కారం సంపాదించ వచ్చునని నిరూపించాడు. పూలే కంటే ముందే సామాజిక న్యాయాన్ని ప్రపంచానికి అందించాడు. బలహీన కుటుంబంలో వర్గ పుట్టి 17 వ శతాబ్ది లోనే తెలంగాణ గడ్డపై పోరుబాట పట్టి, రాచరిక పునాదులను కదిలించిన ధీరోధాత్తుడు సర్వాయి పాపన్న. పాపన్న సామాన్య గీత కార్మికుడు. తన మిత్రుడి మీద కాలు లేపిన నిజాం సైనికుడిని తన వద్ద ఉన్న గీత కత్తితో తల నరికిన ధీరుడు పాపన్న. తర్వాత తన మీద దాడికి వచ్చిన 10 మంది సైనికుల్ని మట్టుపెట్టి వాళ్ళ గుర్రాలను తీసుకొని కొంతమంది మిత్రులతో, దౌర్జన్యం చేస్తున్న నిజాం సైనికులను నరకడం మొదలు పెట్టాడు. అలా 1687 –1724 వరకు అప్పటి మొగల్ చక్రవర్తి ఔరంగజేబు సైన్యానికి వ్యతిరేకంగా పోరాడాడు. పాపన్న ఒక్కో ప్రాంతాన్ని ఆక్రమించి విజయ దుర్గాలు నిర్మించాడు. 1678 వరకు తాటి కొండ, వేములకొండలను తన ఆధీనంలోకి తెచ్చుకొని దుర్గాలను నిర్మించాడు.

ధూల్మిట్ట శాసనం ప్రకారం ఆగస్టు 18, 1650 నాడు పాపయ్య, గౌడ్ కులంలో సర్వాయి పాపన్న నేటి వరంగల్ జిల్లా, జనగాం మండలం ఖిలాషాపూర్ గ్రామంలో జన్మించాడు. తండ్రి ధర్మన్నగౌడ్ ను చుట్టు పక్కల వారు గౌరవంతో (ధర్మన్న దొర అనేవారు. తండ్రి చిన్నతనం లోనే చనిపోగా, తల్లి సర్వమ్మ కోరిక అతన్ని మేరకు గౌడ వృత్తిని స్వీకరించాడు. స్నేహితులైన చాకలి సర్వన్న, మంగలి మాసన్న, కుమ్మరి గోవిందు, జక్కుల పెరుమాండ్లు, దూదేకుల పీర్ మహ్మద్, కొత్వాల్ మీర్ సాహెబ్ తో గెరిల్లా సైన్యాన్ని తయారు చేశాడు. అగ్రకుల భూస్వాములు, వ్యాపారుల గడీలపై, కోటలపై దాడి చేశాడు. సంపదను బహుజన పేదలకు పంచాడు. గడీల్లో బందీలుగా మగ్గుతున్న అణగారిన కులాల ప్రజలను విడిపించాడు. బాల్యంలో పశువులను కాస్తూ ఆనాటి సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు గమనించాడు. తల్లి సర్వమ్మ పెంపకంలో గారాబంగా పెరిగాడు. పాపన్న వంశం శైవ మతస్థులు కాగా, యుక్త వయసు వచ్చే నాటికి క్రమ క్రమంగా వ్యతిరేకించాడు.

గోల్కొండ కుతుబ్ షాహి రాజవంశం నియంత్రణ లోకి రాగా, తురుష్క సైనికులు వివిధ పన్నులు, శిస్తులను ప్రజలను హింసలకు, ఇబ్బందులకు గురిచేస్తూ, కులాల, మతాల పేర్లతో పీడించి వసూలు చేసేవారు. అలాగే గౌడ కులం వారికి తాటి చెట్లకు పన్ను వేశారు. తురుష్క సైనికులు శిస్తులు వసూలు చేసుకొని వెళ్లేదారిలో, పాపన్న కల్లు అమ్ముకొనే మండువాలో, కల్లు తాగి డబ్బులు ఇవ్వకపోగా, పాపన్న స్నేహితుడు ఒకరు ధనరాసులు ఉన్నా, కల్లు తాగి డబ్బులు ఇవ్వలేని నిరుపేద తురుష్క సైనికులు వెళ్లిపోవుటకు సిద్ధం అయ్యారా అని సరసంగా అన్నాడు. తురుష్క సైనికుల్లో ఒకడు కోపంతో పాపన్న స్నేహితున్ని తన్నడానికి కాలు ఎత్తాడు. అది చూసిన ఆ క్షణంలో కోపోద్రిక్తుడైన పాపన్న తన వద్ద కల్లు గీయడానికి ఉపయోగించే గీత కత్తి, మారు కత్తిలో ప్రాణ స్నేహితున్నితన్నడానికి కాలు ఎత్తిన సైనికున్ని మెడ నరికాడు, మిగతా సైనికులు తన మీదికి రాగా, బలవంతుడైన పాపన్న వారిని కూడా హత మార్చాడు. మెల్లగా తురుష్క రాజ్యంలో విప్లవకారుడు అయ్యాడు. పాపన్న, అతని స్నేహితులతో కలసి తిరుగు బాట్లు ప్రారంభించాడు. అలా మొదలైన తిరుగు బాటుతో ఆయుధాలు, గుర్రాలు, డబ్బులు కూడా సమకూర్చు కున్నాడు. యుద్ధ విద్యలు నేర్చు కున్నాడు. పేదవారికి డబ్బులు సహాయం చేయడంతో పాపన్న పేరు జనగాం ఏరియాలో మార్మోగింది. యువకులు పెద్ద సంఖ్యలో పాపన్న వద్ద సైనికులుగా చేరారు. వారికి యుద్ధ విద్యలు నేర్పించి, అతి తొందరలోనే 3 వేల మందిని సొంతంగా సైనికులుగా సమకూర్చు కున్నాడు.

బహదూర్ షా గోల్కొండ కోట ముట్టడి చేయడానికి అనేక వేల మంది బలగాలను పంపగా, మార్చి 1710 వరకు కొనసాగిన సుదీర్ఘమైన యుద్ధం జరుగుచున్న రోజుల్లోనే ఓ రాత్రి పాపన్న బావమరిది చేత పట్టుబడ్డాడు. కొద్ది రోజుల తరువాత హతమార్చ బడ్డాడు. తలను నరికి బహదూర్ షాకు బహుమానంగా పంపారు. మొండాన్ని గోల్కొండ కోట గుమ్మానికి వేలాడ దీశారు. పాపన్న రాజ్యంలో పన్నులు లేవు. ఆయన అనేక ప్రజామోద యోగ్య పనులు చేశాడు. ఆయన రాజ్యంలో సామాజిక న్యాయం పాటించేవాడు. తాటికొండలో చెక్ డాం నిర్మించాడు. ఎల్లమ్మకు పరమ భక్తుడై, హుజురాబాద్ లో ఎల్లమ్మగుడి కట్టిం చాడు. పాపన్న గొప్పతనాన్ని తెలుసుకున్న బ్రిటిష్ వారు లండన్ మ్యూజియంలో ఆయన ఫోటోను పెట్టుకున్నారు.

ఆదిలాబాదు జిల్లా, నిర్మల్లో 2012 జూలై 30 నాడు సర్వాయి పాపన్న విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. 2012 ఆగస్టు 18 నాడు కరీంనగర్ జిల్లా సర్వాయిపేట గ్రామంలో సర్వాయి పాపన్న విగ్రహాన్ని నాటి కరీంనగర్ లోకసభ సభ్యుడు పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ఇటీవలి కాలంలో పాపన్న గొప్పతనానికి క్రమంగా గుర్తింపు రావడం సంతోషించాల్సిన విషయం.

# నిజాంకు తల ఒగ్గని వీర వనిత ఆది లక్ష్మీ దేవమ్మ

## నేడు (ఆగస్టు 18) మహారాణి వర్ధంతి



తమ ఆత్మగౌరవాన్ని నిలబెట్టు కోవడం కోసం, పరంపరానుగత హక్కు కోసం, జీవించే హక్కు కోసం సుదీర్ఘంగా సాగిన స్వాతంత్ర్య సమరంలో ఎందరో అసామాన్య రీతిలో పాలు పంచుకున్నారు. ఝాన్సీ లక్ష్మీబాయి లాంటి ఎంతో మంది వీరవనితలు సైతం తామూ తక్కువేమీ కాదని నిరూపించారు. అలాగే నిజాం వ్యతిరేక పోరాటం లోనూ భాగస్వాములు అయిన వారిలోనూ వీర వనిత లు ఉన్నారు. అలాంటి వారిలో గద్వాల సంస్థానాధీశురాలు మహారాణి ఆదిలక్ష్మిదేవమ్మ అగ్ర భాగాన నిలిచింది. ముష్టిపల్లి ఇంటిపేరు కలిగిన గద్వాల సంస్థానా ధీశులు పాకనాటి రెడ్లు కాగా, వారి ప్రథమ రాజధాని రాజపత్రాల్లో కేశవనగరంగా పేర్కొన బడిన పూడూరు. వీరు గద, వాలు అనే ఆయుధాలను ఉపయో గించి శత్రువులపై విజయం సాధించడం వలన వీరు నిర్మించిన నగరానికి గదవాలు అనే పేరు వచ్చింది. అనంతరం గద్వాలగా వ్యవహారంలోకి వచ్చినట్లు చరిత్ర కారుల భావన.. గద్వాల సంస్థానానికి ఆద్యుడు పెద్ద సోమ భూపాల్ (సోమనాద్రి). గద్వాల సంస్థానాన్ని పరిపాలించిన చివరి పాలకురాలు మహారాణి ఆది లక్ష్మి దేవమ్మ.

వాస్తవానికి గద్వాల్ సంస్థాన పాలకులు హైదరాబాద్ నిజాంకు సామంతులు. సంస్థానం ఒకప్పుడు రాయ చూరు జిల్లాలో భాగంగా ఉండేది. జిల్లాలోని కోటల న్నిటి లోకి ప్రసిద్ధిచెందిన గద్వాల పట్టణం నడి బొడ్డున ఉంది. సంస్థానపు వీర వనిత మహారాణి ఆదిలక్ష్మిదేవమ్మ విగ్రహాన్ని కూడా ఇటీవలి కాలంలో ఏర్పాటు చేశారు.కాకతీయ సామ్రాజ్య పతనం తర్వాత గద్వాల సంస్థానా ధీశులు బహమనీ సామ్రాజ్యం సామంతులు అయ్యారు. వంశ చరిత్ర ప్రకారం గద్వాలను పెద్ద వీరారెడ్డి, పెద్దన్న భూపాలుడు, సర్గారెడ్డి, వీరారెడ్డి, కుమార వీరారెడ్డి తదితర ప్రముఖ సంస్థానా ధీశులు పరిపాలిం చారు.1663 నుండి 1950 వరకు గద్వాల సంస్థానాధీశుల ఆధీనంలో ఉండిన ఈ కోట, సంస్థానాల రద్దు తరువాత ప్రభుత్వ పరమైంది.

ఇక అసలు విషయానికి వస్తే...మహారాణి ఆది లక్ష్మి దేవమ్మ గద్వాల సంస్థానాన్ని పాలించిన మహారాణి. రాజా చిన సీతారామభూపాలుని భార్య. ఆయన అనంతరం 1946 నుండి 1949 వరకు పాలన కొనసాగించింది. ఆమె సంస్థానపు చివరి పాలకురాలు కూడా. నిజాం నవాబును ఎదురించిన వీరవనిత. గద్వాల సంస్థానాన్ని స్వతంత్ర సంస్థానంగా ప్రకటించి పాలించింది. సీతారామ భూపాలునికి సంతానం లేక పోవడంచే నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ తమ రాజ్యంలో గద్వాల సంస్థానాన్ని కలుపుకుంటే, రాణి న్యాయ పోరాటం చేసి సంస్థానాన్ని తిరిగి చేజిక్కించుకుంది.

1947లో నిజాం పాలనలో గద్వాల సంస్థానానికి ఆది లక్ష్మి దేవమ్మ సామంత రాణి. ఆమె హైదరాబాద్ రాష్ట్రాన్ని స్వతంత్ర భారత దేశంలో విలీనం చేయడానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వం లోని దళాలకు సహాయం చేసి, ఆ దళాలు గద్వాల్ మీదుగా హైదరాబాద్ రాష్ట్రంలోకి ప్రవేశించేలా చేసింది. అలా1663లో రాజా పెద సోమభూపాలుడి పాలనతో ప్రారంభమైన గద్వాల సంస్థానపు పాలన 1949లో మహారాణి ఆదిలక్ష్మిదేవమ్మ పాలనతో ముగిసింది. గద్వాల సంస్థానాధీశులు సాహితీ ప్రియులు. కోటలో తరుచుగా సాహిత్య సభలు జరిగేవి. కవులకు సంస్థానాధీశులు బహుమతు లను కూడా అందజేసేవారు. చిన సోమ భూపాలుని హయంలో అష్టదిగ్గ జాలనే ఎనిమిది మంది కవులుండే వారు.. వీరి కాలంలో సాహిత్యం విల సిల్లింది. అలా గద్వాలకు విద్వద్గద్వాల అని పేరు వచ్చింది.

మహారాణి ఆది లక్ష్మి దేవమ్మ గద్వాల నుంచి ఇద్దరు చేనేత కళాకారులను ఉత్తరప్రదేశ్ లోని వారణాసికి పంపి బనారస్ జరీ చీరలను నేసేందుకు శిక్షణ ఇప్పించింది. గద్వాల చీర తెలంగాణ చేనేత పరిశ్రమకు ఆలవాలం. గద్వాల్లో తయార య్యే చీరలు దేశంలోనే మన్ని కైనవి, పేరెన్నిక గన్నవి. ఇక్కడి నుంచి దేశం లోని ప్రముఖ పట్టణాలకు కళాత్మక చీరలు ఎగుమతి అవుతాయి.

సుమారు నాలుగు శతాబ్దా లుగా గద్వాల సంస్థానా ధీశుల కాలం నుంచి తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి పంచెలను సమర్పించే సంప్రదాయం ఉంది. నాటి రాజు సీతారాం భూపాల్ గద్వాల సంస్థానాధీశుల ఇష్టదైవమైన వెంకటేశ్వర స్వామి వారికి పంచెలను సమర్పించే పద్ధతిని ప్రవేశ పెట్టాడు. ఆయన వారసులు నేటికికూడా ఈ పద్ధతిని కొనసాగిస్తున్నారు.

1949 లో సంస్థానాల, జాగీర్దా రుల పాలనలు రద్దు కావటంతో రాణి సంస్థానపు ఆస్తులను, చారిత్రాత్మక గద్వాల కోటను ప్రభుత్వ పరం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరువాత 1962లో జిల్లాలోనే మొట్ట మొదటి డిగ్రీ కళాశాలను ఈ కోటలోపల ఏర్పాటు చేసింది. డిగ్రీ కళాశాల పేరు కూడా రాణి పేరు మీదుగా మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ (మాల్డ్) డిగ్రీ కళాశాలగా పెట్ట బడింది. ఇది మహబూబ్ నగర్ జిల్లాలో ఏర్పాటైన మొదటి డిగ్రీ కళాశాల. మహా రాణి ఆది లక్ష్మి దేవమ్మ 1953 ఆగస్టు 18న మరణించింది.



-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# అభ్యుదయ కవితోద్యమ తపస్వి.. మన ఎస్వీ

> "చెమట బొట్లతో నేలను తడిపి నెత్తురు సత్తువ ఎరువుగా వేసి పచ్చని చేలను ఏపుగా పెంచి లోకం ఆకలి తీర్చే రైతులు గిట్టుబాటు ధరలేమైనాయని గట్టిగానే నిలదీయండి" అంటూ రైతు లోకాన్ని మేల్కొలుపుతూ, వారిని ఉద్యమాలకు సిద్ధం చేసేస్తాడు. రైతు, విద్యార్థి, యువజన, శ్రామిక, మహిళా, కార్మిక తదితర రంగాలకు చెందిన వారి సమస్యలపై, కవితలను, పాటలను రాస్తూ దోపిడీ శక్తులపై కత్తులను దూస్తూ, పేద ప్రజల కండ్లల్లో వెలుగు నింపే సమసమాజ స్థాపన కోసం, అభ్యుదయ సాహిత్య క్షేత్రంలో ఎరుపెక్కిన వృక్షమై ఏడుపదుల జీవితాన్ని ప్రతిబింబిస్తున్న అభ్యుదయ సాహిత్యోద్యమ తపస్వి ఎస్వీ సత్యనారాయణ.



1954 ఆగస్టు 16న హైదరాబాద్ పాతనగరంలో రాధాభాయి - విఠల్ రావు దంపతులకు ఎస్వీ సత్యనారాయణ జన్మించారు. పువ్వు పుట్టగానే పరిమళించినట్లు ఎస్వీ ఆలోచనలు అక్కడ నెలకొని ఉన్న పరిస్థితులకు భిన్నంగా ఉండటం వలన మంచి మిత్రులు, ఉపాధ్యాయుల పరిచయాలు నూతనత్వాన్ని కోరుకున్నాయి. నలుగురిలో తన ప్రత్యేకతను ఉనికిని గుర్తింపజేసే సాహిత్యరంగం వైపు, కవిత్వం వైపు అనుకోకుండానే దృష్టి మళ్ళింది. ఎస్వీ సత్యనారాయణ పదిహేనవ ఏటనే తనలోని కవిని పదవ తరగతి నోటుబుక్కులో ఆవిష్కరింపజేశాడు. పేదరికంలో పుట్టి, పెరిగి కసికొద్దీ శ్రద్ధాసక్తులతో చదువుతూ అనుకున్న గమ్యం వైపు తన జీవితాన్ని ప్రయానింపజేసిన ఎస్వీ సత్యనారాయణ చదువును, సాహిత్యాన్ని, జీవితాన్ని, సమాజాన్ని అధ్యయనం జేస్తూ సమన్వయం చేసుకున్నారు. అన్నింటినీ అనుసంధానం చేసుకుంటూ ఉస్మానియా యూనివర్సిటీ నుండి ఎం.ఏ. (తెలుగు), ఎం.ఏ. (ఇంగ్లీష్) పట్టాలు పొందారు. ఆగకుండా, ఎం.ఫిల్., పి.హెచ్.డిలు పూర్తి చేసి, డాక్టరేట్ పట్టా పొందిన పట్టుదల గల వ్యక్తి ఎస్వీ సత్యనారాయణ. కృష్ణమ్మ పరవళ్ళు ఉప్పొంగే గోదావరిలా, ధారాళంగా ప్రవాహంలా అలలుగా కెరటాలుగా స్వర గాంభీర్యంతో అద్భుతమైన ఉపన్యాసాలతో శ్రోతలను, ప్రజలను, విద్యార్థులను ఆకట్టుకునే శక్తి ఆయనలో ఉంది.

హైదరాబాద్ లోని బి.ఆర్. అంబేద్కర్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా దశాబ్ద కాలం, 1981 నుంచి 1991 వరకు బాధ్యతలను నిర్వహించారు. అటు తర్వాత కోఠి ఉమెన్స్ కాలేజిలో, ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీలో అనేక బాధ్యతలను నిర్వహించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్ లర్ స్థాయి వరకు ఎదిగి, బాధ్యతలను చేపట్టి, యూనివర్సిటీలో తనదైన పాలనపరమైన ముద్రను వేసి, అందరి మన్ననలను పొందారు. ఎస్వీ సత్యనారాయణ మార్గదర్శకత్వంలో గైడ్ గా ఎంతో మంది విద్యార్థులకు వివిధ అంశాలపై పరిశోధనలు పూర్తి చేయటానికి తోడ్పాటును అందించి, ప్రోత్సహించి, విద్యర్థులలోని ప్రతిభను వెలికి తీసి, వారి లక్ష్యాన్ని చేరుకోవడానికి, గైడ్ గా, ఫ్రెండ్ గా, మానవతావాదిగా చేయూతనిచ్చి విద్యార్థుల ఎదుగుదలకు కృషి చేశారు.

ఎస్వీ సత్యనారాయణ కు అభ్యుదయ రచయితల సంఘం వారిని పరిచయం చేసిన వ్యక్తి కామ్రేడ్ పుల్లారెడ్డి. ఆదారిలో అభ్యుదయ సాహిత్య పరిమళాన్ని, ప్రాముఖ్యతను, చరిత్రను ఆకళింపు చేసుకున్నారు. అప్పటికే 1973 సంవత్సరంలో అ.ర.సం రాష్ట్ర మహాసభలు నిర్వహించుకుంది. బలోపేతమైన నిర్మాణం, సంఘ విస్తరణ కొరకు కృషి చేస్తున్న అభ్యుదయ సాహిత్యోద్యమ యోధులు చాసో, తుమ్మల వెంకట రామయ్య, గజ్జెల మల్లారెడ్డి, ఆర్.వి.ఆర్., పులుపుల శివయ్య, కొడవటిగంటి కుటుంబరావు, దాశరథి రంగాచార్య,రాంబట్ల కృష్ణమూర్తి, పురిపండ అప్పలాచార్య లాంటి సాహిత్య యోధులు సాహిత్యం, ఉపన్యాసాలు ఎస్వీ ఆలోచనలకు నిర్మాణాత్మకమైన, సిద్ధాంతపరమైన పదును పెట్టాయి. అభ్యుదయ రచయితల సామజిక బాధ్యత, వర్తమాన పరిస్థితుల్లో రచయితల కర్తవ్యాన్ని గురించి చేపట్టవలసిన కర్తవ్యాలను గురించి ఆయనలో స్పష్టమైన ఆలోచన కలిగింది. అభ్యుదయ సాహిత్యధారను కొనసాగించాలని, అందుకు తనను తాను అ.ర.సం.కు అంకితం చేసుకున్నాడు. హైదరాబాద్ నగర అ.ర.సం. కార్యదర్శి బాధ్యతల నుండి మొదలై అఖిల భారత అ.ర.సం. ప్రధాన కార్యదర్శిగా జాతీయ అధ్యక్షవర్గ సభ్యులుగా ఉన్నత స్థాయిలో బాధ్యతలు నిర్వహించాడు. తన అనుభవాలు, సూచనలు, రాష్ట్ర కమిటీ బాధ్యులకు మార్గ నిర్దేశం చేస్తున్నాయి. అంతేకాదు అవని నిండా అల్లుకుపోయిన ప్రజా వ్యతిరేక పాలకుల విధానాలను ఎప్పటికప్పుడు ఎస్వీ సత్యనారాయణ పాటలు, కవితలు ప్రశ్నా కొడవళ్ళై పలకునలు నిలదీస్తుంటాయి.

ప్రగతిశీల సాహిత్యంపై, రచయితలూ, కవులు, జర్నలిస్టులు, మేధావులపై దాడులు జరిగినప్పుడు, రాజ్యహింస చెలరేగినప్పుడు అక్రమ నిర్బంధాల, నిషేధాల కొరడా ఝుళిపించబడినప్పుడు, ఎక్కడున్నా.. ఒక్కడున్నా ఎస్వీ తన గళ గర్జనను వినిపిస్తుంటాడు. కవులను, రచయితలను, సాంస్కృతిక దళాలను ఒక తాటిపై తీసుకరావడం ద్వారా మాత్రమే దోపిడీ శక్తులను ఎదుర్కొని నిలబడుతామని, నిర్భయంగా చెప్పేవాడు. ప్రజాకవి గద్దర్ పై "తూటా" పేలినప్పుడు, మతవాదుల శక్తుల హింస, అసహనం చెలరేగినప్పుడు, విద్యుత్ ఛార్జీలు పెంచినప్పుడు, ఆ ఛార్జీలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం ఉవ్వెత్తున ఉప్పొంగినప్పుడు తన కలం, గళంతో పాటు, రచయితల సంఘాలను, సాంస్కృతిక సంఘాలను ఏకం చేసి ప్రజాసాహిత్యం, ప్రజా కళల గొప్పతనాన్ని చాటడంలో ముందుండేవాడు. ఆయన రాసిన అనేక గ్రంథాలను ప్రముఖ ముద్రణాలయ సంస్థ "విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్" వారు ముద్రించడం విశేషం. వీటితో పాటు "తెలుగులో ఉద్యమ గీతాలు, జీవితం ఒక ఉద్యమం, సత్యానుశీలన, దృక్పథాలు లాంటి అనేక గ్రంథాలతో పాటు రావి నారాయణ రెడ్డి, మఖ్దూం మోహినోద్దీన్, ధర్మభిక్షం, ఆరుట్ల కమలాదేవి లాంటి గొప్ప సాయుధ పోరాట వీర యోధుల జీవిత చరిత్రలను కూడా ఎస్వీ రచించారు. విశాలాంధ్ర పత్రికలో ఈతరం శీర్షిక పేరుతో, రాష్ట్రంలో అభ్యుదయ సాహిత్య వ్యాప్తికి కృషి చేస్తున్న యువ కవులను పరిచయం చేస్తూ, వారి కవితలను విశ్లేషిస్తూ ..ఎంతో మందిని ప్రోత్సహించిన సాహిత్యోద్యమ "తపస్వి" ఎస్వీ సత్యనారాయణ.

అభ్యుదయ కవిగా పేరుపొంది ప్రశంశలు పొందిప్పటి నుంచి ఇప్పటి "ఏడు పదుల జీవితం" వరకు ఆయన ఎన్నో ప్రశంసా పత్రాలను, సన్మానాలను, పురస్కారాలను, అవార్డులను పొందారు. దేశ విదేశాలలో అనేక వేదికల మీద "ఎస్వీ సత్యనారాయణ ఇచ్చిన విశిష్టమైన ' ఉపన్యాసాల ద్వారా అభ్యుదయ సాహిత్య వెలుగులను, గొప్పతనాన్ని ప్రపంచానికి చాటారు. ఆ అభ్యుదయ సాహిత్యోద్యమ నేత మన ఎస్వీకి శుభాకాంక్షలు.

-కె.వి.యల్.
రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ
అభ్యుదయ రచయితల సంఘం



## కాళేశ్వరంలో శని త్రయోదశి పూజలు

**విశ్వంభర, కాటారం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పవిత్ర పుణ్యక్షేత్రం కాళేశ్వరాలయంలో శని త్రయోదశి సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. వేకువ జామునే సుదూర ప్రాంతాల నుంచి భక్తులు కాళేశ్వరం చేరుకొని పవిత్ర త్రివేణి సంగమం గోదావరి నదిలో పుణ్యస్నానమాచరించారు. గోదావరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారికి అభిషేకాలు, విశేష పూజలు చేశారు. శని త్రయోదశి కావడంతో శని పూజలకు భక్తులు బారులు తీరారు. అధిక సంఖ్యలో భక్తులు నవగ్రహాల వద్ద సామూహిక శని పూజలు నిర్వహించారు. శనీశ్వరుడికి నల్లబట్ట, నూలు, తైలం సమర్పించి శనిపీడిత బాధలు తొలిగిపోవాలని వేడుకున్నారు.

## ప్రజా పాలన కాంగ్రెస్ తోనే సాధ్యం

**- ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి**



**విశ్వంభర, చివ్వేంల :** ప్రజా పాలన కాంగ్రెస్ తోనే సాధ్యమని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. శనివారం చివ్వేంల మండల పరిధిలోని మోదీపురం గ్రామానికి చెందిన శత్రు నాయక్, సగరపు ప్రసాద్ ఆధ్వర్యంలో బుడగజంగాల ప్రజలు సుమారు 200 మంది సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వైట్ హౌస్ లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉన్నదని, పార్టీలో చేరిన వారికి ప్రతి ఒక్కరికి సముచిత న్యాయం చేస్తామని పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వీరన్న నాయక్, నాగు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ




**విశ్వంభర, కామారెడ్డి:** కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం అన్నారం గ్రామ రైతు వేదికలో కామారెడ్డి నియోజకవర్గం ఎమ్మెల్యే కాటిపల్లి వేంకటరమణ రెడ్డి మద్దికుంటతో పాటు అన్నారం గ్రామ క్లస్టర్ గ్రామ బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణి చేశారు. మద్దికుంట గ్రామ లబ్ధిదారులు గుండే బోయిన స్వామికి 60,000 వేల రూపాయల చెక్కు, జూపల్లి బుచ్చి రెడ్డికి 60,000 వేల చెక్కు, మైసి లక్ష్మికి 11,000 వేల రూపాయలు చెక్కులను ఎమ్మెల్యే అందజేసినారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దుకుంట బీజేపీ గ్రామ అధ్యక్షులు ముత్యాల రాజు, కుమ్మరి రాజశేఖర్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విలాస్ కుటుంబంతో పాటు ఇటీవల మరణించిన నీలకంటి సుశీలమ్మ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి తన కుమార్తెతో కలిసి పరామర్శించారు. నల్గొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ నాగరాజు, సెంట్రల్ ఇన్ఫర్మేషన్ అధికారి గుణాకర్ తల్లి ఇటీవల మరణించిన విషయం తెలుసుకొని ఎమ్మెల్యే వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, రాఘవులు, వైస్ ఎంపీపీ లక్ష్మి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## హరీష్ రావు క్యాంపు కార్యాలయంపై

# దాడి హేయమైన చర్య

- ఇది కాంగ్రెస్ గుండాలు చేసిన పని
- స్వయంగా ప్రభుత్వం కాంగ్రెస్ గుండాలతో దగ్గరుండి దాడి చేయించింది
- ఇటువంటి చిల్లర వేషాలు వేసే ఎంతో మంది రాక్షసులను తరిమికొట్టినం..
- కేసీఆర్ ముందు ఇవి ఏవి నడవవు, కేసీఆర్ శిఖరం లాంటి వారు



**విశ్వంభర, నల్గొండ:** రుణమాఫీ విషయంలో అన్నదాతలను నిలువునా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ ఆ విషయాన్ని పక్కదారి పట్టించేలా ఈ దాడులు మొదలు పెట్టిందని, మీము అహింస పద్ధతుల్లో ఉద్యమం నడిపామని, తెలంగాణ ఉద్యమం లో హింస లేపి ఉద్యమాన్ని అణిచివేయలని అప్పట్లో ఎన్నో కుట్రలు చేశారని, ఇవ్వాళ రుణమాఫీ విషయంలో రైతులను కాంగ్రెస్ వాళ్లు నమ్మించి గొంతు కోశారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి నల్గొండలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో విమర్శించారు. రాహుల్ గాంధీతో సహా కాంగ్రెస్ పార్టీ అంతా 2 లక్షల రుణమాఫీ చేస్తాం అని మాటిచ్చారు. మొదట 49 వెల కోట్లతో చేస్తాం అన్నారు. 50 లక్షల మంది రైతులు అన్నారు. ఆ తర్వాత 31 వెల కోట్లు అని క్యాబినెట్ లో చెప్పారు. ఆతర్వాత 27 వేల కోట్లు అని చెప్పారు. అవి అన్ని మాట తప్పి ఇవ్వాళ 17 వెల కోట్లు ఇచ్చి సగం మంది రైతులను నిలువునా మోసం చేశారని జగదీష్ రెడ్డి మండిపడ్డారు. ఇవ్వాళ రైతులు తిరగబడుతున్నారు కాబట్టి సీఎం రేవంత్ చిల్లర మాటలు మాట్లాడుతున్నాడు. ఇది అంతా కావాలని ప్రజలను పక్కదారి పట్టించేలా సీఎం రేవంత్ ప్రయత్నం చేస్తున్నాడని తప్పుపట్టారు. రైతులారా ఒక్కసారి ఆలోచన చేయండి కాంగ్రెస్ మిమ్ములను దాగా చేస్తుంది. మోసం చేసింది. రేవంత్ అనేటోడు బీజేపీతో దొంగ సంభదాలు పెట్టుకున్నడు. రేవంత్ బీజేపీతో కుమ్మక్కు అయ్యాడు. రేవంత్ ఆంటోడు అల్ప జీవి.. బీఆర్ఎస్ పార్టీ బీజేపీలో విలీనం అవుతుంది అని పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడుతున్నాడు. నువ్వు దొంగ లాగా బీజేపీతో మిలాఖత్ అయ్యావ్ మీము కాదు అని ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. సమస్యను పక్కదారి పట్టించుడులో రేవంత్ సిద్ధహస్తుడని, రాష్ట్రంలో హింస ప్రేరేపించాలి అని రేవంత్ ప్రయత్నం చేస్తుండు అని పేర్కొన్నారు. కాంగ్రెస్ చేసిన రుణమాఫీ భయంకరమైన మోసం, పచ్చి అబద్ధం ఆయన అన్నారు. అన్నదాతలను దొంగల్లాగా క్రియేట్ చేస్తున్నారు కాంగ్రెస్ నాయకులు. అన్నదాతలు ఆవేదన పడుతున్నారు, రుణాలు ఇచ్చేటప్పుడే అన్ని పత్రాలు సరిచూసుకునే రుణాలు ఇస్తారు. మరి ఇప్పుడు ఇన్ని కొర్రీలు పెట్టి రైతులను ఏడిపిస్తున్నారు ఎందుకని కాంగ్రెస్ ను ప్రశ్నించారు. రైతుల్లారా అర్థం చేసుకోండి. కాంగ్రెస్ మోసాన్ని గ్రహించండి. బీఆర్ఎస్ రైతుల తరపున కొట్లాడుతుంది. మీము మీకు అండగా ఉంటాం, ఇప్పటికైనా రైతు భరోసా ఇవ్వాలి.. అందరికి రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నామని జగదీష్ రెడ్డి అన్నారు.

## నేడు మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి వర్ధంతి



**విశ్వంభర, కల్వకుర్తి:** కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి 4 వర్ధంతి వేడుకలను నేడు పట్టణంలోని వై.ఆర్.ఆర్ కాంప్లెక్స్ లో నిర్వహిస్తున్నట్లు ఎడ్మ కిష్టారెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే గా రెండు సార్లు గెలుపొంది రైతుల ప్రధాన సమస్యల్లో ఒకటైన కరెంట్ ఇక్కట్లను తీర్చాలని ఎన్నో పోరాటాలు చేసి చివరికి సమస్య పరిష్కారానికి ఎడ్మ కిష్టారెడ్డి కృషి చేశారని తెలిపారు. అందుకు ఆయనని కరెంట్ కిష్టన్న గా పిలుస్తారని తెలిపారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా రాత్రి, పగలు అని తేడా లేకుండా ఎంతో మందికి సహాయ సహకారాలు అందించారని అన్నారు. కష్టం విలువ తెలిసిన నాయకుడు కాబట్టి పదవి ఉన్న లేకున్నా ఒకే సిద్ధాంతంతో పని చేసిన గొప్ప సామాజిక వేత్త అని కొనియాడారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేయడంతో పాటు, అభివృద్ధిలో తనదైన ముద్ర వేశారు మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం సాధనకు ఉద్యమాలు ఎన్నో చేశారు. ఎమ్మెల్యే గా గెలిచాక అభివృద్ధిని పరుగులు పెట్టించడంలో ఆయనకు ఆయనే సాటి, 2004 ఎమ్మెల్యేగా విజయం సాధించాక నియోజకవర్గంలో 18 33/11 కేవి సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయించి విద్యుత్ కష్టాలు తీర్చాడు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డికి కిష్టారెడ్డి ప్రీతిపాత్రునిగా ఉన్నాడు. సబ్సిడీ కందిపప్పు పథకాన్ని కల్వకుర్తి లోనే ప్రారంభించారు. విద్యకు అధిక ప్రాధాన్యతనిచ్చి హాస్టల్ నిర్మాణాలకు, ఆర్టీసీ బస్ స్టాండ్ నిర్మాణానికి కృషి చేశారు. అలాగే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, నందమూరి తారక రామారావు, ప్రస్తుత మాజీ ముఖ్యమంత్రులు కేసీఆర్, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తదితరులతో సంబంధాలు నెలకొల్పారు. మధ్య తరగతిలో కుటుంబంలో జన్మించి అంచెలంచెలుగా ఎదిగారు. కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ సాధనలో ఒక సామాన్య కార్యకర్తలాగా పని చేసి, ఒక రోజు ఆమరణ దీక్ష చేసి అందరి సహకారంతో రెవెన్యూ డివిజన్ సాధించారు. ఆయన మరణం నియోజకవర్గానికి తీరని లోటు అని పలువురు పేర్కొంటున్నారు.

## మహాదేవపూర్, కాళేశ్వరం బంద్ విజయవంతం



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో హిందూ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బంగ్లాదేశ్ లో హిందువులపై, హిందూదేవాలయాలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ హిందువులకు మద్దతుగా, మహాదేవపూర్, కాళేశ్వరం బందుకు పిలుపునిచ్చారు. బందుకు స్వచ్ఛందంగా సహకరించిన మహాదేవపూర్ మండల వ్యాపారసంస్థలకు, విద్యాసంస్థలకు, దుకాణదారులకు, హోటల్స్, షాపింగ్ మల్స్ కు, గ్రామప్రజలకు అందరికి హిందూ సంఘాల ఐక్యవేదిక ధన్యవాదాలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## పోచమ్మ బోనాలకు రూ.50 వేలు విరాళం

**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండల కేంద్రంలోని వచ్చే వారంలో జరిగే పోచమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాల సందర్భంగా పోచమ్మ ఆలయ ఉత్సవ కమిటీకి డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాసరెడ్డి 51,000 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాలు ఉత్సవాల సంధర్భంగా త్వర త్వరగా అన్ని పనులు పూర్తి చేయాలని ఉత్సవ కమిటీని కోరారు. బోనాల ఉత్సవాలను కమిటీ సభ్యులు, భక్తులు ప్రతి ఒక్కరు ఎలాంటి విభేదాలు లేకుండా కలిసికట్టుగా ఐకమత్యంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్యం యాదవ్, చేగూరి రాములు, మలే మల్లేష్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యా నాయక్, మాజీ కో ఆప్షన్ సభ్యులు జాంగిర్ బాబా, నాయకులు గూడూరు భాస్కర్ రెడ్డి, జంగీర్ అలి, కొస్కే యాదయ్యా, పాండు, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అన్ని డిపోల బస్సులు ఆపాలి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని రహీంఖాన్ పేట, కూరెల్ల స్టేజీల వద్ద అన్ని డిపోల బస్సులను ఆపాలని శనివారం ఆలేరు నియోజకవర్గం శాసనసభ సభ్యులు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకి సీపీఐ ఆత్మకూరు(ఎం) మండల సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. రహీంఖాన్ పేట కూడలి వద్ద దాదాపు పది గ్రామాల ప్రజలు రహీంఖాన్ పేట, తుక్కాపురం, పోతిరెడ్డిపల్లి, పుల్లాయిగూడెం, ఖప్రాయపల్లి, టీ రేపాక, మోదుగుబావిగూడెం, రాఘవాపురం మొదలైన గ్రామాల నుండి ప్రజలు వచ్చి స్టేజి వద్ద బస్ కోసం ఉంటారు. కాబట్టి బస్సు ఆపకపోవడం వల్ల సుదూర ప్రాంతాలకు వెళ్ళవలసిన ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, అదేవిధంగా ఈ ప్రాంత రైతాంగానికి బునాదిగాని కాలువను సత్వరమే పూర్తి చేసి సాగునీటిని అందించాలని భారత కమ్యూనిస్టు పార్టీ ఆత్మకూరు(ఎం) మండలం సమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కారం అయ్యే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, సీపీఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం, మండల కార్యవర్గ సభ్యులు జల్ది రాములు, మరుపాక అంజయ్య, కల్వల నరసయ్య, ఎండీ నయీం పాల్గొన్నారు.



హుజూర్ నగర్ కౌండిన్య గార్డెన్స్‌లో శనివారం జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, టీపీసీసీ అధికార ప్రతినిధి అల్లం ప్రభాకర్ రెడ్డి సతీమణి కీర్తిశేషులు ఉమారాణి దశదినకర్మకు హాజరై వారి చిత్రపటానికి నివాళులర్పించిన తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి.

- విశ్వంభర, హుజూర్ నగర్

# ట్రైనీ డాక్టర్ హత్యను ఖండిస్తూ నిరసన

**విశ్వంభర, ఆమనగల్లు/కామారెడ్డి/ మెట్ పల్లి :** ఆమనగల్లు మండల కేంద్రంలో పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్ కత్తాలోని ఆర్.జీ కర్ వైద్య కళాశాల ఆసుపత్రిలో ట్రైనీ డాక్టర్ పై జరిగిన హత్యాచారం, హత్యను ఖండిస్తూ దోషులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ పరిక్షిత్ నరేంద్ర ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, డాక్టర్లు, విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. వైద్యులపై, సహాయక సిబ్బంది పై దాడి చేయడం చాలా బాధాకరమైన విషయం అని ఎన్నో వ్యాధులతో బాధ పడుతున్న రోగులకు తమ ప్రాణాలను లెక్క చేయకుండా, రోగుల ప్రాణాలే ముఖ్యమని సేవలందించే వారి పై ఇలాంటి సంఘటనలు జరగడం చాలా బాధాకరమని, మానవజాతి తలదించుకొనే విధంగా చేస్తున్న కామాంధులను కఠినంగా శిక్షించాలని, కఠినమైన నిబంధనలు తీసుకురావాలని ప్రభుత్వాలను కోరారు. ఉద్యోగులు పనిచేసే చోట సెక్యూరిటీని పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్యసిబ్బంది, సహాయక సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.







**కామారెడ్డి జిల్లా బాన్సువాడలో..**

పశ్చిమబెంగాల్లో జరిగిన ట్రైనీ డాక్టర్ పై జరిగిన హత్యాచారం, హత్యను ఖండిస్తూ నిరసనగా శనివారం బాన్సువాడ పట్టణంలో వైద్యులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. వైద్యులపై దాడులు చేస్తే వారిని కఠినంగా శిక్షించాలని వారు కోరారు. దాదాపు 300 మంది ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు, నర్సులు కలిసి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఇటువంటి సంఘటనలను మరలా పురాతనమైతే వైద్యులు వైద్య వృత్తినే మానేస్తారని వైద్యులు తెలిపారు.

**కోరుట్ల, మెట్‌పల్లిలో..**

కలకత్తా ఆర్.జీ కర్ వైద్య కళాశాలలో, పీజీ విద్యార్థినిని అత్యాచారంతో పాటు హత్య చేయడం పై జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, మెట్ పల్లి డాక్టర్లు రోడ్డెక్కి నిరసన ప్రదర్శించారు. ఒక్కరోజు వైద్య సేవలు నిలిపి భారీ ర్యాలీ తీశారు. మెట్పల్లిలోని మండల పరిషత్ సమావేశం హాలు నుండి డాక్టర్లతో పాటు సిబ్బంది కలిసి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వీరికి మద్దతుగా లాయర్లు, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులతోపాటు మెడికల్ అసోసియేషన్ సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు, పాఠశాలల విద్యార్థులు తోడుగా నిలిచారు. కొత్త బస్టాండ్ నుండి బయలుదేరిన ఈ ర్యాలీ పాత బస్టాండ్ మీదుగా ఆర్డీఓ కార్యాలయం, పోలీస్ స్టేషన్ వరకు చేరుకుంది. అక్కడ ఆర్డీఓకు, ఎస్సైకు డాక్టర్లు వినతి పత్రాలు సమర్పించారు. అనంతరం వైద్యులు మాట్లాడారు. పీజీ విద్యార్థినిపైన జరిగిన ఘటన హేయమైన చర్యగా భావించారు. ఈ ఘటనలో రాజకీయ నాయకుల కొడుకుల హస్తం ఉందని ఆరోపించారు. మెడికల్ విద్యార్థి మృతికి కారణమైన వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. మహిళా డాక్టర్ మాట్లాడుతూ మహిళలకు రక్షణ లేకుండా పోయిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటన చాలా దురదృష్టకరమన్నారు. నిజమైన నిందుతులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



# డాక్టర్లు, వైద్య సిబ్బంది నిరసన

**విశ్వంభర, భూపాలపల్లి/పెద్ద శంకరంపేట/ ఆత్మకూరు(ఎం):** పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కోల్ కతా ఆర్ జీ కార్ మెడికల్ కళాశాలలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మౌమిత డెబనాథ్ (31) పై కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు ఈనెల 8న జరిగిన సామూహిక అత్యాచారం, హత్య ఘటనను జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రం తీవ్రంగా ఖండించింది. దోషులను కఠినంగా శిక్షించాలని ముక్తకంఠంతో నినదించింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు శనివారం మహాదేవపూర్ ఆసుపత్రిలో ఔట్ పేషెంట్ సేవలను నిలిపివేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ గంట చంద్రశేఖర్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య డాక్టర్లు, సిబ్బందిపై జరుగుతున్న దాడులను ఖండించారు. డాక్టర్ మౌమితపై జరిగిన దాడిలో దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. అత్యవసర సేవలు మినహా సాధారణ అవుట్ పేషెంట్ సేవలను నిలిపివేసినట్లు పేర్కొన్నారు. డ్యూటీ డాక్టర్ విద్యావతి మాట్లాడుతూ వైద్యులపై, ఉద్యోగులపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. మహిళల పట్ల జరుగుతున్న అమానవీయ దుశ్చర్యలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. హెడ్ నర్సింగ్ ఆఫీసర్ వినయకుమారి మాట్లాడుతూ ఆసుపత్రులలో మహిళలకు, ఉద్యోగులకు రక్షణ కల్పించాలన్నారు. ఆసుపత్రి వైద్య ఆరోగ్య ఉద్యోగుల ప్రతినిధిగా ఐసీటీసీ కౌన్సిలర్ గాదె రమేష్ మాట్లాడుతూ డాక్టర్ మౌమితపై జరిగిన దాడిని తీవ్రంగా పరిగణించారు. దోషులను కఠినంగా శిక్షించాలని లేకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని అన్నారు. ఆసుపత్రి నుంచి శ్రీపాద రావు చౌక్ వరకు ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్ల కార్డులు చేత బూని, ముక్తకంఠంతో నినాదాలు చేస్తూ, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెడ్ నర్సింగ్ ఆఫీసర్ బాలమణి, నర్సింగ్ ఆఫీసర్లు, సిస్టర్లు, ఆస్పత్రిలో సేవలు అందిస్తున్న వివిధ విభాగాలకు చెందిన కాంట్రాక్టర్లు, లేబరేటరీ టెక్నీషియన్లు, పారామెడికల్ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**పెద్ద శంకరంపేటలో..**

ఇండియన్ మెడికల్ అసోసియేన్ కు మద్దతుగా..

24 గంటల పాటు సాధారణ వైద్య సేవలు నిలిపివేత

విశ్వంభర, పెద్ద శంకరంపేట: కోల్ కతాలో వైద్యురాలిపై అమానుషంగా లైంగికంగా దాడి చేసి హత్య చేసిన నేరస్థులను కఠినంగా శిక్ష విధించాలని పెద్ద శంకరంపేటలో ప్రైవేట్ హాస్పిటల్ వైద్యులు ఇండియన్ మెడికల్ అసోసియేన్ కు మద్దతుగా నిరసన కార్యక్రమం చేపట్టారు. 24 గంటలపాటు చేపట్టనున్న ఈ నిరసన కార్యక్రమంలో అత్యవసర సేవలను మినహాయించి సాధారణ సేవలను బహిష్కరించారు. పేటలోని వివిధ ప్రవేట్ హాస్పిటల్ లతోపాటు ప్రథమ చికిత్సాలయాలు కూడ మూసివేసి డాక్టర్లు ప్లకార్డులను ప్రదర్శిస్తూ బాధిత వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. డాక్టర్లకు వైద్య సిబ్బందికి ప్రభుత్వం రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంగమేశ్వర్ రెడ్డి, డాక్టర్ పద్మాలయ శ్రీనివాస్, రాఘవులు, ఫణి కుమార్, గుజ్జరి అనిల్, రవి, ప్రకాష్, విట్టల్. మహిపాల్ పాల్గొన్నారు.

**ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో..**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం మండల అధ్యక్షులు వంగ శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి అంబటి రాజయ్య మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోల్ కతాలో ఆర్ జీ కార్ వైద్యశాలలో జూనియర్ వైద్యురాలి పైన జరిగిన అత్యాచారం, హత్య ఘటనను సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం చనిపోయిన జూనియర్ డాక్టర్ కి సంతాపం, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నిందితులు ఎంతటి వారైనా ప్రభుత్వం వారిని కఠినంగా శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. వైద్యులకు రక్షణ లేకపోతే ప్రజల ప్రాణాలను ఏవిధంగా కాపాడాలని అన్నారు. ఎంతో ఉజ్వల భవిష్యత్ ఉన్న జూనియర్ వైద్యురాలిపై కామాంధులు అత్యాచారం చేసి పాశవికంగా హత్య చేయడం సభ్య సమాజం సిగ్గుపడాల్సిన విషయమన్నారు. సమస్య ఏ రాష్ట్రం అయిన అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నిందితులకు వేసే శిక్ష కామాంధులకు గుణపాఠం జరిగేలా శిక్ష వేయాలని కోరారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వారి పిలుపుతో వారికి సంపూర్ణ మద్దతు ఇస్తూ నిందితులకు శిక్ష పడేదాక కలిసే పోరాటం చేస్తామని తెలిపారు. భవిష్యత్తులో వైద్యుల జోలికి రాకుండా కొత్త చట్టాలు తేవాలని కేంద్రాన్ని కోరారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్‌లో..



పెద్ద శంకరంపేటలో..



# దోమల బెడద లేకుండా చూడాలి

**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** పెద్ద శంకరంపేట మండల పరిధిలోని గ్రామాలలో దోమల బెడద లేకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందని పెద్ద శంకరంపేట ఎంపీడీవో రఫీక్ ఉన్నీస అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ పథకం అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా వర్షాకాలం వచ్చినందున గ్రామాలలో మురికి నీరు చేరి దోమల బెడద పెరుగుతుందని, ఈ బెడద నివారణకు చేపట్టాల్సిన చర్యలను ప్రజల్లో అవగాహన కల్పిస్తూ తమ వంతు బాధ్యతగా పనిచేయాలని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామాలలో పారిశుధ్యం, పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పిస్తూనే ఉండాలని అన్నారు. దీంతోపాటుగా ఉపాధి హామీ లబ్ధిదారులకు ఉపాధి హామీ పనుల గురించి తెలుపుతూ గ్రామాలలో ఉపాధి హామీ పనులు పూర్తి చేయాలని ఆమె పేర్కొన్నారు. గ్రామాల్లో దోమల నివారణ చర్యలు, పారిశుధ్యం, పరిశుభ్రత, ఉపాధి హామీ పనులు, ఫారం ఫాండ్స్, ఉద్యాన పంటలు, ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలి అని పేర్కొంటూ ఇతర సాధారణ అంశాలు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీఓ విట్టల్ రెడ్డి, ఏపీవో తో పాటు గ్రామ కార్యదర్శులు, ఉపాధి హామీ అధికారులు పాల్గొన్నారు.

# బాలుర గురుకుల పాఠశాల ఎదుట నిరసన



**విశ్వంభర, మెట్ పల్లి :** మెట్పల్లి పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలుర పాఠశాల ముందు జాతీయ రహదారిపై విద్యార్థుల తల్లిదండ్రులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రిన్సిపల్ జుబేర్ ప్రయత్నిస్తున్నాడని హిందువులకు రాఖీ పండుగ ఎంతో ప్రాముఖ్యమని రాఖీ పండుగకు విద్యార్థులను ఇంటికి పంపించడం లేదని ప్రిన్సిపాల్ జుబేర్ పై అగ్రహం వ్యక్తం చేశారు. చిన్నపాటి వర్షం పడితే నాలుగు రోజులు సెలవులు ఇచ్చి ఇంటికి తీసుకెళ్లండి అంటూ తల్లిదండ్రులకు ఫోన్లు చేసి సతాయించే ప్రిన్సిపల్ జుబేర్ సంవత్సరానికి ఒక్కసారి వచ్చే రాఖీ పండుగకు మాత్రం పంపించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు రహదారిపై బైఠాయించారు. దీనితో మెట్ పల్లి నుండి నిజామాబాద్ వెళ్లే వాహనాలు నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం కలిగింది.

# మహిళా రక్షణ చట్టాల అమలులో పాలకులకు చిత్తశుద్ధి లేదు



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** కలకత్తా వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కలకత్తాలో వైద్య విద్యార్థినిపై జరిగిన దారుణ హత్యకు నిరసనగా భద్రాచలం ఐఎంఏ ఆధ్వర్యంలో డాక్టర్స్ చేపట్టిన నిరసన దీక్షకు సీపీఎం భద్రాచలం పట్టణ కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేసింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సమాజంలో రోజురోజుకీ మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు రక్షణగా ఎన్ని చట్టాలు ఉన్నా వాటిని అమలుపరిచే దానిలో పాలకులకు చిత్తశుద్ధి కరువైందని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బెంగాల్ రాష్ట్రంలోని తృణమూల్ ప్రభుత్వాలు బాధ్యత వహించాలని తక్షణమే ఘటనకు పాల్పడిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్ బాబు, పట్టణ కమిటీ సభ్యులు నకిరీకంటి నాగరాజు, కుంజ శ్రీను, ఐద్వా నాయకులు నాదెళ్ల లీలావతి, జీవనజ్యోతి, ఎర్రంశెట్టి పూర్ణ, జి రాధ పాల్గొన్నారు.

# వికలాంగుల వాయిస్ పత్రికను ఆవిష్కరించిన ఎస్పీ

**విశ్వంభర, నాగర్ కర్నూలు:** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక సంఘం ఆధ్వర్యంలో వికలాంగుల వాయిస్ మాస పత్రికను జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ ఆవిష్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ వికలాంగుల కోసం ప్రత్యేకంగా మాసపత్రిక తేవడం అభినందనీయమని అన్నారు. వికలాంగులకు పోలీస్ శాఖ తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వికలాంగుల సంఘం నాయకులు మాట్లాడుతూ, జిల్లాలో అనేక వికలాంగుల సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నాయని అన్నారు. ఇటీవల కాలంలో అత్యున్నత సివిల్ సర్వీస్ ఉద్యోగాల్లో నకిలీ సర్టిఫికెట్లు పెట్టి ఉద్యోగాలు సాధించడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కోట్ల గౌతమ్, ప్రధాన కార్యదర్శి పులిజాల బాలీశ్వర్, జిల్లా కమిటీ నాయకులు ఆనంద్, కుర్మయ్య, లింగం గౌడ్, గని మోని ఆంజనేయులు పాల్గొన్నారు.






# గొర్రెల దొంగలు అరెస్ట్

**విశ్వంభర, నార్కెట్ పల్లి:** పెద్దకాపర్తి గ్రామ శివారులో ఒక ట్రాలి ఆటో, రెండు కార్లు, బైక్ తో శుక్రవారం సాయత్రం ఎనిమిది మంది వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. చిట్యాల ఎస్.ఐ ఎన్. ధర్మకి నమ్మదగిన సమాచారంతో వెళ్ళిన పోలీసులను చూసి వాహనాలను వదిలేసి పారిపోతుండగా ఎస్.ఐ ఎనిమిది మంది వ్యక్తులలో ఇద్దరు కేతేపల్లి మండలం, బొప్పారంకి చెందిన గౌరారపు వీరబాబు (27), త్రిపురారం మండలం అంజన పల్లికి చెందిన నీకంటి రాజశేఖర్ (23) లను పట్టుకున్నారు. వీరు ఇద్దరు హైదరాబాద్ ఆటోనగర్ లో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. వీరు గత 7 నెలలుగా ఒక ముఠాగా ఏర్పడి చిట్యాల, చౌటుప్పల్, భువగిరి, హయత్ నగర్, ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిల్లో పలు చోట్ల రాత్రి సమయంలో గొర్ల మందల నుండి గొర్లను దొంగతనం చేస్తున్నారని విచారణలో తేలిందని ఎస్.ఐ అన్నారు. ఎప్పటిలాగే పెద్దగాపర్తి గ్రామ శివారులో గల గొర్రెల దొడ్డిలో గొర్రెల దొంగతనం చేయడానికి రెక్కీ నిర్వహిస్తుండగా ఇద్దరినీ పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వీరి వద్ద నుండి అశోక్ లీలండ్ దోస్త్, టాటా ఇండికా, మహింద్ర జైలో, హీరో హోండా సీబీజెడ్ వాహనాలు, రెండు సెల్ ఫోన్లు స్వాధీన పరుచుకొని వీరిని రిమాండ్ కు తరలించినట్లు చిట్యాల ఎస్.ఐ ఎన్. ధర్మ తెలిపారు.

# అంతర్ రాష్ట్ర దొంగల అరెస్టు



**విశ్వంభర, వికారాబాద్ :** పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో జూన్ 30 న ఐదు ఇండ్లలో దొంగతనానికి పాల్పడ్డ అంతర్ రాష్ట్ర షికారి గ్యాంగ్ సభ్యులను పూణేలో అదుపులోకి తీసుకున్నామని వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గుంతకల్ కి చెందిన షికారి పెద్ద సర్దార్ అలియాస్ రాజు, షికారి మాదిలేటి అలియాస్ మాదన్న లను పోలీసులు అరెస్ట్ చేశారు, ముఠా సభ్యులు రైళ్లు మార్గం , బస్సు మార్గం ద్వారా దూర ప్రాంతాలకు ప్రయాణం చేస్తూ తాళం వేసి ఉన్న ఇండ్లపై పగలు రక్కి చేసి రాత్రి సమయంలో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు మీడియా సమావేశంలో ఎస్పీ తెలిపారు, కర్ణాటక మహారాష్ట్ర తెలంగాణలలో నిందితుడు రాజు పై 70, మాదన్న పై 42 కేసులు ఉన్నాయని అన్నారు. నిందితుల నుండి బంగారం నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలిస్తున్నామని అన్నారు. కేసును చేదించిన పోలీస్ సిబ్బందికి ఎస్పి రివార్డులు అందజేశారు.

# ఫోటో జర్నలిస్ట్ ఆకాశ్‌కు నేషనల్ అవార్డు



**విశ్వంభర,నల్గొండ :** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ ఫోటోగ్రఫీ కాంపిటీషన్ 2024 కు నల్గొండ ఉమ్మడి జిల్లా సీనియర్ నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫోటో జర్నలిస్ట్ కు ఆర్.ఆకాశ్‌కు నేషనల్ అవార్డు దక్కింది. ఈ కాంపిటేషన్‌కు దేశ వ్యాప్తంగా 500 ఎంట్రీలు వచ్చాయి. జిల్లా కేంద్రంలో బోనాల పండుగ సందర్భంగా పోతరాజు చేసిన విన్యాసాన్ని గాను పోతరాజు తన తలను నేలకు వాల్చి నాలికతో నిప్పును ఆరిపుతున్న ఫోటోకి అవార్డు దక్కింది. ఈనెల 19 ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా విజయవాడలో అవార్డు ఇవ్వనున్నారు. గతంలోనూ జాతీయ, రాష్ట్ర, స్థాయిలోనూ ఉత్తమ ఫోటోగ్రాఫర్ అవార్డులను సైతం అందుకున్నారు.

# గాంధీజీ స్కూల్‌లో రాఖీ వేడుకలు



**విశ్వంభర, చండూరు:** స్థానిక గాంధీజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో రాఖీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రాఖీ ఆకారంలో కూర్చొని రాష్ట్ర ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాల బాలికలు బాలురకు రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ అనుబంధాలను పంచుకునే పండుగ రక్షాబంధన్ అని, అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్ల అన్యోన్యతకు చిహ్నం ఈ పండుగని అన్నారు. రాఖీనాడు సోదరీమణులు తమ సోదరులకు రాఖీ కట్టి, ఆశీర్వాదం పొందుతారని, తన సోదరికి సోదరులు కట్నం, మంచి గిఫ్ట్ ఇస్తుంటారన్నారు. రాఖీ పండుగ అంటే అన్నాచెల్లెల్లకు, అక్క తమ్ముళ్లకు చాలా ఇష్టమైన పండుగ అని అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్ సత్యనారాయణ మూర్తి, పులిపాటి రాధిక, కందుల కృష్ణయ్య, విజయ కుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



విశ్వంభర, పెద్ద శంకరంపేట్: పెద్ద శంకరంపేట మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను శనివారం నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి అందజేశారు. పేట మండల పరిధిలోని కమలాపూర్ గ్రామానికి చెందిన కలాలి నాగమణికి 60,000 వేల రూపాయలు, కమలాపూర్ తండాకు చెందిన రూపుల నాయక్ 42,000 వేల రూపాయలు, లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన గంగారాములకు 20,000 వేల రూపాయలు, మహేందర్ కు 60,000 వేల రూపాయల చెక్కులను ఆసుపత్రి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి కూతురు శ్రేయ రెడ్డి, మాజీ ఎంపీపీ జగన్ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ లక్ష్మీ రమేష్, యాదగిరి పాల్గొన్నారు.

# శని త్రయోదశి ఆదాయం రూ. 4 లక్షలు

విశ్వంభర, భూపాలపల్లి: శ్రావణ మాసం శని త్రయోదశి సందర్భంగా భూపాలపల్లి జిల్లాలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానమునకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు నవగ్రహ పూజలు, కాలసర్పదోష నివారణ పూజలు, అభిషేకము, కుంకుమార్చన మొదలగు పూజలు శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామికి చేయించారు. సుమారు 20వేల మంది భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని వివిధ పూజలు చేసుకున్నారు. వివిధ పూజలు, ప్రసాదముల ద్వారా ఆలయానికి శనివారం 4,03,000 రూపాయల ఆదాయం వచ్చినదని ఆలయ నిర్వాహకులు తెలిపారు.



# కెనరా బ్యాంకు ఎదుట రైతుల ధర్నా

**విశ్వంభర, మెట్ పల్లి:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి రుణమాఫీ చేస్తానని రైతులను మోసం చేశాడని వేంపేట రైతులు కెనరా బ్యాంకు ముందు రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతు నాయకులు మాట్లాడుతూ.. రైతు బిడ్డ అని చెప్పుకునే అనుముల రేవంత్ రెడ్డి నీవు రైతులను మోసం చేసి గద్దెనెక్కడం మొత్తం తెలంగాణ రైతాంగాన్ని మోసం చేయడమేనని ఒక రైతుగా రైతులకు మంచి చేస్తావని నమ్మి ఓటేసినందుకు నమ్మకాన్ని వమ్ము చేశావని వెంటనే రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో కెనరా బ్యాంకు ఖాతా రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## గురుకులాలు, వసతి గృహాలపై

# సమగ్ర విచారణ జరపాలి

- చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ 25 లక్షలు పరిహారం ఇవ్వాలి
- బాలల హక్కుల సంక్షేమ సంఘం డిమాండ్

**విశ్వంభర, హైదరాబాద్:** గురుకులాలు, వసతి గృహాలపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం (బీహెచ్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డా. గుండు కిష్టయ్య, ఇంజమూరి రఘునందన్, ఉపాధ్యక్షులు రచ్చ ఎల్లయ్య, పుంజాల వెంకటేశం, కార్యదర్శి చెర్క సత్తయ్య ఒక సంయుక్తంగా తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ వసతి గృహాల వార్డెన్లు, గురుకులాల ప్రిన్సిపాల్లు, కొంతమంది ఉన్నతాధికారులు కుమ్మక్కయ్యి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకుండా అవినీతికి పాల్పడుతున్నారని. విద్యార్థులకు సరైన వసతులు కల్పించకుండా, ఇవ్వాల్సిన కాస్మోటిక్ చార్జీలు కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు అన్నారు. ఎలాంటి రాజకీయ ఒత్తిడి లేకుండా తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకులాలు, హాస్టళ్లలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం సిట్టింగ్ జడ్జితో కమిటీ వేసి సమగ్ర విచారణ జరిపించాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం కోరుతున్నదని వారన్నారు. అలాగే కొంతమంది వార్డెన్లు, గురుకులాల ప్రిన్సిపాల్ లు విద్యార్థులు లేనప్పటికీ ఉన్నట్టుగా రిపోర్ట్ చేసి డబ్బులు కాజేస్తున్నారని తెలిపారు. చాలా హాస్టళ్లలో వార్డెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఒక్కో వార్డెన్ కు 4, 5 హాస్టళ్లు కూడా ఇంచార్జీ బాధ్యతలు అప్పగించడం వలన వారికి పనిభారం పెరిగి ప్రతి హాస్టల్ ను సరిగా పర్యవేక్షణ చేయడంలో ఇబ్బందులు పడుతున్నారని



ప్రభుత్వం వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న హాస్టల్ వార్డెన్ పోస్టులను భర్తీ చేసి వారి పనిభారన్ని తగ్గించాలని సూచించారు. అప్పుడే వార్డెన్ లు తమ తమ హాస్టళ్లలోని పరిస్థితులను మెరుగు పర్చుటకు ఆస్కారం ఉంటుందన్నారు. మెస్ టెండర్, ఇతర టెండర్లపై కూడా విచారణ జరపాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఉన్నతాధికారులు సక్రమంగా పర్యవేక్షణ చేయకుండా ఉండటం వలన ప్రిన్సిపాల్, వార్డెన్లు విద్యార్థులను ఆకలితో అలమటించే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నాణ్యమైన భోజనం పెట్టకపోవడం వలన విద్యార్థులు తరచుగా అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని, ఎప్పటికప్పుడు విచారణ జరిపే విధంగా ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయాలని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు దోమతెరలు, గురుకులాల్లో జ్వరాల నియంత్రణకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు చేయాలన్నారు. ప్రతి గురుకులంలో అత్యవసర మందులు, పారామెడికల్ సిబ్బందినీ నియమించాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం కోరుతుందన్నారు.




## నిందితులను కఠినంగా శిక్షించాలి

**విశ్వంభర, ఎల్బీనగర్ :** కోల్ కత్తాలో పీజీ వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి చంపిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఓజోన్ హాస్పిటల్ సీఈఓ శ్రీనివాసరావు అన్నారు. అఘాయిత్యాన్ని ఖండిస్తూ కొత్తపేట్ లోని ఓజోన్ ఆస్పత్రి ముందు డాక్టర్స్, వైద్య సిబ్బంది నల్ల రిబ్బన్లు ధరించి, నల్ల బెలూన్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం ఆసుపత్రిలో ఓపీ సేవలను నిలిపివేసి ఆస్పత్రి ఎదురు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అమానుష ఘటనపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. డాక్టర్స్ పై జరిగే దాడులను అరికట్టేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను తీసుకురావాలన్నారు. నిందితులను కఠినంగా శిక్షించి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ దీప్తి, పెద్ద ఎత్తున జూనియర్ డాక్టర్లు, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్బీనగర్ చౌరస్తాలో టీ.జీ.ఎస్. ఆర్టీసీ కార్గో సెంటర్




**విశ్వంభర, ఎల్బీనగర్:** ఎల్బీనగర్ చౌరస్తా సమీపంలో జిల్లా బస్సులు ఆగే అలైటింగ్ పాయింట్ వద్ద నూతనంగా టీ.జీ.ఎస్. ఆర్టీసీ కార్గో పాయింట్ సెంటర్ ను టీ.జీ.ఎస్. ఆర్టీసీ లాజిస్టిక్ డిప్యూటీ సీటీఎం మధుసూదన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నల్గొండ, మిర్యాలగూడెం, ఖమ్మం, భద్రాచలం, కొత్తగూడెం, మధిర, పాల్వంచ, సూర్యపేట, కోదాడ, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు వైపు నుండి వనస్థలిపురం, ఎల్బీనగర్, దిల్ సుఖ్ నగర్, ఉప్పల్ ప్రాంతాలకు పార్సల్ బుక్ చేయాలనుకునే వారికి ఎంజీబీఎస్ కు వెళ్లకుండా డైరెక్ట్ గా సత్వరంగా పార్సిల్ అందజేసే అవకాశం ఈ సెంటర్ ద్వారా ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటీఎం (జీ.హెడ్.జెడ్) వెంకట్ నారాయణ, ప్రదీప్, అమరేందర్, రాజు, సతీష్, సత్యనారాయణ, మురళీధర్, శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు.

## జిల్లా స్పోక్స్ పర్సన్‌గా మొహమ్మద్ ఇస్తియాక్ గుల్షాన్

**విశ్వంభర, ఎల్బీనగర్ :** కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా స్పోక్స్ పర్సన్ గా మొహమ్మద్ ఇస్తియాక్ గుల్షాన్ నియామకమయ్యారు. ఈ మేరకు శనివారం రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా గుల్షాన్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, మహేశ్వరం నియోజక వర్గం ఇంచార్జ్ కిచెన్నగారి లక్ష్మారెడ్డి, నియోజకవర్గ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి వీ ఎస్ ఎన్ శ్రీనివాస్ రావు, సినియర్ కాంగ్రెస్ నాయకులు మతిన్ షరీఫ్, సీనియర్ నాయకులు చిక్కుళ్ళ శివప్రసాద్, శంకర్ యాదవ్, మహేందర్ యాదవ్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను తప్పకుండా నెరవేరుస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి తనవంతుగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.



## కేటీఆర్ క్షమాపణ చెప్పినా ఈ రాజకీయమేంది?

- సబితా ఇంద్రారెడ్డి ఆక్షేపణ

**విశ్వంభర, హైదరాబాద్:** 'నోరుజారి మాట దొర్లిందని కేటీఆర్ మహిళలకు క్షమాపణ చెప్పారు. మరి మంత్రి సీతక్క కేసీఆర్ ఇదే నేర్పారా అని అడిగారు. కేసీఆర్ నేర్పిన సంస్కారం.. కేటీఆర్ స్పందన చూస్తే అర్థం అవుతోంది. కేటీఆర్ వెంటనే క్షమాపణ చెప్పినా రాజకీయం చేస్తున్నారు. మరి ఎనిమిది నెలల్లో 1,800 మంది మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరిగాయి. హైదరాబాద్ నడిబొడ్డున అంధ విద్యార్థిపై అఘాయిత్యం జరిగితే మంత్రులుగా కనీసం అక్కడకు వెళ్లారా' అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.

మహిళల పై అన్యాయాలు జరిగితే ఎందుకు స్పందించలేదు, మహిళా కమిషన్ ఎందుకు నోటీసులు ఇవ్వలేదని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. జరిగిన సంఘటనలు కనిపించడం లేదా? ఎందుకు ఎనిమిది నెలలుగా నోరు మెదపలేదని అడిగారు. అసెంబ్లీలో నిండు సభలో సీఎం, డిప్యూటీ సీఎం మమ్మల్ని ఏం మాట్లాడారు? దానికి కనీసం స్పందించారా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. మాట దొర్లిందని వెంటనే స్పందించిన కేటీఆర్ సంస్కారం ఎక్కడ? నాలుగున్నర గంటల పాటు నిల్చున్నా మాట్లాడే అవకాశం ఇవ్వకుండా రాక్షసానందం పొందిన మీ సంస్కారం ఎక్కడ? అంటూ ధ్వజమెత్తారు.




గతంలో డీకే అరుణకు కేటీఆర్ అసెంబ్లీలో క్షమాపణ చెప్పారు : సంస్కారవంతులు ఎవరో, సంస్కారహీనులు ఎవరో అందరికీ తెలుసునని సబితా ఇంద్రారెడ్డి అన్నారు. గతంలో డీకే అరుణతో వాగ్వాదం జరిగినప్పుడు కేటీఆర్ అసెంబ్లీలో క్షమాపణ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. జరుగుతున్న సంఘటనలు మహిళా మంత్రులకు కనిపించడం లేదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు ప్రత్యేక బస్సులు నడిపించారు బాగానే ఉంది, మరి నెలకు వారికి ఇస్తామన్న రూ.2500 ఎక్కడకుపోయాయని ప్రశ్నించారు. హరీశ్ రావు కార్యాలయంపై దాడి ద్వారా ఏం సందేశం పంపదలచుకున్నారని గట్టిగా అడిగారు. హుందాతనం ప్రదర్శించాలని మంత్రులు సురేఖ, సీతక్క ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెప్పాలని సబితా ఇంద్రారెడ్డి హితవు పలికారు.



పోలీస్ కమిషనర్ కార్యాలయంలో వినాయక చవితి ఏర్పాట్లపై విలేకరులతో సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, పోలీస్ ఉన్నత అధికారులు.

- విశ్వంభర, హైదరాబాద్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో శనివారం 129 డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాక అధ్యక్షుడు కేటీ రామారావుని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో 126 డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, 130 డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, ముకుంద రావు, తాటి రవి కుమార్, కిరణ్ కుమార్, ప్రసాద్, జై కృష్ణా పాల్గొన్నారు.

- విశ్వంభర, కుత్బుల్లాపూర్

## ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ల నిరసన, ఓపీ సేవలు బంద్

**విశ్వంభర, ఘట్కేసర్:** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ ప్రభుత్వ హాస్పటల్లో డాక్టర్లు హాస్పటల్ సిబ్బంది శనివారం గంటసేపు విధులు బహిష్కరించారు.

కలకత్తా పీజీ ట్రైనీ డాక్టర్ పై హత్యాచార ఘటనకు నిరసనగా డాక్టర్లు ఆందోళన బాట పట్టారు. ఆసుపత్రిలో అన్ని రకాల ఓపీ సేవలు నిలిపివేసి హాస్పిటల్ ముందు నిరసన వ్యక్తం చేశారు.

వారు మాట్లాడుతూ డాక్టర్లపై దాడుల నివారణకు కేంద్ర ప్రభుత్వం కఠిన చట్టాలను రూపొందించాలని, డాక్టర్లపై ఎవ్వరు దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, అత్యాచారం చేసిన వారికి శిక్ష పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ ప్రభుత్వ హాస్పిటల్ సూపర్ ఇండెంట్ అనురాధ, డాక్టర్లు, డ్యూటీ నర్సులు, హాస్పటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.






## నిరుపేదల విద్య కోసం అనునిత్యం తపించిన నాయకుడు కె.ఎం.పాండు

**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఈరోజు చింతల్ ప్రధాన రహదారిలోని స్వర్గీయ మహానేత, బాపు కె.ఎం. పాండు విగ్రహం వద్ద నిర్వహించిన కే.ఎం. పాండు 79 వ జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే కే.పీ. వివేకానంద్ పాల్గొని వారి తండ్రి కె.ఎం.పాండు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మహానేత సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్ మట్లాడుతూ ఇందిరా గాంధీ ప్రభుత్వంలో కుత్బుల్లాపూర్ మున్సిపల్ చైర్మన్ గా ఉన్న పాండు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఆసియా ఖండంలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడ అయిన "జీడిమెట్ల పారిశ్రామిక వాడను ఏర్పాటు చేయించి అభివృద్ధి చేసిన ఘనత పాండుకి దక్కుతుందన్నారు. భవిష్యత్తు తరాలు బాగుండాలంటే అందరికీ విద్యా అందించాలని, నిరుపేదల విద్య కోసం అనునిత్యం తపించిన నాయకులు కె.ఎం.పాండు అని అన్నారు. వారి ఆశయ సాధనలో భాగంగానే ఒకేషనల్ కాలేజీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. త్వరలోనే డిగ్రీ కళాశాలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. నేడు ఎంతోమంది నాయకులు కుత్బుల్లాపూర్ పాఠశాలలోనే విద్యనభ్యసించారన్నారు. అదేవిధంగా ప్రతి సంవత్సరం మా నాన్నగారి జయంతి సందర్భంగా నిరుపేద మహిళలకు ఉపాధి కల్పనలో భాగంగా కె.ఎం.పాండు మెమోరియల్ ట్రస్ట్ ద్వారా కుట్టు మిషన్లను పంపిణీ చేయడం ఎంతో సంతృప్తిని ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, వివిధ పార్టీల నాయకులు, కె.ఎం.పాండు అభిమానులు, నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పుట్టినరోజున సేవలు చేయడం ఆనందదాయకం

- డా. పెండెం కృష్ణ కుమార్



**విశ్వంభర, ఎల్బీనగర్:** పుట్టినరోజు సేవలు చేయడం ఆనందదాయకం అని గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నాలుగు సార్లు పొందిన విభిన్న పాత్రాభినయ కళాకారులు, సమాజ సేవకులు, రచయిత డా. పెండెం కృష్ణ కుమార్ అన్నారు. శనివారం తన పుట్టిన రోజు సందర్భంగా మాన్సూరబాద్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దేశ నాయకులు, శాస్త్రవేత్తలు, స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాలు, మెడికల్ కిట్టు, వాటర్ క్యాన్, ఆట వస్తువులు వాలీబాల్, రింగ్ బాల్స్, స్కిప్పింగ్ రోప్స్, మల్టిపుల్ గేమ్స్ చెస్ బోర్డ్, క్రికెట్ బాట్, బాల్, వరల్డ్ మ్యాప్స్ , గోడ గడియారం, విటమిన్ సి టాబ్లెట్స్ క్లాత్ బాగ్స్ అందజేయడం జరిగింది అని తెలిపారు. ఈ సందర్భంగా పర్యావరణం కొరకు పాఠశాలలో చెట్లు నాటామని తెలిపారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎం. యాదగిరి మాట్లాడుతూ దాత పెండెం కృష్ణ కుమార్ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందించడానికి క్రీడా సామాగ్రిని, దేశభక్తిని పెంపొందించడానికి దేశ నాయకుల పటాలను, శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి శాస్త్రవేత్తల పటాలను, పర్యావరణ పరిరక్షణ అలవర్చడానికి క్లాత్ బ్యాగులను అందించడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ఎన్. రామలింగం, స్కూల్ అసిస్టెంట్ సిద్దు, రాజశ్రీ, వసుంధర, పద్మ, అనురాధ, జయంతి పాల్గొన్నారు.


## పేషంట్ కేర్, శానిటైజర్ సెక్యూరిటీ కార్మికుల ధర్నా




**విశ్వంభర, ఘట్కేసర్ :** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ ప్రభుత్వ దవఖాన లో పనిచేస్తున్న పేషంట్ కేర్, సానిటైజర్ సెక్యూరిటీ లకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ప్రతి నెల 5వ తారీఖు జీతాలు ఇవ్వాలని, ఈఎస్ఐ పిఎఫ్ కూడా వర్తింపచేయాలని కార్మికులతో కలిసి శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జయచంద్ర మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు ఏఐటీయూసీ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఐకాన్ అవార్డ్స ప్రదానం

**విశ్వంభర, బషీర్ బాగ్:** వివిధ రంగాలలో కృషిచేసిన 24 మందికి తెలంగాణ ఐకాన్ అవార్డ్సు ప్రదానం చేశారు. తెలంగాణ వాయిన్ స్టూడియో, బిగ్రీల్స్ అధ్యక్షుడు రమేశ్ కిషన్ గౌడ్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీఐఐసీ) చైర్పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తెలంగాణాలో కళలు, ప్రతిభావంతులను ప్రోత్సహించడంలో రాష్ట్ర ప్రభుత్వం ముందున్నదని నిర్మలాజగ్గారెడ్డి తెలిపారు. ఐకాన్ అవార్డ్సు గ్రహీతలను అభినందించారు. రచయిత వేములవాడ ద్రోణాచారి, డీఆరికే (జానపదకళల సింగిడి) శ్రీనివాన్ గౌడ్, జంగయ్యగౌడ్ రంగస్థలం (కళాకారుడు), జోగిని శ్యామలదేవి (బోనాల అమ్మవారి సేవకురాలు), తులసీదాను గైక్వాడ్, డా.విజయభాన్కర్, మామిడిపల్లి మల్లేష్ (పోతురాజు), లడ్డూ యాదవ్ (నదర్ ఫెస్టివల్), శ్రీనివాస్ గౌడ్ డా. కిరణ్, తేజస్వీ, రాజశ్రీ, మురళీయాదవ్, ఆనంద్ కుమార్, నూర్య, నవీన్ కుమార్ తదితరులకు అవార్డులు అందజేసి, శాలువాతో సత్కరించారు. మన మట్టి మనుషులకు, నిజాయితీగా సేవలు చేస్తున్న ప్రతిభావంతులకు అవార్డులు ఇవ్వడం గొప్ప విషయమని పురస్కార గ్రహీతలను తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ అభినందించారు.



## ఆకర్షిస్తున్న 108 అడుగుల
# అన్నమాచార్యుని విగ్రహం

**తిరుమల వేంకటేశ్వర స్వామికి ప్రియ భక్తుడు, గొప్ప వాగ్గేయకారుడు అయిన తాళ్లపాక అన్నమాచార్య గురించి మీరు వినే ఉంటారు. ఆయనకు సంబంధించి 108 అడుగుల ఎత్తైన విగ్రహం తిరుపతికి సమీపంలోనే ఉంది.**




108 అడుగుల అన్నమాచార్య విగ్రహం

తిరుపతికి 94 కిలోమీటర్ల దూరంలో, కడపకు 53 కిలోమీటర్ల దూరంలో ఉన్న కడప జిల్లా తాళ్లపాక లో అన్నమాచార్య జన్మించిన ప్రదేశం ఉంది. 15వ శతాబ్ధంలో గొప్ప తెలుగు వాగ్గేయ కారుడిగా ఈయన ప్రసిద్ధి చెందారు. వేంకటేశ్వర స్వామిపై అనేక కీర్తనలు రచిస్తూ తన జీవితాంతం ఆరాధన చేశారు. దక్షిణ భారత దేశంలో పాటలకు స్వర కల్పన చేసిన తొలి తరం సంగీతకారుడు ఆయన. అన్నమాచార్య తిరుమల వేంకటేశ్వర స్వామిపై దాదాపు 32 వేల కీర్తనలు స్వర పరచినట్లు చెబుతారు. దేశ వ్యాప్తంగా ఇవి ఎంతో ప్రాచుర్యం పొందాయి.అన్నమాచార్య విగ్రహాలను మీరు తిరుమల కొండపై అనేక చోట్ల చూడవచ్చు. కానీ అన్నింటి కంటే అతిపెద్ద విగ్రహాన్ని టిటిడి అన్నమాచార్య జన్మస్థలానికి సమీపంలో బోయనపల్లి వద్ద నిర్మించింది. ఈ విగ్రహం ఎత్తు 108 అడుగులు. అన్నామాచార్య 600వ పుట్టినరోజు సందర్భంగా కొంత కాలం క్రితం టిటిడి ఈ విగ్రహాన్ని ఆవిష్కరించింది. ఇది కడప జిల్లా రాజంపేట మండలంలో ఉంది. కడప నగరం నుండి తాళ్లపాకకు 55 కిలోమీటర్ల దూరం. రాజంపేట మండలంలో ఇది ఎంతో ముఖ్యమైన పంచాయితీ.తాళ్లపాక ప్రవేశం ద్వారం వద్ద అన్నమాచార్య 10 అంతస్తుల ఎత్తైన విగ్రహం ఉంటుంది. ఈ గ్రామాన్ని ఒకప్పుడు వేంకటేశ్వర రాజభవనంగా పోషించారు. తరువాత ఇది కవి, వాగ్గేయకారుడు అయిన తాళ్లపాక అన్నమాచార్య జన్మస్థలంగా ప్రసిద్ధి చెందింది. 15వ శతాబ్ధంలో తాళ్లపాక ఎంతో గొప్పగా వర్ధిల్లింది. ఎందుకంటే ఇక్కడి ప్రజలు అనేక ప్రతిభలను కలిగి ఉండేవారు. గొప్ప వ్యవసాయం మరియు విభిన్న వర్తకాలు ఆ రోజుల్లో ప్రజలు చేపట్టేవారు.

### కుటుంబంలో అందరూ కవులే

- అన్నమాచార్య భార్య తిమ్మక్క తెలుగు సాహిత్యంలో మొదటి కవయిత్రి. ఈమె సుభద్రా కళ్యాణం రచించారు. అన్నమాచార్య కుమారులు, మనుమలు కూడా ఆయన అడుగుజాడల్లోనే నడుస్తూ కవులుగా పేరొందారు. తాళ్లపాక కవుల కృషి వలన కడప జిల్లా పేరు కీర్తింపబడింది.

### ధ్యాన మందిరం

- తాళ్లపాక వద్ద వాగ్గేయకారుడు అన్నమాచార్య జ్ఞాపకార్థం ఒక ధ్యాన మందిరాన్ని నిర్మించారు. చెన్నకేశవ స్వామి ఆలయానికి సమీపంలో అన్నమాచార్య ఆలయం వద్ద ఇది ఉంది. చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో చాలా దేవాలయాలు ఉన్నాయి. ఈ ఆలయ ప్రాంగణంలోని దేవాలయాలలో సుదర్శన చక్రంతో కూడిన విష్ణువు, గోపాలకృష్ణ విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.
- తిరుమల వెళ్లాక ఇవి చూసే వస్తున్నారా?

### ఎలా చేరుకోవాలి?

- తాళ్లపాక కడప నుండి 50 కిలోమీటర్లు, తిరుపతి నుండి 91.2 కిలోమీటర్లు, రాజంపేట నుండి 3.4 కిలోమీటర్ల దూరంలో ఉంది. రోడ్డు మార్గం ద్వారా అన్ని ప్రాంతాల నుండి ఈ గ్రామం చక్కగా అనుసంధానించబడి ఉంది. రైలు మార్గం ద్వారా ఇక్కడికి సులభంగా చేరుకోవచ్చు.
- **సమీప రైల్వే స్టేషన్లు:** రాజంపేట (4 కిలోమీటర్లు), కడప (60 కిలోమీటర్లు), రేణిగుంట (83 కిలోమీటర్లు)
- **సమీప విమానాశ్రయాలు:** కడప (58.8 కిలోమీటర్లు), తిరుపతి (91 కిలోమీటర్లు), చెన్నై (205 కిలోమీటర్లు), బెంగళూరు (291 కిలోమీటర్లు), హైదరాబాద్ (472 కిలోమీటర్లు).






# టూరు.. హుషారు

**విహారం కొందరికి వినోదం. మరికొందరికి విజ్ఞానం. ఇంకొందరికి విలాసం. ఎందరు ఎన్ని రకాలుగా అనుకున్నా విహారం ఒక అనుభవసారం. ఆధునిక వాహనాలు లేని కాలంలో విహారం వ్యయప్రయాసలతో కూడుకుని ఉండేది. ఎంతో అవసరమైతే తప్ప యాత్రలకు, పర్యటనలకు బయలుదేరే జనాలు అరుదుగా ఉండేవారు. మోటారు వాహనాలు, రైలుబళ్లు, ఓడలు, విమానాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత రకరకాల ప్రయోజనాల కోసం మనుషులు పర్యటనలు చేయడం పెరిగింది. క్రమంగా పర్యాటకం ఒక పరిశ్రమగా రూపుదిద్దుకుంది. చాలా దేశాలకు ప్రధాన ఆదాయ వనరు స్థాయికి ఎదిగింది. కొన్ని దేశాలైతే కేవలం పర్యాటక రంగంపైనే ఆధారపడి మనుగడ సాగిస్తున్నాయి. ఆధ్యాత్మిక క్షేత్రాలు, చారిత్రక కట్టడాలు, కొండలు కోనలతో చూడచక్కని ప్రకృతి పరిసరాలు, అద్భుతమైన సముద్ర తీరాలు వంటి ప్రదేశాలు పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చెందాయి.**

ఆదిమ దశలో మనుషులు సంచార జీవులు. వ్యవసాయం నేర్చుకున్న తర్వాత తమకు అనుకూలమైన ప్రదేశాల్లో స్థిర నివాసాలు ఏర్పరచుకోవడం ప్రారంభించారు. స్థిర నివాసాలు ఏర్పరచుకున్న తర్వాత మనుషుల సంచారం బొత్తిగా పరిమితమైపోయింది. తమ నివాస ప్రాంతాల పరిధిని దాటి సుదూర ప్రయాణాలు చేయవలసి అవసరం లేకుండా పోవడమే దీనికి కారణం. సుదీర్ఘకాలం మనుషులు స్థిర నివాసాలు ఉన్న ప్రాంతాల్లో నాగరికతలు ఏర్పడ్డాయి. ప్రాచీన నాగరికతలు కొనసాగుతున్న కాలంలోనూ మనుషులు పర్యటనలు చేసేవారు. అప్పట్లో అవి సంపన్నులకు మాత్రమే పరిమితమై ఉండేవి. పుట్టి పెరిగిన పరిసరాలకు సుదూరంగా వెళ్లి రావడం సామాన్యులకు సాధ్యమయ్యేది కాదు. ప్రాచీన రోమన్ సామ్రాజ్యంలో సంపన్నులు నీటిబుగ్గలు, సముద్రతీరాలు ఉన్న ప్రాంతాలకు విలాసయాత్రలకు వెళ్లేవారు. వారి సౌకర్యాల కోసం అక్కడ విడిది కేంద్రాలను కూడా ఏర్పాటు చేసుకునేవారు. ప్రాచీన ఈజిప్టు, చైనా నాగరికతల్లో కూడా సంపన్నులు, కులీనులు వినోదం కోసం యాత్రలు చేసేవారు. మతపరమైన నమ్మకాలు ఉన్నవారు మతగ్రంథాలలో వర్ణించిన ప్రదేశాలకు వెళ్లేవారు. చైనా పురాణాల్లో వర్ణించిన 'ఐదు



పవిత్ర పర్వతాల'ను ప్రాచీన చైనీస్ సంపన్నులు సందర్శించుకునేవారు. కొత్త కొత్త భాషలు తెలుసుకోవడానికి, కొత్త ప్రదేశాల్లో కొత్త కొత్త రుచుల వంటకాలను ఆస్వాదించడానికి, కొత్త సంస్కృతులతో పరిచయం పెంచుకోవడానికి%--% ఇలా వేర్వేరు కారణాలతో ప్రాచీనులు పర్యటనలపై ఆసక్తి చూపేవారు. సుదూర ప్రయాణాలు చేసే యాత్రికుల సౌకర్యం కోసం నాటి రాజులు రహదారులను, రహదారులకు చేరువలో విడిది గృహాలను కూడా నిర్మించేవారు. మధ్యయుగాల నాటికి మతాల ప్రాబల్యం పెరిగింది.

వివిధ మతాలకు చెందినవారు తమ తమ మతాలకు చెందిన పవిత్రక్షేత్రాలకు యాత్రలు చేసే పద్ధతి మొదలైంది. మన దేశంలోనైతే జనాలు ఎక్కువగా కాశీయాత్ర చేసేవారు. పురాణాల్లో వర్ణించిన పుణ్యక్షేత్రాలను కూడా దర్శించుకునేవారు. పాస్‌పోర్టులు, వీసాల బెడద లేని ఆ కాలంలో కొందరు సాహసులు దేశ దేశాలను కూడా దాటి సుదూర ప్రయాణాలు చేసేవారు. దేశాంతర ప్రయాణాలకు అప్పట్లో నౌకలు అందుబాటులో ఉండేవి. అలాంటి ప్రయాణాలు చేసేవారిలో రచనా సామర్థ్యం ఉన్న కొందరు తమ ప్రయాణానుభవాలను, తాము చూసిన ప్రదేశాల వివరాలను కూడా తాము రచించిన గ్రంథాల్లో వివరంగా నమోదు చేశారు. నాటి చరిత్రకు, అప్పటి పరిస్థితులకు వారి రచనలు ఆధారంగా నిలుస్తాయి.

## తాజ్‌మహల్, ఆగ్రా

అత్యధిక జనాభా గల దేశాల్లో మనది రెండోస్థానం. ప్రపంచ ఆర్థిక శక్తుల్లో మనది ఐదో స్థానం. పర్యాటక రంగంలో మాత్రం మన దేశం మొదటి పదిస్థానాల్లో ఎక్కడా చోటు దక్కించుకోలేదు. ఏటా వచ్చిపోయే అంతర్జాతీయ పర్యాటకుల సంఖ్య ప్రాతిపదికన చూసుకుంటే 2018 నాటికి భారత్ 34వ స్థానంలో ఉంది. అంతకు ముందు ఏడాది 40వ స్థానంలో ఉండేది. ఏడాది వ్యవధిలో కొంత మెరుగుదల సాధించినా, పర్యాటక రంగంలో భారత్ మరింత మెరుగైన ఫలితాలను సాధించాల్సి ఉంది. పర్యాటక రంగంలో మొదటి పది స్థానల్లో ఉన్న దేశాలు, ఆ దేశాలను సందర్శించిన అంతర్జాతీయ పర్యాటకుల సంఖ్య వివరాలు...

### ఉపాధికి ఊతమిస్తున్న పర్యాటకం

పర్యాటక రంగం దేశ ఆర్థికరంగాన్ని పరిపుష్టం చేయడమే కాకుండా, చాలామంది ఉపాధికి ఊతమిస్తోంది. మన దేశంలో గత ఏడాది నాటి లెక్కల ప్రకారం పర్యాటక రంగం 4.26 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తోంది. దేశ స్థూల జాతీయ ఉత్పత్తిలో 9.2 శాతం మొత్తం పర్యాటక రంగం ద్వారానే సమకూరుతోంది. గత ఏడాది నాటికి భారత పర్యాటక రంగం ద్వారా రూ. 16 లక్షల కోట్ల ఆదాయం లభించింది. మరో పదేళ్లలో- అంటే, 2029 నాటికి పర్యాటక రంగం ఆదాయం రూ.35 లక్షల కోట్లకు చేరుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. స్వదేశీ పర్యాటకులను ఆకట్టుకోవడానికి కూడా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. 'స్వదేశ్ దర్శన్', 'ప్రసాద్' పథకాలతో పాటు స్వదేశీ విమాన ప్రయాణాలను ప్రోత్సహించడానికి 'ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్' (ఉడాన్) పథకాన్ని ప్రారంభించింది. భారత పర్యాటక రంగం ప్రస్తుతం 6.9 శాతం వార్షిక వృద్ధి రేటును నమోదు చేసుకుంటోంది.



## ఇక్కడకు వచ్చే విదేశీ పర్యాటకుల్లో అత్యధికులు సందర్శించుకునే ప్రదేశాలు ఏవంటే..

### ఆగ్రా

భారత్‌కు వచ్చే విదేశీ పర్యాటకుల్లో ఎక్కువమంది ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను తప్పనిసరిగా సందర్శించుకుంటున్నారు. ప్రపంచంలోని ఏడువింతల్లో ఒకటైన తాజ్‌మహల్‌ను చూడటమే లక్ష్యంగా పెట్టుకుని ఇక్కడకు ప్రత్యేకంగా వచ్చే పర్యాటకులు కూడా ఉంటున్నారంటే అతిశయోక్తి కాదు. తాజ్‌మహల్ చూడటానికి వచ్చే పర్యాటకులు ఆగ్రాలోను, చుట్టుపక్కల ఉండే పర్యాటక ప్రదేశాలను కూడా సందర్శించుకుని వెళుతున్నారు. ఆగ్రాలోను, ఆగ్రా పరిసరాల్లోని ఆగ్రా కోట, మొఘల్ గార్డెన్స్, జమా మసీదు, మోతీ మసీదు, సికింద్రా కోట, వన్యప్రాణి సంరక్షణ కేంద్రం వంటి ప్రదేశాలకు విదేశీ పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటోంది. ఢిల్లీ: ఆగ్రా తర్వాత భారత్‌కు వచ్చే విదేశీ పర్యాటకుల తాకిడి ఢిల్లీలో ఎక్కువగా కనిపిస్తుంది. మన దేశ రాజధాని అయిన ఢిల్లీని చూడటానికి విదేశీయులు ఎక్కువగా ఇష్టపడతారు. ఇక్కడి చారిత్రక కట్టడాలైన ఇండియా గేట్, ఎర్రకోట, కుతుబ్ మీనార్, లోటస్ టెంపుల్, అక్షర్‌ధామ్, రాష్ట్రపతి భవన్, పురానా ఖిల్లా వంటి ప్రదేశాల్లో విదేశీ పర్యాటకులు ఎక్కువగా కనిపిస్తారు. అతిపెద్ద ప్రజాస్వామిక దేశమైన భారత్ ఎన్నికలను తిలకించడానికి ప్రత్యేకంగా వచ్చే విదేశీ పర్యాటకుల సంఖ్య గడచిన పదేళ్లలో బాగా పెరిగింది. ఎన్నికల సమయంలో భారత్‌కు వచ్చే విదేశీ పర్యాటకులు ముఖ్యంగా ఢిల్లీలోనే మకాం వేసి, ఇక్కడి ఎన్నికల తతంగాన్ని పరిశీ లించ డానికి ఆసక్తి చూపుతుంటారు.

### జైపూర్

రాజస్థాన్ రాజధాని అయిన జైపూర్ నగరానికి కూడా విదేశీ పర్యాటకులు అత్యధిక సంఖ్యలో వస్తుంటారు. 'పింక్ సిటీ'గా పేరు పొందిన జైపూర్ నగరంలో రాజపుత్రుల గత వైభవానికి నిదర్శనంగా నిలిచే చారిత్రక నిర్మాణాలను తిలకించేందుకు విదేశీ పర్యాటకులు అమితంగా ఆసక్తిని చూపుతుంటారు. ఇక్కడి హవా మహల్, అంబర్ కోట, జంతర్ మంతర్ వంటి ప్రదేశాల్లో విదేశీ పర్యాటకుల రద్దీ ఎక్కువగా కనిపిస్తుంది.

### హంపి

దక్షిణాదిని సందర్శించుకునే విదేశీ పర్యాటకుల్లో అత్యధికులు కర్ణాటకలోని హంపిని తప్పనిసరిగా సందర్శించడానికి ఆసక్తి చూపుతుంటారు. ఇక్కడి పురాతన చారిత్రక శిథిల నిర్మాణాలు, విరూపాక్ష ఆలయం వంటి ప్రాచీన ఆలయాలతో పాటు ఆర్కియలాజికల్ మ్యూజియం, పాత రాజప్రాసాదం వంటి ప్రదేశాలను సందర్శించుకుని వెళుతుంటారు.



### గోవా

భారత్‌కు వచ్చే విదేశీ పర్యాటకుల్లో సముద్రతీరంలో విలాసంగా సేదదీరాలనుకునే వారు ఎక్కువగా గోవాకు వస్తుంటారు. విందు వినోదాలకు కొదువలేని గోవా 'పార్టీ కేపిటల్ ఆఫ్ ఇండియా'గా గుర్తింపు పొందింది. ఇక్కడ దొరికే సంప్రదాయ వంటకాల రుచులను ఆస్వాదించడానికి, క్యాసినోల్లో పార్టీలు చేసుకోవడానికి ఇక్కడకు వచ్చే విదేశీయులు ఎక్కువగా ఆసక్తి చూపుతారు. పోర్చుగీసుల కాలం నాటి చర్చిలు, పురాతన నిర్మాణాలను, వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలను తిలకించడానికి కూడా ఆసక్తి చూపుతారు.




### మైసూరు

దక్షిణాది వచ్చే పర్యాటకుల్లో విదేశీయులను అమితంగా ఆకట్టుకునే నగరం మైసూరు. ఇక్కడి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని, అద్భుతమైన చారిత్రక కట్టడాలను విదేశీ పర్యాటకులు అమితంగా ఇష్టపడతారు. మైసూరు ప్యాలెస్, బృందావన్ గార్డెన్స్, మైసూర్ సాండ్ స్కల్ప్చర్ మ్యూజియం, కరంజి సరోవరం వంటి ప్రదేశాల్లో విదేశీ పర్యాటకులు ఎక్కువగా కనిపిస్తారు. ఇక్కడ ఏటా వైభవోపేతంగా జరిగే దసరా వేడుకలను తిలకించడానికి విదేశీ పర్యాటకులు ప్రత్యేకంగా వస్తుంటారు.

### ముంబై

భారత్ వచ్చే విదేశీ పర్యాటకుల్లో ఎక్కువ మంది ఆసక్తి చూపే ప్రదేశాల్లో ముంబై కూడా ఒకటి. భారత ఆర్థిక రాజధాని అయిన ముంబై హిందీ సినీ పరిశ్రమకు కూడా కేంద్రం. ఇక్కడకు వచ్చే విదేశీ పర్యాటకులు విక్టోరియా టెర్మినస్, గేట్ వే ఆఫ్ ఇండియా, హాజీ అలీ దర్గా, ఫిలింసిటీ వంటి ప్రదేశాలను తప్పనిసరిగా సందర్శించడానికి ఇష్టపడతారు. జనసమ్మర్దంతో కిక్కిరిసి ఉండే ధారవి వంటి ముంబై మురికివాడల్లో సంచరించడానికి కూడా కొందరు విదేశీ పర్యాటకులు ప్రత్యేకంగా ఆసక్తి చూపుతారు.



### కేరళ

'దేవుడి స్వదేశం'గా ప్రాచుర్యం పొందిన కేరళకు విదేశీ పర్యాటకుల తాకిడి ఎక్కువే. దక్షిణాదిలో విదేశీయులను అత్యధికంగా ఆకట్టుకునే రాష్ట్రంగా కేరళనే చెప్పుకోవచ్చు. తిరువనంతపురం, కొచ్చి నగరాల్లో పురాతన కట్టడాలు, ఆలయాలను సందర్శించుకోవడానికి, వాయనాడ్‌లోని కొండ కోనల్లోను, కొల్లాం వంటి సముద్ర తీరాల్లో సేదదీరడానికి మాత్రమే కాదు, ఆయుర్వేద చికిత్సల కోసం కూడా పెద్దసంఖ్యలో విదేశీ పర్యాటకులు కేరళకు వస్తుంటారు. కేరళలోని పచ్చని పరిసరాలతో పాటు ఇక్కడ అందుబాటులో ఉండే సంప్రదాయక పంచకర్మ ఆయుర్వేద చికిత్స కేంద్రాలు కూడా విదేశీ పర్యాటకులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి.



### వారణాసి

ప్రపంచంలోని అత్యంత పురాతన నగరాల్లో ఒకటైన వారణాసి 'భారత ఆధ్యాత్మిక రాజధాని'గా పేరుపొందింది. గంగాతీరంలో వెలసిన కాశీ క్షేత్రం నిరంతరం తీర్థయాత్రికులతో కిటకిటలాడుతూ ఉంటుంది. భారత ఆధ్యాత్మిక జీవనశైలిపై ఆసక్తి గల విదేశీ పర్యాటకుల్లో ఎక్కువ మంది తప్పనిసరిగా వారణాసిని సందర్శిస్తుంటారు. ఇక్కడి విశ్వేశర ఆలయం, అన్నపూర్ణ ఆలయం వంటి పురాతన ఆలయాలను, గంగాతీరంలోని స్నానఘట్టాల వద్ద భక్తుల కోలాహలాన్ని తిలకించడాన్ని ఇష్టపడతారు.



### అరుణాచల్ ప్రదేశ్

ఈశాన్య భారత్‌లో విదేశీ పర్యాటకులు అత్యధికంగా సందర్శించుకునే రాష్ట్రం అరుణాచల్ ప్రదేశ్. దేశంలోనే అతిపెద్ద బౌద్ధారామమైన 'త్వాంగ్' బౌద్ధారామాన్ని దర్శించుకునేందుకు విదేశాల నుంచి వచ్చే బౌద్ధులు ఎక్కువగా ఇక్కడకు వస్తుంటారు. ఇక్కడి కొండలు, కోనలతో అద్భుతమైన ప్రకృతి సౌందర్యాన్ని తిలకించి పులకించిపోతుంటారు. అరుణాచల్ రాజధాని ఇటానగర్‌లోని పురాతనమైన ఇటా కోట, మ్యూజియం, వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం వంటి ప్రదేశాల్లో విదేశీయుల రద్దీ ఎక్కువగా కనిపిస్తుంది.





## శామీర్‌పేట చెరువులో చిన్నారుల మృత దేహాలు, తల్లికోసం గాలింపు

**విశ్వంభర, శామీర్‌పేట:** కుటుంబ కలహాలతో ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్యకు యత్నించింది. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట చెరువులో ఇద్దరు చిన్నారుల మృతదేహాలు లభ్యంకాగా, తల్లి కోసం గాలిస్తున్నారు. సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రానికి చెందిన ఎం.స్వామి, భానుప్రియ దంపతులు ములుగులో నివాసం ఉంటున్నారు. ఈనెల 15న రాత్రి దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన భానుప్రియ ఇద్దరు పిల్లలు ఆనంద్(5), దీక్ష(4)తో కలిసి 16న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. వెంటనే భర్త స్వామి స్థానిక పోలీస్ట్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. శనివారం సాయంత్రం ఆనంద్, దీక్ష మృతదేహాలు శామీర్పేట చెరువులో లభ్యమయ్యాయి. తల్లి భానుప్రియ కోసం చెరువులో గాలింపు చేపట్టారు.

## ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డిని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



**విశ్వంభర, కల్వకుర్తి :** మాజీ మంత్రి ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి శనివారం శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళుతూ మార్గమధ్యంలో కల్వకుర్తి పట్టణంలో హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు గోవిందు శ్రీనివాస్ నివాసంలో పలువురు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పలు అంశాలపై ఎమ్మెల్సీతో కాంగ్రెస్ నాయకులు చర్చించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కల్మిచర్ల రమేష్ కార్యదర్శి శ్రీధర్ రైస్ మిల్ అసోసియేషన్ నాయకులు దర్శి, సాయి రాజ్, గోవింద కృష్ణయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

## పేదల పాలిట వరం సీఎం రిలీఫ్ ఫండ్



**విశ్వంభర, ఆమనగల్లు:** తెలంగాణ రాష్ట్రంలో దేశంలో ఎక్కడా లేని విధంగా పేద మధ్య తరగతి కుటుంబాల ఆరోగ్య రక్షణ కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతోగానో తోడ్పాటునందిస్తుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇటీవల అమనగల్లు మండలం రానుంతల గ్రామానికి చెందిన లావుడ్యా పుల్యా నాయక్ అనారోగ్యానికి గురై హాస్పిటల్ లో చికిత్స తీసుకుంటున్నారు. గోలి శ్రీనివాస్ రెడ్డి ఫుడ్ కమిషన్ చైర్మన్ సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన 57,000 రూపాయల చెక్కును శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ రెడ్డి, అరవింద్ నాయక్, సుమన్ నాయక్, గోపి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## హరీశ్ రావు కార్యాలయంపై దాడి

### కాంగ్రెస్ కార్యకర్తలే చేశారని హరీశ్‌రావు ఆరోపణ

**విశ్వంభర, హైదరాబాద్:** సిద్ధిపేటలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు క్యాంపు కార్యాలయంపై శుక్రవారం రాత్రి దాడి జరిగింది. కొందరు ముందుగా గేటు తాళాలను పగలగొట్టారు. ఆ తర్వాత అక్కడ ఉన్న వస్తువులను ధ్వంసం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలే తన కార్యాలయంపై ఈ దాడికి పాల్పడ్డారని ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. అప్రజాస్వామిక రీతిలో కాంగ్రెస్ కార్యకర్తలు వ్యవహరించినట్లు ఎమ్మెల్యే హరీశ్ రావు తన ట్వీట్ లో తెలిపారు. ఈ దాడిని అడ్డుకోవడంలో పోలీసులు విఫలమైనట్లు ఆయన వెల్లడించారు. కాంగ్రెస్ వారిని అడ్డుకోకుండా.. వాళ్లను పోలీసులు రక్షించినట్లు ఆయన ఆరోపించారు. ఒక ఎమ్మెల్యే నివాసంపై దాడి జరిగితే, అప్పుడు సాధారణ పౌరుల పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. ఈ ఘటన పట్ల రాష్ట్ర డీజీపీ తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే హరీశ్ తన ట్వీట్ లో కోరారు. హైదరాబాద్‌లో పనిచేసిన యూకే మాజీ హై కమీషనర్ ఆండ్రూ ఫ్లెమింగ్ .. ఆ విధ్వంసం ఘటన పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన తన సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్‌లో స్పందించారు. ఇలాంటి వీడియోలు చూస్తూ నిద్రలేవడం బాధాకరమని ఆయన అన్నారు. హరీశ్ రావుతో ఎంతో పరిచయం ఉందని, ఆయన పట్ల తనకు వ్యక్తిగతంగా అమితమైన గౌరవం ఉన్నట్లు ఫ్లెమింగ్ తన ట్వీట్‌లో వెల్లడించారు.



## రైతులందరికీ రూ. 2లక్షలలోపు

# రుణమాఫీ చేశాం

### మంత్రి తుమ్మల నాగేశ్వర రావు



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2 లక్షల లోపు రైతు రుణాలన్నింటిని మాఫీ చేశామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్పష్టం చేశారు. ఇప్పటివరకు 22,37,848 ఖాతాలకు 17933.19కోట్ల నిధులు విడుదల చేశామని తెలిపారు. శనివారం అయన మీడియాతో మాట్లాడుతూ ... ఏదేని కారణాల వల్ల 2 లక్షలలోపు ఉన్న రుణం మాఫీ కానీ ఖాతాదారుల వివరాలు సేకరించి, పోర్టల్ లో అప్ లోడ్ చేసేందుకు వ్యవసాయాధికారులకు ఆదేశాలు చేశామని చెప్పారు.కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలోకి వచ్చిన మొదటి పంటకాలంలోపే 26,140.13 కోట్లు రైతు సంక్షేమానికి ఖర్చు పెట్టామన్నారు. గత ప్రభుత్వం పెట్టిన రైతుబంధు బకాయిలు, డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీలు ఆయిల్ పాం రైతులు, కంపెనీలకు పెట్టిన బకాయిలు, పచ్చిరొట్ట విత్తనాల సబ్సిడీ బకాయిలు చెల్లించామని మంత్రి పేర్కొన్నారు.మాది చేతల ప్రభుత్వం, దిగజారుడు రాజకీయాలు మాకు రావన్నారు. రాష్ట్రంలోని 35 బ్యాంకులకు సంబంధించిన 3292 బ్రాంచులు మరియు 909 ప్రాథమిక పరపతి సంఘాలల నుండి 12 డిసెంబర్ 2018 నుండి 09 డిసెంబర్ 2023 వరకు తీసుకున్న పంటరుణాల వివరాలు తెప్పించడం జరిగిందని తెలిపారు. పాస్ బుక్ కలిగి వుండి రుణాలు పొందని ఖాతాల సంఖ్య 42 లక్షలు ఉన్నాయని వీటిలో ఆధార్ కార్డ్ నంబరు తప్పుగా నమోదైన ఖాతాలు, పంట రుణంలో అసలు కన్నా వడ్డీ ఎక్కువ వున్న ఖాతాలు తప్ప అన్నీ వివరాలు సరిగ్గా ఉన్నవని తెలిపారు. రుణమాఫీ 2024 పథకం విధివిధానాలు, మార్గదర్శకాలతో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి పంట కాలంలోనే ప్రభుత్వ ఉత్తర్వులు జీఓ 567 విడుదల చేశామన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడిన మూడు రోజులకే ... జులై 18, 2024 నాడు, లక్షలోపు రుణాలున్న ఖాతాదారులు 11,50,193 కు 6098.93 కోట్లు విడుదల చేసి వారి రుణ విముక్తులను చేశామని స్పష్టం చేశారు.

రెండవ విడతలో లక్ష నుండి లక్షయాభై వేల వరకు రుణాలు ఉన్న 6,40,823 ఖాతాదారులకు 6190.01 కోట్లు విడుదల చేశామని తెలిపారు. మూడో విడతలో అనగా ఆగస్టు 15, 2024 నాడు, ప్రభుత్వం ఇచ్చిన హామీలకు 2 లక్షలలోపు రుణాలు 4,46,832 ఖాతాలలో 5644.24 కోట్ల నిధులు విడుదల చేసి వారిని విముక్తులను చేసామని పేర్కొన్నారు. మూడు విడతలలో మొత్తం 22,37,848 ఖాతాలకు 17933.19 కోట్ల నిధులు విడుదల చేసి ఆగస్టు 15 లోగా 2 లక్షల వరకు రుణం ఉన్న రైతులందరిని రుణ విముక్తులను చేశామన్నారు. రుణమాఫీ 2024 కు సంబంధించి రేషన్ కార్డు ప్రామాణికం కాదు అని పదేపదే చెప్పడం జరిగింది. కేవలం కుటుంబ నిర్ధారణకు మాత్రమే దానిని పరిగణనలోనికి తీసుకున్నామన్నారు. 2 లక్షలలోపు రుణాలు ఉండి, రేషన్ కార్డు లేనివారు, ఆధార్ కార్డు వివరాలు తప్పుగా నమోదైనవారు మరే ఇతర కారణంతో రుణమాఫీ వర్తించని వారు వారికి దగ్గరలో ఉండే వ్యవసాయ అధికారిని సంప్రదిస్తే తగిన రికార్డులు సమర్పిస్తే వారికి కూడా త్వరలో రుణమాఫీ వర్తింపచేస్తామని తెలిపారు. ఇప్పటికే వ్యవసాయాధికారులందరికీ ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. మండల పరిధిలో ఉన్న అన్ని బ్యాంకు బ్రాంచులు , ప్రాథమిక పరపతి సంఘాలకు సంబంధించిన అన్ని సమస్యాత్మక ఖాతాలకు పూర్తి బాధ్యత ఆ మండల వ్యవసాయాధికారి తీసుకుంటారని స్పష్టం చేశారు. రైతు కుటుంబ నిర్ధారణ కోసం మండల వ్యవసాయాధికారి స్వయంగా రైతు కుటుంబాల దగ్గరికి వెళ్లి ఖాతాదారులు, వారి కుటుంబ సభ్యుల వివరాలు మరియు ఆధార్ వివరాలు తీసుకుని పోర్టల్ లో అప్ లోడ్ చేస్తారన్నారు. ఒకవేళ రుణఖాతాలో నమోదైన పేరు, ఆధార్ లో నమోదైన పేరుతో సరిపోలకపోతే ఖాతాదారుని దగ్గర సరైన వివరాలు సేకరించి పోర్టల్ లో అప్ లోడ్ చేస్తారని చెప్పారు.ఒకవేళ బ్యాంకు సమర్పించిన అసలు , వడ్డీలలో తేడా ఉన్నట్లయితే ఖాతాదారుడు వ్యవసాయాధికారికి తెలియజేయాలన్నారు.

ప్రతి జిల్లా వ్యవసాయాధికారి జిల్లా వ్యాప్తంగా రోజువారి అందిన ఫిర్యాదులను సాయంత్రం 5 గంటలలోపు డైరెక్టర్, వ్యవసాయ శాఖ కార్యాలయానికి పంపిస్తారని తెలిపారు.

అదేవిధంగా కొన్ని బ్యాంకుల నుండి సాంకేతిక సమస్యల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 70,000 నుండి 80,000 లోపు ఖాతాలకు సంబంధించి వివరాలు కూడా తెప్పించుకుంటున్నామన్నారు. వీటిలో ఆధార్ నెంబర్లు సమర్పించకపోవడం, రుణాల మంజూరి తేదీలలో తప్పులు వంటివి ఉన్నాయని , వీటిని పరిష్కరించడానికి రాష్ట్రస్థాయిలో అధికారుల బృందం చర్యలు తీసుకొంటున్నదన్నారు. మొదటి, రెండు విడతలలో తప్పులు దొర్లిన 7,925 ఖాతాలను సరిచేసి 44.95 కోట్లు నిధులు ఇప్పటికే విడుదల చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం వారు 2 లక్షల కంటే పైన తీసుకొన్న రుణఖాతాలకు సంబధించి అట్టి ఖాతాదారుడు 2 లక్షల పైన ఉన్న మొత్తాన్ని బ్యాంకులలో జమ చేసిన పిమ్మట వారికి కూడా 2 లక్షల వరకు రుణమాఫీ పథకాన్ని వర్తింపచేయుటకు చర్యలు తీసుకొంటామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం 2 లక్షల లోపు రుణమాఫీని ఆగస్టు 15 కల్లా పూర్తిచేసామని పునరుద్ఘాటించారు . రుణమాఫీ ప్రక్రియ పూర్తికాక ముందే కొందరు రాజకీయ నాయకులు తొందర పడుతున్నారు. భారతదేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోను ఇంతవరకు అధికారంలోకి వచ్చిన మొదటి పంట కాలంలోనే 31,000 కోట్ల నిధులు కేటాయించి అందులో 2 లక్షల వరకు ఉన్న రుణాలను ఆగస్టు 15 వరకు పూర్తి చేసుకొని, 2 లక్షలకు పైన ఉన్న రుణాలను కూడా, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 2 లక్షల కంటే అధికంగా ఉన్న రుణం మొత్తాన్ని ఖాతాదారుడు జమచేసిన పిదప రైతులకు చెల్లించుటకు ప్రభుత్వం సిద్దపడుతుండగా, రైతులను అయోమయానికి గురిచేసే విధంగా ప్రతిపక్ష నాయకులు ప్రవర్తించడం దురదృష్టకరమన్నారు. ఒకవేళ నిజంగా రైతుసంక్షేమాన్ని కోరేవారయితే ముందుగా వారు గత పదిసంవత్సరాలలో చెల్లించకుండా, వదిలేసిన రుణాలు వివరాలు తెప్పించుకొని చెల్లించాల్సిందిగా మంత్రి తుమ్మల ప్రతిపక్ష నేతలకు సూచించారు.

## బెంగాల్ సీఎం రాజీనామా చేయాలి

### డిమాండ్ చేసిన నిర్భయ తల్లి



**బాలియా:** కోల్‌కతాలోని ఆర్జీ మెడికల్ కాలేజీలో 31 ఏళ్ల పీజీ డాక్టర్ అత్యాచారం, హత్యకు గురైన ఘటనపై .. 2012 ఢిల్లీ గ్యాంగ్ రేప్ బాధితురాలు నిర్భయ తల్లి ఆశాదేవి స్పందించారు. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అఘాయిత్యాలను నిలువరించడంలో సీఎం దీదీ విఫలమైనట్లు ఆమె ఆరోపించారు. నిందితులను శిక్షించడానికి బదులుగా .. సీఎం మమతా బెనర్జీ నిరసన ప్రదర్శనలతో .. రేప్ ఘటనను డైవర్ట్ చేస్తున్నట్లు ఆశాదేవి ఆరోపించారు.ఆగస్టు 9వ తేదీన ఆర్జీ కార్ మెడికల్ కాలేజీలో ట్రైనీ డాక్టర్ రేప్, హత్యకు గురైంది. ఈ ఘటనను నిరసిస్తూ దేశవ్యాప్తంగా డాక్టర్లు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. రేప్ ఘటన నుంచి డైవర్ట్ చేసేందుకు దీదీ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నట్లు ఆశాదేవి ఆరోపించారు. ఆమె కూడా మహిళే అని, రాష్ట్ర సీఎంగా ఉన్న ఆమె నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పరిస్థితిని చక్కదిద్దడంలో ఆమె విఫలమైందని, అందుకే సీఎం రాజీనామా చేయాలని ఆశాదేవి డిమాండ్ చేశారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేపిస్టులకు కఠిన శిక్షను అమలు చేయాలని, లేదంటే దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు జరుగుతాయన్నారు. కోల్‌కతా మెడికల్ కాలేజీలో అమ్మాయిలకు రక్షణ లేకుంటే, అప్పుడు దేశంలోని మహిళలకు రక్షణ ఎక్కడ ఉంటుందని ఆమె ప్రశ్నించారు. ట్రైనీ డాక్టర్ రేప్, హత్య కేసులో బెంగాల్ పోలీసులు ఒకర్ని అరెస్టు చేశారు. ఆ కేసును ప్రస్తుతం సీబీఐకి బదిలీ చేశారు.

## గాజాలో దారుణం.. ఒకే కుటుంబంలో 18మంది మృతి



**గాజా :** కాల్పుల విరమణ ఒప్పందంపై ఇజ్రాయెల్, హమాస్ మధ్య చర్చలు అసంపూర్తిగా ముగిసిన వేళ.. గాజాపై మరోసారి భీకర దాడులు జరిగాయి. జవైదా పట్టణంపై టెల్అవీవ్ జరిపిన వైమానిక దాడిలో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది మృతి చెందారు. అల్ అక్సా ఆసుపత్రి ఈ విషయాన్ని ధ్రువీకరించింది. ఈ దాడిలో వ్యాపారి సమీ జవాద్ అల్ఎజ్లా, అతడి ఇద్దరు భార్యలు, 11 మంది పిల్లలు, వారి అమ్మమ్మ, మరో ముగ్గురు బంధువులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపింది. ఈ వ్యవహారంపై విచారణ జరుపుతున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది.

**ఇదీ చదవండి: ప్రభుత్వాన్ని విమర్శిస్తే..**

**కిడ్నాప్ చేస్తోన్న నిఘా సంస్థలు**

లెబనాన్ లోని నాబాతీహ్ ప్రావిన్స్లో జరిపిన దాడిలో ఓ మహిళ, ఆమె ఇద్దరు పిల్లలు సహా 10 మంది మరణించారు. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. హెజ్ బొల్లాకు చెందిన ఆయుధ నిల్వ కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిపినట్లు ఇజ్రాయెల్ ప్రతినిధి తెలిపారు. తీరప్రాంత టైర్ నగరంలో జరిపిన ప్రత్యేక దాడిలో ఓ హెజ్ బొల్లా కమాండర్ను హతమార్చినట్లు వెల్లడించారు. అయితే.. అతడి వివరాలు వెల్లడి కాలేదు. సెంట్రల్ గాజాలోని మాఘాజీ శరణార్థి శిబిరం, పరిసర ప్రాంతాల్లోని పాలస్తీనీయన్లు వెంటనే అక్కడి నుంచి సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లాలని ఆదేశించారు.



## నల్లగొండ జిల్లా రారైస్ మిల్ నూతన కమిటీ ఏర్పాటు

**విశ్వంభర, నల్లగొండ:** నల్లగొండ జిల్లా రారైస్ మిల్ నూతన కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. అధ్యక్షునిగా దుబ్బాక వెంకట్ రెడ్డిని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కొండూరి శేఖర్, ప్రధాన కార్యదర్శిగా మిర్యాల వెంకన్న, కోశాధికారిగా సోమవారం శ్రీనివాస్, కార్యదర్శిగా శేఖర్, కార్యవర్గ సభ్యులుగా పీక నరసింహ, అలంపల్లి ఆనంద్ కుమార్, కుంభం ఉపేందర్ రెడ్డి కొత్తగా ఏర్పడిన నూతన కమిటీకి రారైస్ మిల్లర్స్ అసోషియేషన్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసింది. ఈ కమిటీ ఏర్పాటు చేయడానికి సహకరించిన పెద్దలు రాచకొండ కిష్టయ్య, చేపూరి రవీందర్ గుజ్జుల జనార్దన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.




## 24 గంటల పాటు విధులను బహిష్కారించిన వైద్యులు

**విశ్వంభర, కరీంనగర్:** కోల్ కతాలో జూనియర్ డాక్టర్ పై జరిగిన హత్యాచారం, హత్య ఘటనతో దేశవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతంగా కొనసాగుతున్నాయి. వైద్యులు 24 గంటల పాటు విధుల బహిష్కారించి నిరసనలు చేపడుతున్నారు. కోల్ కతా ఘటనకు నిరసనగా డాక్టర్ల సమ్మెతో కరింనగర్ జిల్లాలోని వైద్యులంతా రోడ్డెక్కి నిరసనలు చేపట్టడంతో దవాఖానాల్లో వైద్యసేవలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కేవలం అత్యవసర సేవలు, క్యాజువాలిటీ సర్వీసులు మినహా మిగతా సేవలన్నింటినికి దూరంగా ఉండాలని డాక్టర్లు నిర్ణయించారు. ఉత్తర తెలంగాణాలో సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించే కేంద్రంగా పేరున్న కరీంనగర్ ఆసుపత్రుల్లో డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో ఆసుపత్రులు బోసిపోయాయి. కరీంనగర్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీరంతా కలెక్టరేట్ వద్దకు చేరుకుని పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు.

## హెల్పింగ్ హాండ్స్ ఫర్ పూర్ సంస్థ సేవలు అమోఘం

**విశ్వంభర, మాడుగుల:** హెల్పింగ్ హాండ్స్ ఫర్ పూర్ సంస్థ చేస్తున్న సేవలు అమోఘమైనవని విద్యార్థుల పాలిట కల్పతరువు అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మాడుగుల మండలం కొలుకులపల్లి ఉన్నత పాఠశాలలో సంస్థ ఏర్పాటు చేసిన సమావేశంలో దాదాపు 200 మంది విద్యార్థులకు సంస్థ సేకరించిన స్కూల్ బ్యాగ్స్, పెన్నులు, ప్యాడ్స్, అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంస్థ చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం అందుగుల గ్రామం మాజీ సర్పంచ్ రాజు కుమార్తె డెంగ్యూ జ్వరంతో ఓవైసీ ఆసుపత్రిలో ట్రీట్మెంట్ తీసుకుంటూ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఓవైసీ ఆసుపత్రికి చేరుకుని శనివారం ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ పాలకూర గణేష్ గౌడ్, మాడుగుల మాజీ జడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి, మాడుగుల మాజీ సర్పంచ్ కొండల్ రెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ చైర్మన్ నర్సిరెడ్డి, దుర్గా ప్రసాద్, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# వెంకయ్యనాయుడిని కలిశాకే నా జీవితం బాగుపడింది

(మొదటి పేజీ తరువాయి)
సేవలను చూసి అబ్బురపడ్డారు. యాజమాన్యాన్ని అభినందించారు. చక్కని కార్యక్రమాలు నిర్వహిస్తున్న వెంకయ్యనాయుడు కుమార్తె దీపా వెంకట్‌ను ప్రశంసలతో ముంచెత్తారు. స్వర్ణభారత్ 23 వసంతాల ఉత్సవం అందరి పండుగ అని పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు కొనియాడారు. వెంకయ్యనాయుడు ఆలోచనలు, ఆదర్శాలు అనుకరించడం సులభమనిపిస్తుందని, కానీ ఆయనలా వాస్తవ రూపంలో చేసిచూపడం కష్టమని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అన్నారు. అవసరమున్న వాళ్లకు ఆపన్నహస్తం అందించాలనుకోవడం ఎవరైనా ఊహించారా? నేను ఇక్కడ అడుగుపెట్టినప్పటి నుంచి ఇదే గమనించానని, డ్రాపౌట్లకు చేయూతనిచ్చి వారికి నైపుణ్య శిక్షణ ఇచ్చారని గుర్తు చేశారు. ఇందులో ఎలాంటి ఆశ్చర్యం లేదని, భారతీయుల స్వప్నం సాకారమవుతోందని వెల్లడించారు. ఆయనకు కృతజ్ఞత తెలిపేందుకు నా వద్ద మాటలు లేవని కొనియాడారు. వెంకయ్యనాయుడు వల్ల తనకు విశేషాధికారం వచ్చిందని తెలిపారు.

గ్రామీణ ప్రాతం నుంచి వచ్చిన తనకు ఎవరూ చేయూత నివ్వలేదని గుర్తు చేసుకున్నారు. తాను వెంకయ్యనాయుడిని కలిశాక తన జీవితం బాగుపడిందని అన్నారు. 23ఏళ్ల క్రితం స్వర్ణభారత్ కోసం ఆయన కన్న కల ఇప్పుడు సాకారమవుతోందని తెలిపారు. సహజ వనరుల్ని సరైన విధంగా వినియోగించాలని సూచించారు. మన వద్ద ఉన్న డబ్బు ఆధారంగా పెట్రోలు కొనుగోలు చేయొద్దని, మన అవసరాన్ని బట్టి కొనుగోలు చేయ్యాలన్నారు. సహజ వనరులు ఏవైనా. డబ్బే ప్రధానంగా వీటిని ఇష్టం వచ్చినట్లు మనం వినియోగిస్తే భవిష్యత్ తరాలను మనం కష్టాల్లో పడేసినట్లు అవుతోందని అన్నారు.

'మన దేశంలో సహజ వనరులు పుష్కలంగా ఉన్నాయి. బాధాకరం ఏంటంటే మన నౌకాశ్రయాల నుంచి ముడి ఇనుము విదేశాలకు ఎగుమతి అవుతోంది. దీనివల్ల ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదు. ఉపాధి అవకాశాలను దెబ్బతింటున్నాయి. కొంత మంది మాత్రమే లబ్ధి పొందుతున్నారు. దేశం దీన్ని భరించే పరిస్థితిలో లేదు.

ఎంతో మంది పేద విద్యార్థులు, గృహిణులకు ఉపాధి కల్పించి స్వంత కాళ్లపై నిలబడేలా స్వర్ణ భారతి ట్రస్ట్ సేవలందిస్తోందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కొనియాడారు. స్వర్ణ భారతి ట్రస్ట్ 23 సంవత్సరాల వేడుకలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయ సహకారాలు తీసుకోకుండా ఏళ్ల తరబడి సేవలందిస్తోందన్నారు.



# తుంగభద్ర డ్యామ్ 19వ గేటు స్థానంలో విజయవంతంగా స్టాప్ లాగ్ పనులు పూర్తి



**విశ్వంభర, కర్నూలు :** తుంగభద్ర డ్యామ్ లో గల్లంతైన 19వ గేటు స్థానంలో స్టాప్ లాగ్ ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. పనులు చేపట్టిన 24 గంటలలోపే 5 బ్లాక్‌ల్లో స్టాప్ లాగ్ ఎలిమెంట్లను అధికారులు విజయవంతంగా అమర్చారు. 4 అడుగుల ఎత్తు, 60 అడుగుల వెడల్పుతో స్టాప్ లాగ్ ఎలిమెంట్లను అమర్చి వృథాగా పోతున్న నీటిని పూర్తిగా అడ్డుకున్నారు.తుంగభద్ర బోర్డు , కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ అధికారులు ఉమ్మడి కృషి ఫలితంగా డ్యామ్‌లోని నీటిని వృథాగా వెళ్లకుండా అడ్డుకున్నారు. డ్యాంల గేట్లు తయారీలో నైపుణ్యం ఉన్న సాగునీటి నిపుణులు కన్నయ్య నాయుడు ఈ బృందానికి నాయకత్వం వహించారు.తుంగభద్ర నుంచి గత నాలుగు రోజులుగా 45 టీఎంసీల నీరు కిందకు వృథాగా వెళ్లింది. మరింత నీరు దిగువకు పోకుండా యుద్ధప్రాతిపదికన రెండు ప్రభుత్వాలు స్పందించి చర్యలు తీసుకోవడంలో సఫలమయ్యారు. స్టాప్‌లాగ్ నిర్మాణ ఖర్చుల కోసం రూ. 5 కోట్ల నిధుల వినియోగానికి తుంగభద్ర పాలకమండలి అనుమతి ఇచ్చిందని అధికారులు తెలిపారు.

# తిరుమలలో వసతి గదుల ఆధునీకరణకు చర్యలు చేపట్టాలి: టీటీడీ ఈవో



**విశ్వంభర, తిరుమల :** తిరుమలలోని సప్తగిరి సత్రాలు, సీఆర్‌వో కార్యాలయాన్ని టీటీడీ ఈవో జె శ్యామలరావు , అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్ శనివారం తనిఖీలు చేశారు. సప్తగిరి సత్రాలు వద్ద గదులను  పరిశీలించి కారిడార్లు, బాత్‌రూమ్‌లలో పరిశుభ్రత, స్విచ్‌బోర్డులు, జలప్రసాదం, పరుపులు, మంచాలు, బెడ్‌షీట్లను పరిశీలించారు.గదులను ఆధునీకరించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, డీప్‌క్లీనింగ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. యాత్రికులతో మాట్లాడి కౌంటర్ల వద్ద గదుల కేటాయింపు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం సెంట్రల్ రిసెప్షన్ కార్యాలయంలో భక్తులకు గదుల కేటాయింపు ప్రక్రియను వారు పరిశీలించారు.ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డు, ఇన్ఫర్మేషన్ కియోస్క్‌లను తనిఖీ చేయడంతోపాటు కర్ణాటక, కళ్లకురిచి నుంచి వచ్చిన భక్తులతో ఈవో మాట్లాడారు. భక్తుల సౌకర్యార్థం తిరుమలలో ఎన్ని గదులు అందుబాటులో ఉన్నాయనే సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రదర్శించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వారి వెంట ఎస్ఈ 2 సత్యనారాయణ, ఈఈలు వేణుగోపాల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం మల్లన్న భక్తులకు గుడ్‌న్యూస్..!

## శని,ఆది వారాల్లో స్పర్శ దర్శనం పునరుద్ధరణ



**విశ్వంభర, శ్రీశైలం:** శ్రీశైలం మల్లికార్జున స్వామి భక్తులకు దేవస్థానం శుభవార్త చెప్పింది. భక్తులకు స్పర్శ దర్శనాలు కల్పించనున్నట్లు పేర్కొంది. శ్రావణ మాసోత్సవాల్లో భక్తుల రద్దీ నేపథ్యంలో ఈ నెల 15 నుంచి 19 వరకు ఐదురోజుల పాటు స్పర్శ దర్శనాన్ని నిలిపివేస్తూ.. కేవలం అలంకార దర్శనాలు మాత్రమే కల్పించాలని గతంలో నిర్ణయించింది. ఈ క్రమంలో గత మూడురోజులుగా కేవలం స్పర్శ దర్శనాలు మాత్రమే కల్పిస్తూ వస్తున్నారు. అయితే, భక్తుల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు ఆది, సోమవారాల్లో స్పర్శ దర్శనాలను పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. నిర్దిష్ట సమయాల్లో నాలుగు విడుతలుగా దర్శనం కల్పిస్తామని దేవస్థానం అధికారులు తెలిపారు.మొదటి విడతలలో ఉదయం 6.45 నుంచి 8.30 వరకు, రెండో విడుతలో మధ్యాహ్నం 12.00 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, మూడో విడతలో రాత్రి 8 నుంచి 9 వరకు, చివరగా రాత్రి 10 గంటల నుంచి 11.30 గంటల వరకు స్పర్శ దర్శనాలు కల్పించనున్నట్లు తెలిపారు. భఖ్తులు స్పర్శ దర్శనం టికెట్లను కేవలం ఆన్‌లైన్ ద్వారా మాత్రమే తీసుకోవాలని.. లభ్యతను బట్టి గంట ముందుగా టికెట్లను జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. దేవస్థానానికి చెందిన అధికారి వెబ్‌సైట్ srisailadevasthanam.org టికెట్లను బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఇక గతంలో నిర్ణయించినట్లుగా గర్భాలయంలో ఆర్జిత అభిషేకాలు, సామూహిక అభిషేకాలు, ఆర్జిత కుంకుమార్చనలకు అవకాశం ఉండదని అధికారులు స్పష్టం చేశారు.

# ఏపీలో 19 నుంచి 31వ తేదీవరకు ఉద్యోగుల బదిలీలు.. మార్గదర్శకాలు జారీ

**విశ్వంభర, అమరావతి :** ఏపీలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు బదిలీలు చేపట్టగా , తాజాగా ఉద్యోగుల బదిలీలపై దృష్టిని సారించింది. మొత్తం 12 శాఖల్లో ఈనెల 19 నుంచి నెలాఖరు వరకు బదిలీలు చేపట్టనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు మార్గదర్శకాలను జారీ చేసింది. ఉద్యోగుల బదిలీలపై ఉన్న నిషేధాన్ని తాత్కాలికంగా ఎత్తివేసింది.ప్రజా సంబంధిత సేవల్లో ఉండే శాఖల్లో మాత్రమే బదిలీలకు అనుమతించినట్లు ప్రభుత్వం పేర్కొంది. రెవెన్యూ , పంచాయతీరాజ్ , గనులు, పౌర సరఫరాలు, అన్ని ప్రభుత్వ శాఖల్లోని ఇంజినీరింగ్, దేవాదాయ , స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, అటవీ, రవాణా, పురపాలక, గ్రామ వార్డు సచివాలయాలు, పరిశ్రమలు, విద్యుత్, వాణిజ్య పన్నులు శాఖలోని ఉద్యోగుల బదిలీలకు అనుమతి ఇచ్చింది. ఎక్సైజ్ శాఖలో బదిలీలకు సెప్టెంబర్ 5 నుంచి 15 వరకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.



# రాయచోటిలో ముగ్గురి సజీవదహనం

**విశ్వంభర, రాయచోటి:** ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా రాయచోటిలో  తల్లీ, ఇద్దరు పిల్లలు మంటల్లో చిక్కుకుని మరణించారు. తీవ్ర విషాదం నింపిన ఈ ఘటనపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్యాస్ సిలిండర్ పేలి మంటలు అంటుకున్నాయా? లేక వారే నిప్పంటించుకున్నారా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. రమాదేవి అనే మహిళ తొగటవీధిలో పిల్లలతో కలిసి ఉంటోంది. ఆమె భర్త జీవనోపాధి కోసం కువైట్ వెళ్లారు. ఇంట్లో నుంచి ఒక్కసారిగా పొగలు వస్తుండటాన్ని స్థానికులు గుర్తించారు. లోపలి నుంచి గడియపెట్టి ఉండటంతో తలుపులు తెరుచుకోలేదు.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలార్పారు. ఇంట్లోకి వెళ్లి చూడగా అప్పటికే రమాదేవి, తొమ్మిదేళ్ల కుమారుడు మనోహర్, ఐదేళ్ల మాన్విత మంటల్లో చిక్కుకుని చనిపోయారు. దీంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కువైట్‌లో ఉన్న భర్త రమాదేవిని ఎప్పుడూ అనుమానిస్తుండే వాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

**ఆ గొడవ కారణంగానే!**

ఈ క్రమంలోనే మృతురాలు రమాదేవిపై అనుమానంతో ఇంటి బయట, బెడ్ రూమ్, వంట గదిలో కూడా సీసీ కెమెరాలు అమర్చినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవని చెప్పారు. శుక్రవారం రాత్రి కూడా భార్యాభర్తల మధ్య గొడవ జరిగినట్లు సమాచారం. ఆ గొడవ కారణంగానే రమాదేవి బలవన్మరణానికి పాల్పడి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. స్థానికులను కూడా పోలీసులు ప్రశ్నిస్తున్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని రాయచోటి డీఎస్పీ రామచంద్ర తెలిపారు.

**మంత్రి పరామర్శ**


రాయచోటిలోని ఘటనా స్థలానికి వెళ్లిన ఏపీ మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఘటనకు కారణాలను వెలికి తీయాలని, బాధితులకు న్యాయం చేయాలని పోలీసులను ఆదేశించారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు సామరస్యంగా పరిష్కరించుకోవాలే తప్ప, ఇలాంటి చర్యలకు పాల్పడితే చాలా బాధాకరమని అన్నారు. ఈ ఘటనపై అన్నీ కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు ఇంటిలోని సీసీ కెమెరాల ఫుటేజీని స్వాధీనం చేసుకున్నారు. సీసీ కెమెరాలు పరిశీలించి నిజానిజాలు తెలుసుకుంటామని డీఎస్పీ వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు రమాదేవి బంధువులతో పాటు మరికొంతమందిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

# వైద్యులతో చర్చలు సఫలం

## ఏపీలో యథావిధిగా ఆరోగ్యశ్రీ సేవలు





**విశ్వంభర, అమరావతి :** ఆరోగ్యశ్రీ  ఆసుపత్రుల పెండింగ్ బకాయిల చెల్లింపునకు ఏపీ ప్రభుత్వం అంగీకరించింది. సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించడంతో వైద్యసేవలను యథావిధిగా కొనసాగించడానికి ప్రైవేట్ ఆసుపత్రుల సంఘం గ్రీన్ సిగ్నల్ తెలిపింది. శనివారం ఏపీ వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆసుపత్రుల సంఘం నాయకులతో చర్చలు జరిగాయి. చర్చల్లో వైద్యశాఖ ముఖ్య కార్యదర్శి, ఎన్టీఆర్ వైద్యసేవ సీఈవో పాల్గొన్నారు. సోమవారం రూ. 500 కోట్లు విడుదలకు మంత్రి అంగీకరించారని సంఘం నాయకులు విజయ్‌కుమార్ తెలిపారు. వచ్చే నెలాఖరుకు మరో రూ. 250 కోట్లు విడుదల చేయాలని మంత్రిని కోరామని ఆయన వివరించారు. నెట్‌వర్క్ ఆస్పత్రుల సమస్య శాశ్వత పరిష్కారానికి మంత్రి కృషి చేస్తామన్నారు. గత రెండేళ్లుగా నెట్‌వర్క్ ఆసుపత్రులకు ప్రభుత్వం రూ. 2,500 లు బకాయిలు పడ్డాయి. బకాయిలు చెల్లించకపోతే ఆగస్టు15 నుంచి సమ్మెలోకి వెళతామని హెచ్చరించాయి. ఈ మేరకు రెండు రోజుల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలను నిలుపుదల చేశారు. దీంతో రోగులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం స్పందించి శనివారం ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించింది. ఈ చర్చలు సఫలం కావడంతో రోగులు ఊపిరిపీల్చుకుంటున్నారు.



# వచ్చే రెండ్రోజుల్లో ఏపీలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు: ఐఎండీ


**విశ్వంభర, అమరావతి:** ఐఎండీ సూచనల ప్రకారం ఉత్తర కర్ణాటకను ఆనుకొని ఉన్న తెలంగాణ ప్రాంతంలోఆవర్తనం విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. దీని ప్రభావంతో ఆదివారం శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, ప్రకాశం, నంద్యాల జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అలాగే కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, కర్నూలు, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.సోమవారం.. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, ప్రకాశం, నంద్యాల, అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, నెల్లూరు, కర్నూలు, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉన్నందున పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు చెట్ల కింద, పోల్స్, టవర్స్ కింద, బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని సూచించారు.

# టీటీడీ పరిపాలనా భవనంలో అగ్ని ప్రమాదం..దస్త్రాలు దగ్ధం



**తిరుపతి:** తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో శనివారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో పలు దస్త్రాలు దగ్ధమయ్యాయి.టీటీడీ పరిధిలోని 13 ఆలయాలకు సంబంధించిన దస్త్రాలు దగ్ధమైనవాటిలో ఉన్నట్టు ప్రాథమికంగా నిర్ధరించారు. అగ్ని ప్రమాదంపై ఉద్యోగి నాగార్జున అధికారులకు సమాచారమిచ్చారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకునేలోపే మంటలు అదుపులోకి వచ్చాయి. అసిస్టెంట్ ఇంజినీర్ భాస్కర్ ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదవశాత్తూ జరిగిందా? కుట్రకోణం ఏమైనా ఉందా? అనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

# చంద్రబాబు మాట.. ఇంటికే ఆటో



**విశ్వంభర, గుడివాడ:** ముఖ్యమంత్రి చంద్రబాబు మాట ఇస్తే కచ్చితంగా నెరవేరుస్తారని పేద ప్రజల్లో ఉన్న నమ్మకం మరోసారి ఆచరణలో నిరూపితమైంది. గుడివాడలో 'అన్న క్యాంటీన్' ప్రారంభోత్సవానికి విచ్చేసిన సీఎం.. వలివర్తిపాడు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ రజనీకాంత్కు విద్యుత్తో నడిచే ఆటోను సమకురుస్తామని హామీ ఇచ్చారు. హామీ ఇచ్చిన కొన్ని గంటల్లోనే రజనీకాంత్కు ఆటోను అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చిన మేరకు ఆటోను ఇవ్వడంపై రజనీకాంత్ ఆనందానికి అవధులు లేవు. తన సంతోషాన్ని ఆటో డ్రైవర్ రజనీకాంత్ స్వయంగా పంచుకున్నారు.

## ఏపీలో మరో ఏడు విమానాశ్రయాలు

# ఏర్పాటే లక్ష్యం

## కేంద్రమంత్రి రామ్మోహన్నాయుడు

**ఢిల్లీ:** ఏపీలోని ఏడు విమానాశ్రయాలను 14కు విస్తరించాలనేదే తన లక్ష్యమని కేంద్రమంత్రి రామ్మోహన్నాయుడు అన్నారు. రాజమహేంద్రవరం, విజయవాడ, కడప విమానాశ్రయాల్లో టెర్మినల్ సామర్థ్యం పెంపు పనులపై సీఎం చంద్రబాబుతో సమీక్ష చేసినట్లు తెలిపారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సీఎం సూచించారని తెలిపారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశం అనంతరం రామ్మోహన్ నాయుడు మీడియాతో మాట్లాడారు. ఏపీలో కొత్త విమానాశ్రయాలు ఏర్పాటుకు భూమిని గుర్తిస్తే తమ శాఖ తరపున సహకారం అందిస్తామన్నారు. శ్రీకాకుళం, దగదర్తి, కుప్పం, నాగార్జునసాగర్లో విమానాశ్రయాల ఏర్పాటుకు గుర్తించినట్టు మంత్రి వివరించారు. ఈ విషయంలో విమానయానశాఖ, రాష్ట్రప్రభుత్వం కలిసి ముందుకెళ్తాయన్నారు. విమానాశ్రయాల్లో మౌలికసదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. కొత్త ప్రాంతాల్లో భూమి, సాంకేతిక అంశాలు పరిశీలిస్తామన్నారు. పుట్టపర్తి విమానాశ్రయాన్ని ప్రభుత్వ సంస్థగా మార్చేందుకు సీఎంతో చర్చించినట్టు తెలిపారు. ప్రైవేటు విమానాశ్రయ నిర్వాహకులతో చర్చించాల్సి ఉందన్నారు. పౌరవిమానయాన సంస్థగా మారిస్తే సాధారణ కార్యకలాపాలు సాగించవచ్చన్నారు. ఏపీని లాజిస్టిక్ హబ్ చేయాలనేది చంద్రబాబు ఆలోచన అని, లాజిస్టిక్ హబ్ చేయడంలో విమానాశ్రయాల పాత్ర కీలకమన్నారు.

# యూత్ ఒలింపిక్స్‌లో క్రికెట్



**విశ్వంభర(క్రీడావిభాగం):** ఒలింపిక్స్‌లో క్రికెట్ పునరాగమనానికి అడుగులు పడుతున్నాయ్. లాస్ ఏంజెలెస్ నగరంలో 2028లో జరుగబోయే విశ్వ క్రీడల్లో క్రికెట్ కూడా భాగం కానుంది. అదే విధంగా యూత్ ఒలింపిక్స్‌లోనూ ఈ ఆటను ప్రవేశపెట్టేందుకు అంతర్జాతీయ ఒలిపింక్స్ సంఘం ప్రయత్నిస్తోంది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ సహకారంతో కలిసి క్రికెట్ పోటీలు నిర్వహించాలని భావిస్తున్నట్టు శనివారం ఐఓసీ తెలిపింది.ఒలింపిక్ సంఘం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు ఐసీసీ ఓ ప్రకటన విడుదల చేసింది. 'యూత్ ఒలింపిక్స్‌లో క్రికెట్ నిజంగా మంచి ఆలోచన. మేము ఆలోచించదగ్గది' అని ఐసీసీ జనరల్ మేనేజర్ విలియం గ్లెన్‌రైట్ వెల్లడించాడు. 2030లో యూత్ ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వనున్న భారత్ ఇప్పటికే క్రికెట్ ఉండాలని పట్టు పడుతున్న విషయం తెలిసిందే. యూత్ ఒలింపిక్స్ 2030కు భారత్‌లోని ముంబై నగరం ఆతిథ్యం ఇవ్వనుంది. నిరుడు అక్టోబర్‌లో ముంబై వేదికగా సాగిన ఐఓసీ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ 2030 యూత్ ఒలింపిక్స్, 2036 ఒలింపిక్స్ పోటీలను భారత్‌లో నిర్వహించేందుకు ఉత్సాహంగా ఉన్నామని అన్నాడు. ఇదే విషయాన్ని మోడీ 78వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఎర్రకోట మీదుగా మరోసారి ప్రస్ఫుటించాడు.

# ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎంపీ కేశినేని చిన్ని



**అమరావతి :** ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎంపీ కేశినేని చిన్ని ( శివనాథ్) ఏకగ్రీవంతో పాటు మొత్తం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సెప్టెంబర్ 8న ఏసీఏకు ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయగా నిన్న శుక్రవారం ఎన్నికల నామినేషన్లకు చివరి తేదీగా నిర్ణయించారు. ఈ ఎన్నికల్లో ఏసీఏలోని అన్ని పదవులకు ఒక్కొక్కరే నామినేషన్‌లు దాఖలు చేయడంతో ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది.అధ్యక్షుడిగా కేశినేని శివనాథ్, ఉపాధ్యక్షుడిగా వెంకట ప్రశాంత్ , కార్యదర్శిగా సానా సతీష్, జాయింట్ సెక్రటరీగా విష్ణు కుమార్‌రాజు, కోశాధికారిగా శ్రీనివాస్. కౌన్సిలర్‌గా గౌరు విష్ణుతేజ్ ఎన్నికయ్యారు. అయితే తుది ఫలితాలను వచ్చే నెల 8న అధికారికంగా ప్రకటించనున్నారు. వైసీపీ ఐదేండ్ల పాలనలో ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ పార్లమెంట్ సభ్యుడు విజయసాయి రెడ్డి కుటుంబ సభ్యులు చేజిక్కించుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్న ఆరోపణలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏసీఏకు ఎన్నికలు నిర్వహించారు. టీడీపీకి చెందిన విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఎన్నికలను సవాలుగా తీసుకుని మొత్తం కార్యవర్గం ఏకగ్రీవం కావడంలో సఫలికృతమయ్యారు.



# మీ ప్రేమాభిమానాలు వెయ్యి పతకాల కంటే ఎక్కువ

**దిల్లీ విమానాశ్రయంలో పెద్ద ఎత్తున స్వాగతం పలికిన అభిమానులు**

**దిల్లీ:** భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ కు దిల్లీ విమానాశ్రయంలో అభిమానులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వినేశ్ అభిమానులను ఉద్దేశించి ప్రసంగించింది. 'కష్ట సమయంలో అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు. అక్కడ గోల్డ్ మెడల్ ఇవ్వలేదు.. కానీ, ఇక్కడి ప్రజలు ఇచ్చారు. మీ ప్రేమాభిమానాలు ఒలింపిక్ పతకాల కంటే విలువైనవి. ఇవి వెయ్యి బంగారు పతకాల కంటే ఎక్కువ' అని ఆమె పేర్కొంది. ఇటీవల పారిస్ లో జరిగిన ఒలింపిక్స్లో భారత్ నుంచి ఫైనల్కు చేరిన మొట్టమొదటి మహిళా రెజ్లర్ గా వినేశ్ ఫొగాట్ చరిత్ర సృష్టించింది. కానీ, ఫైనల్లో 100 గ్రాముల అదనపు బరువు కారణంగా అనర్హతకు గురయ్యింది. ఈ బాధతోనే రెజ్లింగ్ కెరీర్ కు ఆమె గుడ్బై చెప్పింది. అనంతరం ఆమె తన అనర్హతను సవాల్ చేస్తూ.. కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (కాస్) ఆశ్రయించింది. కాస్ నుంచి ఎటువంటి సానుకూల ఫలితం దక్కలేదు. వినేశ్ దాఖలు చేసిన పిటిషన్ తిరస్కరిస్తున్నటు తీర్పునిచ్చింది.

# మళ్లీ రింగ్‌లోకి వినేశ్

- భారత్ కు పతకం అందిస్తానని శపథం
- 2032వరకు కొనసాగుతానని వెల్లడించిన ఫోగట్

**విశ్వంభర(క్రీడా విభాగం):** మహిళా రెజ్లర్ వినేశ్ ఫోగట్ మళ్లీ రెజ్లింగ్ రింగ్‌లో కనిపించనున్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో ఫైనల్‌కు చేరిన వినేశ్.. అధిక బరువు కారణంగా తృటిలో పతకం కోల్పోయిన విషయం తెలిసిందే. ఆ తర్వాత రిటైర్‌మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా రిటైర్‌మెంట్ నిర్ణయంపై వినేశ్ వెనక్కి తగ్గింది. భారత్‌కు ఒలింపిక్ పతకం అందిస్తానంటూ శపథం చేసింది. 2032 ఒలింపిక్స్ వరకు రెజ్లింగ్‌లో కొనసాగుతానని ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ఈ మేరకు సోషల్ మీడియాలో లేఖను విడుదల చేసింది. లేఖ సారాంశం ప్రకారం.. 'మీ అందరికీ ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను. పతకం సాధించేందుకు ఎంతో కష్టపడ్డాను. ప్రత్యర్థులకు ఒక్క అవకాశం ఇవ్వలేదు.. లొంగిపోలేదు. కానీ, పరిస్థితులు మాత్రం కలిసిరాలేదు. విధి వంచించింది. అనూహ్య పరిణామాలతో ఒలింపిక్స్‌లో తిరుగుముఖం పట్టాను.2032 వరకు పోరాడగలనని అనుకుంటున్నాను. నాకు ఆ సత్తా ఉందనే నమ్మకం ఉన్నది. తాను నమ్ముకున్న దారి గురించి నిరంతరం పోరాడుతూనే ఉంటానని ఖచ్చితంగా నమ్ముతున్నా'నంటూ పేర్కొంది. పారిస్ ఒలింపిక్స్‌లో వినేశ్ ఫోగట్ అద్భుతమైన ప్రదర్శన చేసి ఫైనల్‌కు చేరింది. వంద గ్రాములు అదనంగా బరువు ఉండడంతో అనర్హత వేటుపడింది. దీంతో తీవ్రమైన దిగ్భ్రాంతికి గురైన వినేశ్ రెజ్లింగ్‌కు రిటైర్‌మెంట్‌ను ప్రకటిస్తున్నట్లు ప్రకటించింది. తనదైన ప్రదర్శనతో కీలక మ్యాచుల్లోనూ విజయం సాధించి వినేశ్ ఫైనల్‌కు వెళ్లడంతో ఈ సారి రెజ్లింగ్‌లో గోల్డ్ మెడల్ ఖాయమని అనుకున్నారు. ఫైనల్‌లో ఓటమిపాలైన సిల్వర్ మెడల్ దక్కేది. అనూహ్య పరిణామంతో అనూహ్యంగా బరువు పెరిగింది. బరువు తగ్గేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసిన కలిసిరాలేదు. వినేశ్ 50 కిలోల విభాగంలో రెజ్లింగ్‌లో గంటల వ్యవధిలో జరిగిన ప్రి క్వార్టర్స్, క్వార్టర్స్, సెమీ ఫైనల్‌లో అద్భుతమైన ప్రదర్శన చేసింది. తొలి బౌట్‌లో ప్రపంచ నెంబర్ వన్‌ను మట్టికరిపించింది. సెమీ ఫైనల్ వరకు అదే ప్రదర్శన కొనసాగించి.. వరుస విజయాలతో ఒలింపిక్స్ ఫైనల్‌లోకి వెళ్లిన భారత రెజ్లర్‌గా రికార్డులకెక్కింది. అనర్హత వేటు అనంతరం స్పోర్ట్స్ ఆర్బిట్రేషన్‌ను ఆశ్రయించగా.. అక్కడ నిరాశే ఎదురైంది. ఆర్బిట్రేషన్ నిర్ణయంపై స్విస్ కోర్టులో సవాల్ చేసేందుకు అవకాశం ఉన్నది.

# మయాంక్ యాదవ్ జట్టులో ఉంటాడో లేదో గ్యారంటీ లేదు: జైషా

**విశ్వంభర(క్రీడావిభాగం):** సెప్టెంబరు 19 నుంచి భారత్, బంగ్లాదేశ్ మధ్య రెండు టెస్టుల సిరీస్ ప్రారంభంకానుంది. ఈ సిరీసు ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రాను ఎంపిక చేయొద్దని టీమ్ మేనేజ్మెంట్ భావిస్తున్నట్లు సమాచారం. బంగ్లాతో సిరీస్ తర్వాత టీమిండియా మరిన్ని టెస్టులు మ్యాచ్లు ఆడనుంది. దీంతో బుమ్రాకు విశ్రాంతినివ్వాలని భావిస్తున్నారు. దీంతో బంగ్లాదేశ్తో టెస్టు సిరీస్కు యువ ఫాస్ట్ బౌలర్ మయాంక్ యాదవ్ ను ఎంపిక చేస్తారని ప్రచారం జరుగుతోంది. ఇదే విషయాన్ని బీసీసీఐ కార్యదర్శి జై షాని అడగ్గా.. మయాంక్ యాదవ్ జట్టులో ఉంటాడో లేదో గ్యారంటీ లేదని సమాధానమిచ్చాడు. "మయాంక్ యాదవ్ జట్టులో ఉంటాడో లేదో గ్యారంటీ లేదు. కాబట్టి ఎలాంటి సమాధానం చెప్పలేను. కానీ, అతను మంచి ఫాస్ట్ బౌలర్. మేము మయాంకును పర్యవేక్షిస్తున్నాం. అతను ప్రస్తుతం ఎన్సీఏలో ఉన్నాడు" అని జై షా వివరించారు.
మయాంక్ యాదవ్ ఐపీఎల్ లో ఆడింది నాలుగు మ్యాచ్లో అయినా సంచలనం సృష్టించాడు. ఐపీఎల్ 2024 సీజన్లో మెరుపు వేగంతో బౌలింగ్ చేసి ఆకట్టుకున్నాడు. నిలకడగా 150+ కి.మీ వేగంతో బంతులేస్తూ స్టార్ క్రికెటర్లనే ఆశ్చర్యపరిచాడు. లఖ్నవూ తరపున ఆడిన ఈ కుర్రాడు బెంగళూరు పై 156.7 కి.మీ వేగంతో బంతిని విసిరాడు. 2024 సీజన్లో ఇదే అత్యంత వేగవంతమైన బాల్ కావడం విశేషం. పంజాబ్పైనా 155.8 కి. మీ స్పీడ్తో బంతిని వేశాడు. మొత్తం నాలుగు మ్యాచ్లో 6.99 ఎకానమీతో ఏడు వికెట్లు పడగొట్టాడు. తర్వాత గాయం కారణంగా ఐపీఎల్ నుంచి అర్ధంతరంగా వైదొలిగాడు. ప్రస్తుతం మయాంక్ యాదవ్ బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీలో ఉంటూ భారత జట్టులోకి ఎంట్రీ ఇచ్చేందుకు సన్నద్ధమవుతున్నాడు.



# వాణిజ్య కార్యకలాపాల కోసం నిధి ఏర్పాటు



**దిల్లీ:** భారత్‌లో శనివారం జరిగిన గ్లోబల్ సౌత్ సమ్మిట్ ముగింపు వేడుకలో వాణిజ్య కార్యకలాపాల అభివృద్ధి, ప్రమోషన్ కోసం ప్రధాని నరేంద్ర మోదీ 2.50 మిలియన్ డాలర్ల(రూ.20.75 కోట్ల) నిధి ప్రకటించారు. అభివృద్ధికి సంబంధించి.. వాణిజ్యం, స్థిరమైన వృద్ధి సామర్థ్యాల పెంపుదల, సాంకేతిక భాగస్వామ్యం, ఫైనాన్స్, రాయితీ, గ్రాంట్లు వంటి వాటిపై దృష్టి సారించనున్నట్లు ఆయన తెలిపారు. పైన తెలిపిన నిధిలో రూ.8.30 కోట్లను సామర్థ్యం పెంపుదల, వాణిజ్య ప్రమోషన్ కోసం అందిస్తారు. వర్చువల్ ఫార్మాట్లో భారత్ నిర్వహించిన ఈ శిఖరాగ్ర సదస్సు. మౌలిక సదుపాయాలు, డిజిటల్, ఇంధన కనెక్టివిటీతో సహా వివిధ రంగాల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సహకారాన్ని, భాగస్వామ్య పురోగతిని పెంపొందించడానికి ప్రయత్నిస్తుంది.

# పెద్ద లావాదేవీలపై ఐటీ నజర్

**దిల్లీ:** డిజిటల్ లావాదేవీలు అందుబాటులోకి వచ్చినా నగదు లావాదేవీలు మాత్రం కొనసాగుతున్నాయి. ముఖ్యంగా పెద్ద మొత్తంలో లావాదేవీలపై ఆంక్షలు ఉన్నా.. నిఘా కొరవడడంతో యథేచ్ఛగా జరిగిపోతున్నాయి. తాజాగా ఈ విషయమై కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఐటీ శాఖకు కీలక ఆదేశాలు ఇచ్చింది. హోటళ్లు, లగ్జరీ బ్రాండ్ విక్రయాలు, హాస్పిటళ్లు, ఐవీఎఫ్ క్లినిక్స్ వద్ద 'పెద్ద' మొత్తంలో నగదు లావాదేవీలు జరుగుతున్నాయని, వాటిపై దృష్టి సారించాల్సి ఉందని సూచించింది. ఈ మేరకు వార్షిక ప్రణాళికను ఇటీవల విడుదల చేసింది. సాధారణంగా రూ.2 లక్షలకు పైబడి నగదు లావాదేవీలు జరిగితే ఆ వివరాలు ఆర్థిక సంస్థలకు నివేదించాల్సి ఉంటుంది. కానీ నిబంధనలు అతిక్రమించి పెద్ద మొత్తంలో లావాదేవీలు యథేచ్ఛగా జరుగుతున్నాయని ఐటీ శాఖకు సీబీడీటీ తెలిపింది. కొన్ని నగదు లావాదేవీలకు పాన్ కార్డు వివరాలు సేకరించాల్సి ఉన్నప్పటికీ.. అలాంటివి నమోదు కావడం లేదని, వాటిని వెరిఫై చేసే మెకానిజం కూడా లేదని పేర్కొంది. కాబట్టి పన్ను చెల్లింపుదారుల సమాచారంతో పెద్ద మొత్తంలో జరిగే లావాదేవీలను ధ్రువీకరించుకోవాల్సి ఉంటుందని, మోసపూరిత లావాదేవీలను గుర్తించాల్సి ఉంటుందని పేర్కొంది.

**ఈ ప్రదేశాల్లో అధికంగా..**

ముఖ్యంగా బ్యాంకెట్ హాల్స్, లగ్జరీ బ్రాండ్ రిటైలర్స్, ఐవీఎఫ్ క్లినిక్స్, హాస్పిటళ్లు, డిజైనర్ క్లాతింగ్ స్టోర్లు, ఎన్ఆర్ఐ కోటా మెడికల్ కాలేజీ సీట్ల కొనుగోళ్లు వంటి చోట్ల నిబంధనలు పాటించకపోవడంతో పాటు పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని సీబీడీటీ పేర్కొంది. ఇలాంటి లావాదేవీల మూలాలను గుర్తించాల్సి ఉంటుందని తెలిపింది. 'ఇబ్బంది పెట్టని రీతి'లో కాల్ చేసి సమాచారాన్ని ధ్రువీకరించుకోవాలని ఐటీశాఖకు సూచించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో పన్ను ఎగవేతకు సంబంధించి సుమారు 1100 తనిఖీలు నిర్వహించగా.. అందులో రూ.2500 కోట్లు పట్టుబడిందని ఓ సీనియర్ అధికారి పీటీఐకి తెలిపారు. అందులో రూ.1700 కోట్లు కేవలం నగదు రూపంలో పట్టుబడిందని పేర్కొన్నారు. నగదు లావాదేవీలు ఏ స్థాయిలో జరుగుతున్నాయనడానికి ఇదే నిదర్శనమన్నారు. అలాగే, డేటా అనలిటిక్స్, డేటా మైనింగ్ ద్వారా 'కొత్త' పన్ను చెల్లింపుదారులను గుర్తించొచ్చని పేర్కొంది. గతేడాదితో కంటే ఈసారి పన్ను చెల్లింపుదారుల సంఖ్య కనీసం 10 శాతమైనా పెరగాలని లక్ష్యాన్ని నిర్దేశించింది.



# 2030 నాటికి అదనంగా 14.8 కోట్ల ఉద్యోగాలు అవసరం గీతా గోపీనాథ్




**దిల్లీ:** జనాభా పెరుగుదల దృష్ట్యా 2030 నాటికి దేశీయంగా అదనంగా 14.8 కోట్ల ఉద్యోగాలను సృష్టించాల్సిన అవసరం ఉందని అంతర్జాతీయ ద్రవ్యనిధి ఫస్ట్ డిప్యూటీ ఎండీ గీతా గోపీనాథ్ తెలిపారు. ఉపాధి కల్పన విషయంలో జీ20 దేశాలల్లో భారత్ వెనకబడి ఉందన్న అంశాన్ని ఆమె గుర్తుచేశారు. ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ డైమండ్ జూబ్లీ ఈవెంట్లో పాల్గొన్న ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.2010 నుంచి ప్రతి దశాబ్దంలోనూ భారత్ సగటున 6.6శాతం వృద్ధి సాధించిందని గీతా గోపీనాథ్ అన్నారు. అయితే ఉపాధి రేటు మాత్రం 2శాతం కంటే తక్కువగా ఉందన్నారు. అందుకే జీ20 దేశాలతో పోలిస్తే భారత్లో ఉపాధి వృద్ధి రేటు కాస్త తక్కువగా ఉందన్నారు. " దేశంలో జనాభా పెరుగుదల పరంగా చూస్తే 2030 నాటికి 6 కోట్ల నుంచి 14.8 కోట్ల అదనపు ఉద్యోగాలు సృష్టించాల్సి ఉంటుంది. ఇప్పటికే మనం 2024లో ఉన్నాం. కాబట్టి తక్కువ సమయంలో పెద్ద ఎత్తున ఉద్యోగాలు సృష్టించాల్సిన అవసరం ఉంది' అని అన్నారు. భూ, కార్మిక సంస్కరణలు అమలు చేయాల్సిన అవసరాన్ని ఆమె గుర్తు చేశారు. ప్రభుత్వ పెట్టుబడులు పెరిగినప్పటికీ ప్రైవేటు పెట్టుబడులు ఇంకాస్త మెరుగపడాలన్నారు. దేశంలో విద్యా వ్యవస్థను పునరుద్ధరిస్తే నైపుణ్యాలను పెంచుకొనేందుకు దోహదపడుతుందన్నారు. దీంతో పాటు వ్యాపార నిర్వహణ, నిబంధనలను మరింత సులభతరం చేసి, పన్ను పరిధిని విస్తృతం చేస్తే ఆర్థిక వ్యవస్థ మరింత వేగవంతమవుతుందని విశ్లేషించారు.

# దేశంలో ఊపందుకున్న లగ్జరీ కార్ల విక్రయాలు

**దిల్లీ:** దేశంలో లగ్జరీ కార్ల విక్రయాలు ఊపందుకున్నాయి. లంబోర్గిని, ఫెరారీ కార్లు విక్రయాల్లో సరికొత్త రికార్డులను నెలకొల్పుతున్నాయి. ఏటికేడు లగ్జరీ కార్లకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో వాటి విక్రయాలు వరుసగా మూడో ఏడాది కూడా మునుపటి రికార్డులను అధిగమించనున్నాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. లంబోర్గిని కంపెనీ.. హురాకాన్, ఉరుస్, రెవెల్టో వంటి లగ్జరీ కార్లను దేశీయంగా విక్రయిస్తోంది. వీటితోపాటు ఫెరారీ, మెక్లారెన్, మార్టిన్కు దేశీయంగా మంచి డిమాండ్ ఉంది. ఇక హై ఎండ్ మోడల్స్ అయిన మెర్సిడెజ్- బెంజ్, ఆడీల కొనుగోలుకు ఏడాది వెయిటింగ్ పీరియడ్ ఉంది. దీంతో దేశంలో లగ్జరీ కార్ల మార్కెట్కు ఉన్న డిమాండ్ స్పష్టంగా కనిపిస్తోంది.
సూపర్ లగ్జరీ కార్ల విభాగంలో విక్రయాలు గతేడాదిలో రెండింతలై 1,000 యూనిట్లకు చేరుకున్నాయి. ఇదే ఒరవడి కొనసాగితే ఈ ఏడాది ఆ విక్రయాలు 1200- 1300 యూనిట్లకు చేరుకోవచ్చని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దేశంలో 30 మిలియన్ డాలర్లకు పైగా సంపద కలిగిన కుబేరుల సంఖ్య పెరుగుతోంది. 2023లో 13,263 మంది ఉండగా.. 2028 నాటికి వారి సంఖ్య 19 వేలు దాటుతుందని అంచనా. అయితే ఆ కుబేరులతో భారత్ లగ్జరీ కార్ల విషయంలో వేగంగా అభివృద్ధి చెందతున్న మార్కెట్గా ఎదుగుతోంది. మౌలిక సదుపాయాల విస్తరణ, బలమైన ఆర్థిక వృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించడంతో విలాసవంతమైన రంగంలో వినియోగం పెరుగుతోందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుత సంవత్సరం మొదటి ఆరునెలల్లో ఆటోమోటివ్ మార్కెట్ లో అమ్మకాలు క్షీణించినా లగ్జరీ విక్రయాలపై ఆ ప్రభావం పడలేదని పలు నివేదికలు చెబుతున్నాయి.

# అకౌంట్ లేకపోయినా.. యూపీఐ పేమెంట్స్

**దిల్లీ:** ప్రస్తుతం దేశంలో యూపీఐ సేవలకు భారీగా ఆదరణ పెరిగింది. డిజిటల్ చెల్లింపు వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) తాజాగా యూజర్ల కోసం కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. బ్యాంక్ అకౌంట్ లేని వారు కూడా యూపీఐ సేవలను ఉపయోగించుకునే విధంగా ఈ కొత్త ఫీచర్‌ను తీసుకొచ్చారు. ఒకరి యూపీఐ అకౌంట్‌ను మరొకరు వాడుకునేందుకు వీలుగా యూపీఐ సర్కిల్ పేరుతో కొత్త ఫీచర్‌ను తీసుకొచ్చారు.
డెలిగేట్ పేమెంట్‌స్‌గా ఈ కొత్త ఫీచర్‌ను పేర్కొంటున్నారు. ఇంతకీ ఫీచర్ ఉపయోగం ఏంటి.? ఎవరికి లబ్ధి చేకూరుతుంది.? లాంటి పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.. కుటుంబ సభ్యుల్లో ఎవరైనా బయటకు వెళ్లినప్పుడు వారు యూపీఐ ట్రాన్సాక్షన్స్ చేసుకోవచ్చు. ఈ ఫీచర్ సహాయంతో ఇంట్లో ఉన్న వారంతా ఒకే యూపీఐ ఐడీతో పేమెంట్స్ చేసుకోవచ్చు. దీంతో కుటుంబ మొత్తం ఎంత ఖర్చు చేస్తున్నారన్న విషయాన్ని కూడా ట్రాక్ చేసుకోవచ్చు. యూపీఐ యాప్స్, పేమెంట్ సర్వీసు ప్రొవైడర్లు ఈ సేవలను త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నాయి.
ఈ ఫీచర్‌ను ఎనేబుల్ చేసుకునే క్రమంలో.. ప్రైమరీ యూపీఐ హోల్డర్‌కు బ్యాంక్ ఖాతా ఉండాల్సి ఉంటుంది. ప్రైమరీ యూపీఐ హోల్డర్ ఇందుకోసం తన కాంటాక్ట్‌లోని నచ్చిన నెంబర్‌ను సెలక్ట్ చేసుకోవచ్చు. ప్రైమరీ యూజర్ గరిష్ఠంగా ఐదుగురిని ఎంచుకోవచ్చు. సెకండరీ యూజర్ మాత్రం ఒక ప్రైమరీ యూజర్ అకౌంట్‌ను మాత్రమే వినియోగించడానికి వీలుంటుంది. సెకండరీ యూజర్ల చెల్లింపులకు సంబంధించి పరిమితిని విధించుకునే అవకాశం ఉంటుంది. అయితే ఈ విధానంలో నెలకు గరిష్ఠంగా రూ. 15 వేల వరకు ఉపయోగించుకోవచ్చు.
సెకండరీ యూజర్లు చేసే ట్రాన్సాక్షన్స్ ప్రైమరీ అకౌంట్ హోల్డర్ యూపీఐ యాప్, బ్యాంక్ ఖాతాలో కనిపిస్తాయి. దీంతో సెకండీ యూజర్లు దేనికి ఖర్చు చేస్తున్నారో ప్రైమరీ యూజర్ తెలుసుకోవచ్చు. చెల్లింపులకు సంబంధించి ప్రైమరీ యూజర్ సెకండరీ యూజర్లకు అనుమతులు ఇచ్చేలా సెట్టింగ్ చేసుకోవచ్చు. పూర్తిగా డిలిగేషన్ ఇస్తే.. సెకండరీ యూజర్ నుంచి వచ్చే రిక్వెస్ట్‌ను





ప్రతిసారీ ప్రైమరీ యూజర్ ఆమోదించేలా సెట్టింగ్స్ మార్చుకోవచ్చు.

విశ్వంభర V3 NEWS

# ప్రభాస్‌తో హను రాఘవపూడి మూవీ

## పూజాకార్యక్రమాలతో ప్రారంభం

వరుస విజయాలతో జోష్ మీదున్న ప్రభాస్ తర్వాత సినిమాను ప్రారంభించారు. హను రాఘవపూడి దర్శకత్వంలో ఆయన హీరోగా రానున్న సినిమా మొదలైంది. నేడు పూజా కార్యక్రమాలతో దీన్ని ప్రారంభించారు. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీస్ ఓ పోస్ట్ పెట్టింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలను అభిమానులు షేర్ చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలను ప్రకటించనున్నారు. పూర్తిస్థాయి పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ఇది రానుంది. ఇప్పటికే విశాల్ చంద్రశేఖర్ ఈ చిత్రం కోసం మూడు పాటలు కూడా కంపోజ్ చేసినట్లు హను రాఘవపూడి ఓ సందర్భంలో తెలిపారు. పాన్ ఇండియా స్థాయిలో ఇది తెరకెక్కనుంది. తాజాగా దీనికి సంబంధించిన టైటిల్ కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ చిత్రానికి 'ఫౌజీ' అనే పేరును పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇక ఈ చిత్రంలో హీరోయిన్‌గా మృణాల్‌ను తీసుకుంటున్నట్లు వచ్చిన రూమర్స్‌ను ఆమె ఇటీవలే ఖండించారు. 'మీ ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పెడుతున్నందుకు క్షమించండి. నేను ఈ ప్రాజెక్ట్‌లో లేను' అని పేర్కొన్నారు. దీంతో రూమర్‌కు చెక్ పడింది. మరి ఇందులో ప్రభాస్ సరసన ఎవరు కనిపిస్తారో అని ఆయన అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



# మెల్‌బోర్న్ ఫిలిం ఫెస్టివల్‌కు రామ్‌చరణ్

## 14 ఏళ్ల తరవాత రావడం ఆనందంగా ఉందని వ్యాఖ్య

ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ వేదికగా జరుగుతోన్న 'ది ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్'కు గౌరవ అతిథిగా రామ్‌చరణ్ హాజరయ్యారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమకు చేసిన సేవలకుగాను 'ఆర్ట్ అండ్ కల్చర్ బ్రాండ్ అంబాసిడర్'గా అంతర్జాతీయ వేదికపై అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఆరెంజ్' రోజులను గుర్తుచేసుకున్నారు. 14 ఏళ్ల క్రితం 'ఆరెంజ్' సినిమా కోసం ఆస్ట్రేలియాలోని ఈ ప్రదేశానికి వచ్చాను. అది నా మూడో చిత్రం. 30 రోజులు చిత్రీకరణ ఇక్కడే జరిగింది. షూటింగ్ పూర్తయి భారత్‌కు వెళ్లే సమయంలో భావోద్వేగానికి గురయ్యాను. ఇక్కడి ప్రజల ప్రేమను, ఆ రోజులను ఎప్పటికీ మర్చిపోలేను. అప్పటి కంటే ఇప్పుడు ఎక్కువ మంది ఇండియన్స్ ఇక్కడ కనిపిస్తున్నారు. నా హోం టౌన్‌కు వచ్చినట్లు అనిపిస్తోంది. మీ అందరినీ చూస్తుంటే ఆనందంగా ఉంది. భారతీయ చిత్రపరిశ్రమ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం సంతోషంగా ఉంది. మీ అందరి వల్లే ఇది సాధ్యమైంది. ఈ ఈవెంట్ ఎప్పటికీ ప్రత్యేకమే' అని చెప్పారు. ఆస్ట్రేలియాలో మన జాతీయ జెండాను ఎగురవేసిన రామ్ చరణ్.. అక్కడ అభిమానులతో కలిసి ఫొటోలు దిగారు. వాళ్లతో కలిసి సరదాగా సమయాన్ని గడిపారు. ప్రస్తుతం ఈ హీరో 'గేమ్ ఛేంజర్' తో బిజీగా ఉన్నారు. శంకర్ దర్శకత్వంలో ఇది రానుంది. పొలిటికల్, యాక్షన్ నేపథ్యంలో సాగే పవర్‌ఫుల్ కథాంశంతో సిద్ధమవుతోంది. ఇందులో రామ్ చరణ్ ద్విపాత్రాభినయంలో కనిపించనున్నట్లు సమాచారం. డిసెంబర్‌లో ఇది ప్రేక్షకుల ముందుకు రానుంది.



# 22 నుంచి ఓటిటిలోకి కల్కి




ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కల్కి 2898 ఏడీ' బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన ఈ చిత్రం ఓటీటీలోకి ఎప్పుడు వస్తుందా అని ప్రభాస్ అభిమానులతో పాటు సినీ ప్రియులంతా ఎదురుచూస్తున్నారు. తాజాగా దీనికి సంబంధించి అధికారికంగా ఓ ప్రకటన వెలువడింది. ఆగస్టు 22 నుంచి దీని హిందీ వెర్షన్ నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రసారం కానుంది. ఇక ఇదే తేదీ నుంచి తెలుగు, తమిళంతో సహా మిగతా భాషల్లోనూ అమెజాన్ ప్రైమ్ వేదికగా అందుబాటులోకి రానుంది. కథేంటంటే: కురుక్షేత్రం తర్వాత ఆరు వేల ఏళ్లకు మొదలయ్యే కథ ఇది. భూమిపై తొలి నగరంగా పురాణాలు చెబుతున్న కాశీ, అప్పటికి చివరి నగరంగా మిగిలి ఉంటుంది. భూమిపై ఉన్న అన్ని వనరులను పీల్చేసి స్వర్గంలాంటి కాంప్లెక్స్‌ని నిర్మించి పాలిస్తుంటాడు సుప్రీం యాస్కిన్ (కమల్‌హాసన్). కాశీలో బౌంటీ ఫైటర్ అయిన భైరవ (ప్రభాస్) యూనిట్స్‌ని సంపాదించి కాంప్లెక్స్‌కి వెళ్లి అక్కడ స్థిరపడిపోవాలనే ప్రయత్నాల్లో ఉంటాడు. సుప్రీం యాస్కిన్ తలపెట్టిన ప్రాజెక్ట్ కె కోసం, కాంప్లెక్స్ సైన్యం కాశీకి వచ్చి గర్భం దాల్చే అవకాశాలున్న అమ్మాయిల్ని కొనుగోలు చేసుకుని వెళుతూ ఉంటుంది. అలా ఎంతోమంది అమ్మాయిల్ని ప్రాజెక్ట్-కె కోసం గర్భవతుల్ని చేసి, వారి నుంచి సీరమ్ సేకరిస్తూ ప్రయోగాలు చేపడుతుంటారు. అలా సుమతి (దీపికా పదుకొణె) కాంప్లెక్స్‌లో చిక్కుకుపోయి గర్భం దాలుస్తుంది. మరోవైపు రేపటి కోసం అంటూ శంబల ప్రజలు ఎన్నో త్యాగాలు చేస్తూ ఓ తల్లి కోసం ఎదురు చూస్తుంటారు. ఆ తల్లి సుమతి అని నమ్ముతారు. మరి ఆమెని కాంప్లెక్స్ ప్రయోగాల నుంచి ఎవరు కాపాడారు? చిరంజీవి అయిన అశ్వత్థామకీ, భైరవకీ సంబంధం ఏమిటి?సుప్రీం యాస్కిన్ ప్రాజెక్ట్ - కె లక్ష్యమేమిటి?అన్నది తెలియాలంటే సినిమా చూడాల్సిందే!



# మాస్ హీరోగా కనిపించడమే ఇష్టం అంటున్న నాని

పక్కింటి కుర్రాడిలా కనిపించే నాని అష్టా చమ్మా చిత్రంతో హీరోగా పరిచయమయ్యాడు. ఆ తరువాత, ఈగ చిత్రంతో ఏకంగా దర్శకధీరుడు రాజమౌళి చిత్రంలో నటించే ఛాన్స్‌ను కొట్టేశాడు. ఆ తరువాత నానికి వెనుతిరిగి చూసుకోవాల్సిన అవసరం లేదు. ఎవడే సుబ్రమణ్యం, భీమిలి కబడ్డి జట్టు, అలా మొదలైంది, పిల్లా జమిందార్, భలే భలే మగాడివోయ్,జెర్సీ, నేనులోకల్, ఎమ్‌సీఏ, నిన్నుకోరి, శ్యామ్ సింగరాయ్, దసరా వంటి విజయాలను తన ఖాతాలో వేసుకున్నాడు.ఆయన ప్రస్తుతం వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో సరిపోదా శనివారం చిత్రంలో నటిస్తున్నాడు.. ఈ నెలలోనే ఆ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే నేచురల్‌స్టార్‌గా పక్కింటి కుర్రాడిగా కనిపించే నానికి లవ్‌స్టోరీస్, ఫ్యామిలీఎంటర్‌టైనర్ చిత్రాలే ఇప్పటి వరకు హిట్స్‌ను తీసుకొచ్చాయి. అయితే నానికి మాత్రం తను మాస్ హీరోగా మాస్ ఎంటర్‌టైనర్ సినిమాలు చేయాలని కోరిక. అందుకే ఆ తరహా సినిమాలు వీ, దసరా, శ్యామ్ సింగరాయ్ చిత్రాలను చేసి తన కోరిక తీర్చుకున్నాడు. అయితే ఆ చిత్రాలు నానికి అంతగా సంతృప్తి నివ్వలేదు. అందుకే సరిపోదా శనివారం తరువాత వరుసగా మూడు మాస్ సినిమాల్లో నాని కనిపించబోతున్నాడు. ప్రస్తుతం హిట్ 2 చిత్రంలో అర్జున్ సర్కార్‌గా కనిపిస్తున్న నాని త్వరలో మరో రెండు చిత్రాల్లో మాస్ అవతార్‌లో కనిపించబోతున్నాడు. దసరా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ఓ మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్న నాని ఆ తరువాత సుజిత్ దర్శకత్వంలో ఓ సినిమా చేయడానికి అంగీకరించాడు. ప్రస్తుతం సుజిత్ పవన్‌కళ్యాన్‌తో ఓజీ అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. ఈ సినిమా తరువాత నానితో చేయబోయే సినిమా వుంటుంది. అయితే ఈ చిత్రంలో నాని ఫెరోషియాస్, యాంగ్రిమెన్‌గా ఫుల్ మాస్ హీరోగా కనిపించబోతున్నాడట. ఈ విషయాన్ని నానినే ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలియజేశాడు. అంతేకాదు తనను ఇలా ఓ మాస్ హీరోగా చూడాలన్న తన అభిమానుల కోరిక కూడా ఈ సినిమాతో తీరబోతుందని అంటున్నాడు నాని.

# థియేటర్లకు రాకుండా చేస్తున్నాం

## దిల్‌రాజు ఆసక్తికర వ్యాఖ్యలు



ప్రేక్షకులు థియేటర్స్‌కు రాకుండా మేమే చెడగొట్టామని ప్రముఖ నిర్మాత దిల్‌రాజు అన్నారు. నాలుగు వారాలకే సినిమాను ఓటీటీలోకి తీసుకురావడం వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని వ్యాఖ్యానించారు. ఎప్పటి కప్పుడు పరిశ్రమలోని పరిస్థితులను అంచనా వేస్తూ, అందుకు తగినట్లు సినిమాలు నిర్మించే వారిలో దిల్‌రాజు ఒకరు. తాజాగా ఓటీటీలపై ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్‌టాపిక్ అయ్యాయి. 'రేవు' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడారు. కొత్తవాళ్లతో సినిమాలు తీసే పక్రియ ఇండస్ట్రీలో ఎప్పుడూ జరుగుతూనే ఉంటుంది. కానీ, 99శాతం ఫెయిల్ అవుతాయి. ఒకశాతం మాత్రమే సక్సెస్ రేట్. కెరీర్ తొలినాళ్లలో నేను సినిమాలు తీసేటప్పుడు నా సినిమాకు ఆడియన్స్ ఎలా వస్తారు? ఇంకా ఏమేం యాడ్ చేయాలి? అనుకుంటూ తీసేవాడిని. సినిమా తీయడం ఈ రోజుల్లో గొప్ప కాదు. ప్రేక్షకుడు థియేటర్‌కు వచ్చి ఆ మూవీని చూడటమే బిగ్ ఛాలెంజ్. మేము తీసిన 'బలగం', 'కమిటీ కుర్రోళ్ళు' నెమ్మదిగా మౌత్ టాక్ ద్వారా ప్రేక్షకులకు చేరాయి. అదే సమయంలో సినిమా బాగుందని రివ్యూలు ఇవ్వడం కూడా ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. అసలు ప్రేక్షకులను చెడగొట్టింది మేమేలెండీ.. 'మీరు ఇంట్లో కూర్చోండి. నాలుగు వారాల్లో ఓటీటీకి తెస్తాం' అని థియేటర్‌కు రాకుండా చేసుకున్నాం. ఈ సినిమా (రేవు) చూసి నేను కూడా రివ్యూ ఇస్తా (నవ్వులు). మంచి సినిమా.. అదీ చిన్న మూవీ అయితే, ఇండస్ట్రీలోని ప్రతి ఒక్కరూ సహకారం అందించాలి' అని దిల్‌రాజు అన్నారు. ప్రస్తుతం దిల్‌రాజు వ్యాఖ్యలపై అటు ఇండస్ట్రీతో పాటు, ఇటు సామాజిక మాధ్యమాల వేదికగానూ చర్చ జరుగుతోంది. కరోనా తర్వాత వందల చిత్రాలు బాక్సాఫీస్ వద్ద సందడి చేశాయి. థియేట్రికల్ రన్ బాగున్న సినిమాలు కూడా ముందుగానే స్ట్రీమింగ్‌కు వచ్చేశాయి. సినిమా విడుదలకు ముందే ఓటీటీ సంస్థలతో చిత్ర బృందాలు చేసుకున్న ఒప్పందాల కారణంగా రాక తప్పని పరిస్థితి. 'సలార్', 'టిల్లు స్క్వేర్', 'ది ఫ్యామిలీ స్టార్' వంటి చిత్రాలన్నీ జయాపజయాలతో సంబంధం లేకుండా త్వరగా ఓటీటీ బాటపట్టాయి.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com